బుధవారం 21-6-2023


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 90

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రపంచ బ్యాడ్మింటన్' ర్యాంకింగ్స్

సాత్విక్ సాయిరాజ్–చిరాగ్‌శెట్టి జోడీకి మూడో ర్యాంక్ - 14లో



హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలా విక్రయం

విద్య రుణాల విభాగాన్ని రూ.9,060 కోట్లకు విక్రయించినట్లు వెల్లడి - 15లో



శాంతి వైపే భారత్

అమెరికా పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఉక్రెయిన్–రష్యా యుద్ధంపై తటస్థంగా లేమని, శాంతి వైపే ఉన్నామన్నారు.


వివరాలు 6లో ►



టైటానిక్ వీక్షణకు వెళ్లి..

టైటానిక్ నౌక శకలాల సందర్శనకు వెళ్లిన మినీ జలాంతర్గామి గల్లంతయ్యింది. యాత్రికుల్లో ముగ్గురు కుబేరులున్నారు.

వివరాలు 6లో ►



వైభవంగా జగన్నాథుని రథయాత్ర

ఒడిశాలోని పూరి జగన్నాథుడి రథయాత్ర వైభవంగా జరిగింది. లక్షలాది మంది భక్తులు జగన్నాథుడిని దర్శించుకున్నారు.

వివరాలు 6లో ►



రూ.315 కోట్ల విరాళం

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, చైర్మన్ నందన్ నీలేకని తాను విద్యనభ్యసించిన ఐఐటీ–బాంబేకు రూ.315 కోట్ల విరాళమిచ్చారు.

వివరాలు 6లో ►

మెరిసిన మాణిక్యాలు

విజయవాడలో 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డుల ప్రదానోత్సవం

88 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లకు ఘన సత్కారం

- మన విద్యార్థులు ప్రపంచానికి అభివృద్ధి ఫలాలను అందించాలి: సీఎం జగన్
- మట్టి నుంచి పెరిగిన ఈ మొక్కలు మహా వృక్షాలై ఎదగాలి
- మిమ్మల్ని చూస్తుంటే ముచ్చటేస్తోంది..
- సర్కారు విద్యాసంస్థలను ఇంకా గొప్పగా తీర్చిదిద్దుతాం.. క్లాస్ టీచర్లే సరిగ్గా ఉండని పరిస్థితి నుంచి సబ్జెక్ట్ టీచర్లను తీసుకొచ్చాం
- ప్రైవేట్ స్కూళ్లు గవర్నమెంట్ బడులతో పోటీ పడక తప్పని పరిస్థితి కల్పించాం
- మూడో తరగతి నుంచి టోఫెల్ పరీక్షకు సన్నద్ధం.. ఈ ఏడాది నుంచే..
- రాష్ట్రంలో ఇప్పటికే 'సీబీఎస్‌ఈ'.. రానున్న రోజుల్లో 'ఐబీ' సిలబస్ కూడా తెస్తాం
- అంతర్జాతీయ విధానాలకు అనుగుణంగా మన పరీక్ష పత్రాలను కూడా మారుస్తాం
- ఇకపై ప్రతి ఏటా సత్కారం

2 లో


పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన శిరీషకు అవార్డు ప్రదానం చేస్తున్న సీఎం జగన్

"ఈరోజు నా కళ్ల ముందు మెరిసే నక్షత్రాలు, రాష్ట్ర భవిష్యత్తు కనిపిస్తున్నాయి. ప్రతి విద్యార్థి ముఖంలో కాంతి, ఆత్మ విశ్వాసం తొణికిసలాడుతుండటం చాలా ఆనందాన్ని కలిగిస్తోంది. పాఠశాల స్థాయిలో విజయం వైపు పడిన ఈ అడుగులు అత్యున్నత శిఖరాన్ని చేరుకోవాలి. మట్టి నుంచి పెరిగిన ఈ మొక్కలు మహా వృక్షాలై ప్రపంచానికే అభివృద్ధి ఫలాలను అందించాలి. - సీఎం వైఎస్ జగన్

ఖాతాదారుల హక్కుల పరిరక్షణకే..

'మార్గదర్శి'పై దర్యాప్తు



- మార్గదర్శి సంస్థ అక్రమాలు వెలుగులోకి తెస్తున్నాం
- ఇప్పటికే 23 గ్రూప్ చిట్స్‌లో రూ.604 కోట్ల టర్నోవర్ నిలిపివేత
- సోదాల్లో రకరకాల అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి.. ఇలాగైతే మార్గదర్శి కొనసాగడం కష్టమే
- నిబంధనల అతిక్రమణపై పక్కా ఆధారాలున్నాయి
- ప్రజలు మోసపోయి ఫిర్యాదు చేయకముందే వారి సొమ్ము కాపాడే చర్యలు.. చట్టాలకు లోబడే మా దర్యాప్తు సాగుతోంది
- చిట్‌ఫండ్స్ చట్టం అమలు కాకుండా 26 ఏళ్లు ఆపిన రామోజీ
- ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్

2 లో

ఫ్యాక్ట్ చెక్

భూసార పరీక్షలపై 'ఈనాడు' బురద రాతలు

12 లో

తొక్క తీస్తా.. నార తీస్తా.. ఏమిటీ భాష?



- జనసేన అధ్యక్షుడు పవన్‌కు కాపునేత ముద్రగడ లేఖ
- రాష్ట్రంపై ప్రేమ ఉంటే హోదా, రైల్వే జోన్, స్టీల్ ప్లాంట్ల కోసం పోరాడండి
- నాకంటే మీరు చాలా బలవంతులే కదా
- కాపు ఉద్యమాన్ని చేపట్టి యువతకు రిజర్వేషన్ ఫలాలు ఎందుకు సాధించలేదు?

11 లో

మెరిసిన మాణిక్యాలు

మన విద్యార్థులు ప్రపంచానికి అభివృద్ధి ఫలాలను అందించాలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్


అవార్డు గ్రహీతలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: మట్టిలోనే మాణిక్యాలు వికసిస్తాయని, మన పేదింటి పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో కీర్తి గడించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్పొరేట్ స్కూళ్లు సైతం ఈర్ష్య పడేలా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన మార్కులను చూస్తుంటే ముచ్చటేస్తోందని, ప్రభుత్వ విద్యాసంస్థలను మరింత గొప్పగా మార్చాలనే కోరిక పెరుగుతోందని సీఎం పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో 'ఐబీ' సిలబస్ కూడా తెస్తామని, అంతర్జాతీయ విధానాలకు అనుగుణంగా మన పరీక్ష పత్రాలను కూడా మారుస్తామని తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య విద్యా సంస్థల్లో చదువుతూ ఆయా విద్యాసంస్థల్లో రాష్ట్ర స్థాయి టాపర్లుగా నిలిచిన 42 మంది టెన్త్ విద్యార్థులు, ఇంటర్‌లో గ్రూపుల వారీగా టాపర్లు 26 మందిని 'జగనన్న ఆణిముత్యాలు–స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్–2023'తో ఘనంగా సత్కరించారు. మంగళవారం విజయవాడలో జరిగిన ఈ వేడుకకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను సత్కరించారు. ఉన్నత విద్యలో ఐదు కేటగిరీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన 20 మంది విద్యార్థులను కూడా 'స్టేట్ ఎక్సలెన్స్ అవార్డు'తో సత్కరించారు. అనంతరం సీఎం జగన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.

నాలుగేళ్లలోనే సదుపాయాలన్నీ..

సర్కారు బడికి జీవం పోస్తూ ఆణిముత్యాలను సత్కరించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. ఈ ఏడాది రాష్ట్రం మొత్తమ్మీద నాలుగు స్థాయిల్లో టెన్త్, ఇంటర్‌లో టాప్ ర్యాంకుల్లో నిలిచిన 22,768 మంది విద్యార్థులను సత్కరిస్తున్నాం. ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. టాప్ ర్యాంకులు సాధించిన మీరే కాకుండా ఇతర విద్యార్థులకు కూడా సమాన ప్రాధాన్యం ఉంది. మిమ్మల్నందరినీ చూస్తుంటే ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలను మరింత గొప్పగా మార్చాలనే కోరిక పెరుగుతోంది. సంకల్పం గట్టిదైతే ఫలితం అదే వస్తుందని గుర్తుపెట్టుకోవాలి. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థల రూపురేఖలు మారిపోయాయి. రుచికరమైన మెనూ, పౌష్టికాహారంతో జగనన్న గోరుముద్ద అందిస్తున్నాం. పాఠశాలలు తెరవగానే జగనన్న విద్యా కానుక అందిస్తున్నాం. గవర్నమెంట్ స్కూళ్లు నాలుగేళ్లలోనే ఇంగ్లిష్ మీడియంకు మారాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష మీడియం, సీబీఎస్ఈ సిలబస్ అందుబాటులోకి వచ్చింది. పాఠ్య పుస్తకాల సిలబస్ మారింది. బైలింగ్యువల్ టెక్స్ట్‌బుక్స్ సమకూర్చాం. బైజూస్ కంటెంట్ అందుబాటులోకి తెచ్చాం. ఆరో తరగతి నుంచి ఐఎఫ్‌పీ ప్యానెళ్ల ద్వారా డిజిటల్ బోధన అందిస్తున్నాం. ఎనిమిదో తరగతి పిల్లలకు కంటెంట్ లోడెడ్ ట్యాబ్‌లను ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. గతంలో క్లాస్ టీచర్లే సరిగా లేని దుస్థితి నుంచి సబ్జెక్ట్ టీచర్లను అందుబాటులోకి తెచ్చాం. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలన్నీ సమకూరాయి.

సాధ్యమేనా? అనే పరిస్థితి నుంచి..

మన పేదింటి పిల్లలందరూ అంతర్జాతీయంగా ఎదగాలనే ఉద్దేశంతో మూడో తరగతి నుంచి విద్యార్థులను టోఫెల్ పరీక్షకు సిద్ధం చేసి అంతర్జాతీయ సర్టిఫికెట్ అందచేసే గొప్ప అడుగు ఈ సంవత్సరం పడుతోంది. ప్రభుత్వ స్కూళ్ల పిల్లలను ఇంగ్లీష్ వినడం, మాట్లాడటంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దుతున్నాం. ఇలాంటి మార్పులు గవర్నమెంట్ బడుల్లో రాగలవా? సాధ్యమయ్యే పనేనా..? అనే పరిస్థితి నుంచి ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ స్కూళ్లతో పోటీ పడక తప్పదనే పరిస్థితి తీసుకొచ్చాం. ప్రతి అక్కచెల్లెమ్మకు ఒక మంచి అన్నగా, తమ్ముడిగా పిల్లలందరికీ మంచి చదువులు అందాలని మనసారా కోరుకుంటున్నా.

ఫీజు ఎంతైనా ప్రభుత్వమే భరిస్తుంది

ప్రతి విద్యార్థీ కనీసం డిగ్రీతో బయటకు రావాలి. ఏ పిల్లాడి తల్లిదండ్రీ అప్పుల పాలయ్యే పరిస్థితి రాకూడదు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అమ్మ ఒడి అనే గొప్ప కార్యక్రమం తీసుకొచ్చాం. విద్యాదీవెన, వసతి దీవెన అమలు చేస్తున్నాం. డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటి కోర్సులన్నింటికీ మొత్తం ఫీజులన్నీ ప్రభుత్వమే భరిస్తోంది. విదేశాల్లో కూడా టాప్ 50 యూనివర్సిటీల్లో 21 ఫ్యాకల్టీల్లో 350 కాలేజీల్లో సీటు తెచ్చుకోండి. మీకు మీ జగన్ మామ ప్రభుత్వం అండగా ఉంటుంది. ఫీజు రూ.1.25 కోట్లైనా మీరు భయపడాల్సిన పనిలేదు.

పేదింటి పిల్లలు ప్రపంచాన్ని ఏలాలి

మన పిల్లలందరూ ప్రతి రంగంలోనూ ఎదగాలి, మన కీర్తి ఎగరాలి. ప్రపంచంలో వస్తున్న ఆవిష్కరణలు, వినూత్న విధానాలను మన పిల్లలు అనుసరిస్తూ ప్రతి రంగంలోనూ ప్రపంచ లీడర్లుగా ఉండాలనే తపన, తాపత్రయంతో అడుగులు వేస్తున్నాం. ఇది జరగాలంటే నాణ్యమైన విద్య అందించాలి. ఈ నాలుగేళ్లల్లో విద్యపై మన ప్రభుత్వం పెట్టిన శ్రద్ధ దేశంలో ఎవరూ తీసుకుని ఉండరు. రానున్న రోజుల్లో మన ప్రభుత్వ స్కూళ్లలో ఐబీ (ఇంటర్నేషనల్ బాకలారియేట్) సిలబస్ కూడా తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతుంది. అంతర్జాతీయ విధానాలకు అనుగుణంగా మన పరీక్ష పత్రాలు కూడా మార్పు చేయాల్సిన అవసరం ఉంది. గవర్నమెంట్ బడుల్లో చదువుకుంటున్న పేద వర్గాలు ప్రపంచాన్ని ఏలే పరిస్థితి త్వరలోనే వస్తుంది. అది మనమంతా చూస్తాం. నాయకత్వ లక్షణాలను పెంచే విధంగా మన చదువులున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్సెస్, మెషీన్ లెర్నింగ్, చాట్ జీపీటీ యుగంలో ఉన్న మన పిల్లలందరూ ఎదగాలి. ఆ స్థాయిలో మన విద్యారంగం మారబోతోంది. ఆ మేరకు మార్పులు చేస్తాం.

విద్యార్థులతో కలసి ఉత్సాహంగా

విద్యార్థుల సత్కార వేడుకలో ముఖ్యమంత్రి జగన్ చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. పురస్కారాల ప్రదానం సందర్భంగా ప్రతి విద్యార్థి, టీచర్‌ను పేరు అడిగి మరీ అభినందించారు. పురస్కార గ్రహీతల్లో బాలికలు ఎక్కువ మంది ఉండడంపై సీఎం ఆనందం వ్యక్తం చేశారు. బాలికా విద్యను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.


డిజిటల్ క్లాసులకు సంబంధించిన బోధన విధానాలను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

టాపర్లకు నగదు బహుమతులు

- మొదటి స్థానంలో నిలిచినవారికి రూ.లక్ష నగదు
- రెండో బహుమతిగా రూ.75 వేలు, మూడో బహుమతి రూ.50 వేలు



పదో తరగతి విభాగంలో పల్నాడు జిల్లాకు చెందిన వెంకటేశ్‌కు అవార్డు అందజేస్తున్న సీఎం జగన్

ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య విద్యాసంస్థల్లో టెన్త్, ఇంటర్ చదివి రాష్ట్ర స్థాయిలో ఆయా విద్యాసంస్థల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు సీఎం జగన్ చేతుల మీదుగా నగదు పురస్కారాలను ప్రదానం చేశారు. పదో తరగతిలో మొదటి మూడు స్థానాల్లో 42 మంది విద్యార్థులు టాపర్లుగా నిలవగా 11 మంది ప్రథమ స్థానం, 16 మంది ద్వితీయ స్థానం, 15 మంది తృతీయ స్థానం సాధించారు. ఇంటర్‌లో గ్రూప్‌నకు ఒక్కరు చొప్పున 26 మంది విద్యార్థులు టాపర్లుగా నిలిచారు. తొలి స్థానంలో నిలిచినవారికి రూ.లక్ష నగదు, రెండో స్థానం సాధించినవారికి రూ.75 వేలు, తృతీయ స్థానంలో ఉన్నవారికి రూ.50 వేల నగదు చొప్పున బహుమతి అందజేశారు.

ఉన్నత విద్యలో 20 మందికి పురస్కారం

ఉన్నత విద్యలో వివిధ విభాగాల్లో ప్రతిభావంతులైన 20 మంది విద్యార్థులకు స్టేట్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. కమ్యూనిటీ సర్వీసెస్, ఉత్తమ విద్యార్థి, ప్రతిభావంతుడైన విద్యార్థి, స్టూడెంట్ ఇన్నొవేషన్ విభాగాలతో పాటు క్విజ్ చాంపియన్‌షిప్‌లో గెలుపొందిన తొలి మూడు జట్లకు కూడా నగదు ప్రోత్సాహకాలు అందించారు. ప్రతి విభాగంలో మొదటి స్థానానికి రూ.లక్ష, రెండో స్థానానికి రూ.75 వేలు, మూడో స్థానానికి రూ.50 వేలు చొప్పున నగదు అందజేశారు. ఉత్తమ విద్యార్థి, ప్రతిభావంతుడైన విద్యార్థి కేటగిరీల్లో కన్సొలేషన్ బహుమతి కింద రూ.10 వేలు ప్రదానం చేశారు. టెన్త్, ఇంటర్, ఉన్నత విద్యలో మొత్తం 88 మంది టాపర్లుగా నిలిచారు. విద్యార్థులందరినీ ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సత్కరించారు.


శ్రీపద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థిని కుసుమకు అవార్డును అందజేస్తున్న సీఎం జగన్

స్ఫూర్తిదాయకం.. ఆరోగ్యకరమైన పోటీ

సీఎం చేతుల మీదుగా పురస్కారాలు అందించడం మరింత మంది విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతుంది. ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంపొందిస్తున్నాం. అలాంటి విద్యార్థులను తయారు చేసిన అధ్యాపకులకు అభినందనలు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ విద్యా రంగానికి ఇంత ప్రాధాన్యం ఇవ్వలేదు. అందరూ గర్వపడేలా అవకాశాలు కల్పిస్తున్నాం. సామాన్య కుటుంబం నుంచి వచ్చినా ఉన్నత విద్య అభ్యసించేలా సీఎం జగన్ తోడుగా నిలిచి ప్రోత్సహిస్తున్నారు. డిజిటల్ విద్యలో మన విద్యార్థులు రాణించేలా చర్యలు చేపట్టారు. – బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి

కష్టాలు చెప్పుకున్న విద్యార్థులకు అభయం

అవార్డుల ప్రదానం సందర్భంగా కొందరు విద్యార్థులు తమ కష్టాలను తెలియచేయడంతో వెంటనే స్పందించిన సీఎం జగన్ సాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

- తిరుపతికి చెందిన కందాటి కుసుమ పద్మావతి మహిళా యూనివర్సిటీలో బయోటెక్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. 'బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' అవార్డు అందుకున్న ఆమె తల్లి లంగ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్టు సీఎం జగన్ దృష్టికి తేవడంతో వైద్యం తీసుకుంటున్నారా? అని ఆరా తీశారు. వివరాలు సేకరించి అవసరమైన సాయం అందించాలని అక్కడ ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్యను సీఎం ఆదేశించారు.
- అనకాపల్లి జిల్లా నాతవరం గ్రామానికి చెందిన చిన్ని పావని నక్కపల్లి కేజీబీవీలో బైపీసీ చదివి 976 మార్కులు సాధించింది. తల్లిదండ్రులను కోల్పోయిన ఆమె బాగోగులను విశాఖలోని ఓ ట్రస్ట్ చేపట్టింది. తనకు డాక్టర్ కావాలని ఉందని, స్తోమత లేదని పావని పేర్కొనడంతో వెంటనే స్పందించిన సీఎం జగన్ నీట్ శిక్షణకు అవసరమైన సాయం అందించాలని విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను ఆదేశించారు. మరికొందరు విద్యార్థులు కూడా తమ సమస్యలను సీఎం దృష్టికి తేవడంతో వారందరికీ సాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా...

రాష్ట్రపతికి సీఎం జగన్ జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి,అమరావతి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టినరోజు సందర్భంగా ఆమెకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంపూర్ణ ఆరోగ్యంతో సంతోషంగా ఉండాలని సీఎం వైఎస్ జగన్ ఆకాంక్షించారు. యావత్ జాతికి స్ఫూర్తి ప్రదాత అని రాష్ట్రపతిని కొనియాడారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్వీట్ చేశారు.

సీఎం జగన్ చిత్రపటానికి వైద్య ఉద్యోగుల క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి ఎమ్మెల్యే బాలినేనితో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న సంఘం నేతలు

ఒంగోలు అర్బన్: సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ఏపీ రాష్ట్ర కాంట్రాక్ట్ ఫార్మసిస్ట్స్ అండ్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు.ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో వైద్య ఉద్యోగులు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగాలు చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని 22 ఏళ్లుగా ప్రభుత్వాల చుట్టూ తిరిగామన్నారు. పాదయాత్రలో వైఎస్ జగన్ మాకు ఇచ్చిన మాట మేరకు కాంట్రాకట్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ అన్నీ వర్గాలకు న్యాయం చేయడమే సీఎం జగన్ లక్ష్యమన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ డివిజన్లు 74కు పెంపు

సాక్షి, అమరావతి: పరిపాలనా సౌలభ్యం కోసం ఏపీలోని విద్యాశాఖ డివిజన్లను 74కు పెంచుతూ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. కొత్త జిల్లాల ఆధారంగా రెవెన్యూ డివిజన్లను సైతం పెంచడంతో ఆ మేరకు విద్యాశాఖ డివిజన్ల విభజన చేపట్టారు. గతంలో 13 జిల్లాల్లో 53 డివిజన్లు ఉండగా, డివిజన్‌కు ఒక్కరు చొప్పున డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి ఉండేవారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో ఒక్కో డీవైఈఓ పరిధిలో 1,132 పాఠశాలలను పర్యవేక్షించాల్సి వచ్చేది. పనిభారం తగ్గించేందుకు కొత్త రెవెన్యూ డివిజన్లకు సమానంగా 74 డివిజన్లకు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌ను నియమించనున్నారు.

గంటలోపే సాయం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: అనారోగ్యంతో బాధపడుతున్న తమ కుటుంబ సభ్యులను ఆదుకోవాలంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరిన ఇద్దరు మహిళలకు గంట వ్యవధిలోనే సాయం అందింది. మంగళవారం విజయవాడలోని 'ఏ' కన్వెన్షన్ హాల్‌లో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి జగన్ తన క్యాంపు కార్యాలయానికి తిరిగి వెళ్తుండగా బాధిత కుటుంబాలు ఆయన్ను కలిసి తమ గోడు చెప్పుకోవడంతో ధైర్యం చెప్పి ఓదార్చారు. బాధిత కుటుంబం అనారోగ్యం వివరాలను సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ సీఎం దృష్టికి తేవడంతో వెంటనే ఆదుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

విజయవాడ ప్రకాష్‌నగర్‌కు చెందిన గూడవలస కృష్ణవేణి భర్త రాఘవేంద్రరావు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఎడమ భుజానికి వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండటంతో సీఏఆర్‌టీ సెల్ థెరపీ చికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. కృష్ణవేణి అభ్యర్థనను పరిశీలించిన సీఎం తక్షణం సాయం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును ఆదేశించగా ఆయన గంట వ్యవధిలోనే బాధిత కుటుంబానికి కలెక్టర్ కార్యాలయంలో రూ.లక్ష చెక్కును తక్షణ సాయంగా అందజేశారు. ముంబై, చెన్నై, హైదరాబాద్‌ల్లోని క్యాన్సర్ ఆసుపత్రిలో ఈ చికిత్స అందుబాటులో ఉన్నట్లు గుర్తించామని, వైద్య పరీక్షల వివరాలను పరిశీలించి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.



కృష్ణవేణి సమస్యను వింటున్న సీఎం.. అనంతరం సీఎం ఆదేశంతో చెక్కు అందజేస్తున్న కలెక్టర్

విజయవాడ కృష్ణలంకకు చెందిన కొలుసు వెంకట నాగరామమోహన్‌రావు, నాగసుధ కుమారుడు కొలుసు వెంకట కళ్యాణ్ పుట్టుకతో ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. తమ కుమారుడికి ఊపిరితిత్తుల మార్పిడి ఆపరేషన్‌కు సాయం అందించాలని బాధిత కుటుంబం సీఎంను అభ్యర్థించింది. సీఎం ఆదేశాల మేరకు గంట లోపే బాధిత కుటుంబానికి కలెక్టర్ ఢిల్లీరావు రూ.లక్ష చెక్కును తక్షణ సాయంగా కార్యాలయంలో అందజేశారు. యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకట కళ్యాణ్‌కు ప్రభుత్వం రూ.15 లక్షలు సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థిక సాయం అందించిందని, మరింత మెరుగైన వైద్యం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



నాగసుధ సమస్యను వింటున్న సీఎం.. సీఎం ఆదేశంతో చెక్కు అందజేస్తున్న కలెక్టర్

23 మార్గదర్శి చిట్ గ్రూపులు రద్దు

- తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలడంతో రిజిస్ట్రేషన్లశాఖ చర్యలు
- మార్గదర్శిలో తవ్వినకొద్దీ బయటపడుతున్న మోసాలు
- ఇప్పటికే నిధుల మళ్లింపు, అక్రమంగా సేకరించిన డిపాజిట్లపై విచారణ
- తాజాగా మరిన్ని ఉల్లంఘనల గుర్తింపు
- వాటి ఆధారంగా చిట్ గ్రూపులు రద్దు.. ఇకపై వాటి నియంత్రణ చిట్స్ రిజిస్ట్రార్లదే

సాక్షి, అమరావతి: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీలో తవ్వినకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. తాజాగా అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్లు, ఆడిటర్లు పలు బ్రాంచిల్లో నిర్వహించిన తనిఖీల్లో.. మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీ నిబంధనలు ఉల్లంఘించడంతోపాటు చందాదారుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించినట్లు తేలింది. దీంతో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆ కంపెనీకి చెందిన 23 చిట్ గ్రూపులను స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ రద్దుచేసింది. అనంతపురం బ్రాంచిలో రెండు, అరండల్‌పేటలో 1, నరసరావుపేటలో 3, రాజమహేంద్రవరంలో 2, తణుకులో 1, విశాఖ డాబా గార్డెన్స్, కూర్మన్నపాలేల్లో ఒక్కొక్కటి, విశాఖ ఎంవీపీ బ్రాంచిలో రెండు, విశాఖ సీతంపేట బ్రాంచిలో 10 చిట్ గ్రూపులు రద్దయ్యాయి. ఈ చిట్ గ్రూపులు రూ.25 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉన్నాయి.

తాజా అక్రమాలివే

గ్రూపు ప్రారంభించినప్పుడు అన్ని టికెట్లు నిండకపోయినా నిండినట్లు చిట్ రిజిస్ట్రార్‌కి తప్పుడు డిక్లరేషన్లు సమర్పించినట్లు తాజా తనిఖీల్లో నిర్ధారణ అయింది. సాధారణంగా చిట్ గ్రూపు ప్రారంభమైనప్పుడు అన్ని టికెట్లు నిండవు. కొన్ని ఖాళీలు క్రమంగా తర్వాత నెలల్లో భర్తీ అవుతాయి. కానీ ఈ విషయాన్ని దాచిపెట్టి అన్ని టికెట్లు భర్తీ అయినట్లు కంపెనీ ఫోర్‌మెన్లు డిక్లరేషన్లు ఇచ్చారు. అలాగే చిట్ గ్రూపులు ప్రారంభమైనప్పుడు ఖాళీగా ఉన్న టికెట్లను కంపెనీ తనపేరు మీదే ఉంచుకుంటుంది. అలా తన పేరున ఉన్న టికెట్లకు సంబంధించిన చందాలను కట్టాల్సి ఉన్నా.. కమిషన్‌పోగా కట్టాల్సిన సొమ్మును కట్టకుండా కంపెనీ చందాదారులను మోసం చేసింది. అలా డబ్బు కట్టకపోవడం వల్ల మిగతా గ్రూపుల్లో చిట్లు పాడుకున్న వారికి ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించడంలో తీవ్రజాప్యం జరుగుతున్నట్లు గుర్తించారు. పాట పాడుకున్న చందాదారులకు ఆ సొమ్ము ఇవ్వకుండా రశీదుల పేరుతో ఆ సొమ్మును డిపాజిట్లుగా ఉంచారు. అన్ని నెలలు చిట్ చందా కట్టినవారినే పాటకు అనుమతించాలి. కానీ మార్గదర్శిలో కొన్ని నెలలు కట్టి మధ్యలో కట్టకుండా ఉన్న వారిని కూడా పాటకు అనుమతించి, వారు పాడుకున్న తర్వాత వచ్చిన డబ్బును తమకు చెల్లించాల్సిన దానిగా కట్టించుకున్నారు. కొన్ని గ్రూపుల్లో వేలం పాట నిర్వహించకుండానే ప్రతినెలా చందాలు కట్టించుకున్నారు. ఇవన్నీ చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధమే. ఈ ఉల్లంఘనలున్న చిట్ గ్రూపులను రద్దు చేశారు. దీంతో రద్దయిన 23 చిట్ గ్రూపులు సంబంధిత జిల్లాల చిట్ రిజిస్ట్రార్ల నియంత్రణలోకి వస్తాయి. వాటితో కంపెనీకి సంబంధం ఉండదు. ఆ గ్రూపులను చిట్ రిజిస్ట్రార్లే నిర్వహిస్తారు. చందాదారులకు ఎటువంటి ఇబ్బంది ఉండదు.

ఇప్పటికే రామోజీరావు సహా పలువురిపై కేసు నమోదు


ఇప్పటికే మార్గదర్శిలో భారీగా అక్రమాలు బయటపడిన విషయం తెలిసిందే. క్వాలిఫైడ్ ఆడిటర్ తనిఖీలు చేసి ఇచ్చిన నివేదికలో మార్గదర్శి యాజమాన్యం రూ.459.98 కోట్లను మ్యూచువల్ ఫండ్స్, ప్రభుత్వ సెక్యూరిటీలు, ఈక్విటీలకు మళ్లించినట్లు నిర్ధారణ అయింది. చందాదారులు కట్టిన చిట్ల సొమ్మును తన సొంత ప్రయోజనాల కోసం మళ్లించడం, నిబంధనలకు విరుద్ధంగా ఆ సొమ్మును వేర్వేరుచోట్ల పెట్టుబడి పెట్టడం ద్వారా చందాదారులను మోసం చేసినట్లు స్పష్టమైంది. మార్గదర్శి బ్రాంచిల్లో తనిఖీల సమయంలో కంపెనీ మేనేజర్లు రిజిస్ట్రేషన్ల శాఖకు సహకరించకుండా ఇబ్బందులు పెట్టారు. అధికారులకు సరైన సమాచారం ఇవ్వకుండా తప్పుదారి పట్టించేలా వ్యవహరించారు. సమాచారం, వివరాలన్నీ హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆఫీసులోనే ఉన్నాయంటూ తనిఖీ బృందాలకు సహకరించలేదు. దీంతో అధికారులు కార్పొరేట్ ఆఫీసులో తనిఖీలు నిర్వహించి సమాచారం సేకరించారు. బ్యాలెన్స్‌షీట్లు, వెబ్‌సైట్‌లో వివరాలను బట్టి మరికొంత సమాచారం సేకరించారు. అన్నింటినీ పరిశీలించిన తర్వాత మార్గదర్శికి చెందిన విశాఖ, కాకినాడ, ఏలూరు, విజయవాడ, గుంటూరు, పల్నాడు, కర్నూలు, అనంతపురం బ్రాంచిలపై చిట్స్ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు నమోదు చేశారు. వాటి ఆధారంగా మార్గదర్శి చైర్మన్ రామోజీరావు, ఎండీ శైలజ సహా పలువురు బ్రాంచి మేనేజర్లపై సీఐడీ కేసులు నమోదు చేసి అక్రమాలపై మరింత లోతుగా విచారిస్తోంది. జరిగిన ఆడిట్‌లో మరిన్ని మోసాలు బయటపడడంతో 23 చిట్ గ్రూపులను రిజిస్ట్రేషన్ల శాఖ రద్దు చేసింది.

'మార్గదర్శి'పై దర్యాప్తు

ఖాతాదారుల హక్కుల పరిరక్షణకే

సాక్షి, హైదరాబాద్ : మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఖాతాదారుల హక్కుల పరిరక్షణ, ఆర్థిక భద్రత కోసమే ఆ సంస్థలో అక్రమాలను వెలుగులోకి తెస్తున్నామని, అది తమ బాధ్యత అని ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్ స్పష్టం చేశారు. మార్గదర్శి యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా నిధులు మళ్లిస్తుండటంతో ఖాతాదారులకు నష్టం కలగకుండా ఇప్పటికే రూ.1,035 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచ్‌వల్ ఫండ్స్ పెట్టుబడులను అటాచ్ చేసినట్టు తెలిపారు. మార్గదర్శి కంపెనీ ఏ కారణంగానైనా మూతపడితే ఖాతాదారులకు డబ్బులు ఇవ్వాల్సిన బాధ్యత స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఐజీపై ఉంటుందని తెలిపారు. మార్గదర్శి సంస్థ ప్రతి చట్టాన్ని, నిబంధనను అతిక్రమించిందని, ఇంకా అతిక్రమిస్తూనే ఉందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 9 బ్రాంచ్‌లలో 23 గ్రూప్ చిట్స్‌ను, వాటికి సంబంధించి రూ. 604 కోట్ల టర్నోవర్ నిలిపివేసినట్టు చెప్పారు. ఇదే తరహాలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులోని ఇతర బ్రాంచ్‌ల్లోనూ అక్రమాలపై ఆధారాలు లభిస్తే.. వాటిలోని చిట్ గ్రూప్‌ల టర్నోవర్ నిలిచిపోతుందని చెప్పారు. చివరకు మార్గదర్శి పడిపోతుందన్నారు.

ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్



సంజయ్ మంగళవారం ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మూడేళ్ల లావాదేవీలను పూర్తిగా పరిశీలించి, అక్రమాలపై ఆధారాలు సేకరించామన్నారు. ఏపీతోపా టు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని 108 బ్రాంచ్‌లలో కార్యకలాపాలపై ఆరా తీస్తున్న ట్టు తెలిపారు. ఢిల్లీలోని కేంద్ర ఏజెన్సీలకు కూడా ఈ అక్రమాల సమాచారమిచ్చామని, తెలంగాణ, ఇతర రాష్ట్రాల డీజీపీలకు సమాచారం ఇస్తున్నామన్నారు. ఏపీలో పలు ప్రాంతాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఫిర్యాదు మేరకే ఏపీ సీఐడీ కేసు దర్యాప్తు చేస్తోందని తెలిపారు. పూర్తి నిబంధనలు పాటిస్తూనే ఈ కేసులో ఏ–1 రామోజీరావును, ఏ–2 శైలజాకిరణ్‌ను ప్రశ్నించామన్నారు.

వడ్డీ ఆశ చూపి ఖాతాదారులను మభ్యపెడుతున్నారు

మార్గదర్శి అక్రమాలపై ఖాతాదారుల నుంచి ఫిర్యాదు లేకుండానే కేసు దర్యాప్తు చేస్తున్నారంటూ ఒక సెక్షన్ మీడియా ఆరోపణలు చేస్తోందని, ఖాతాదారులకు వడ్డీని ఆశజూపి ఆ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లిస్తుండటాన్ని తాము వెలుగులోకి తెస్తున్నామన్నారు. ప్రజలు మోసపోయి ఫిర్యాదు చేసేకంటే ముందే తాము వారి సొమ్ము కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఏ బాధితుడి విషయంలో అయినా ఇదే పద్ధతి అని తెలిపారు. చాక్లెట్ ఇచ్చి బాలికను కిడ్నాప్ చేస్తే.. సమాచారం అందిన వెంటనే పోలీసులు దర్యాప్తు ప్రారంభిస్తారు కానీ, బాధితురాలు ఫిర్యాదు ఇచ్చే వరకు కూర్చోరని.. అదే తరహాలో లక్షల మంది ఖాతాదారుల సొమ్మును కాపాడేందుకు మార్గదర్శిపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ అధికారులుగా ప్రజలకు న్యాయం చేస్తుంటే మార్గదర్శిపై కక్షసాధింపు అంటూ ఆ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తమ దర్యాప్తు చట్టానికి లోబడి ఉన్నట్టే.. చిట్‌ఫండ్స్ కంపెనీ నిర్వహణలో రామోజీ సైతం చట్టానికి లోబడి ఉండాలన్నారు.

నిబంధనలున్నా.. వారికి అనుకూలంగా వాడారు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ లావాదేవీలు చిట్‌ఫండ్ యాక్ట్ ప్రకారం కాకుండా రామోజీ, శైలజా కిరణ్ వారికి అనుకూలంగా కంపెనీ యాక్ట్ ప్రకారం చూపుతున్నారని దర్యాప్తులో తేలిందన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే.. తమకు ఆ నిబంధనలు వర్తించవన్న తరహాలో సమాధానాలిచ్చారన్నారు. ఖాతాదారుల నుంచి సొమ్ము వసూలుకు చిట్‌ఫండ్స్ చట్టాన్నే వాడుకొంటున్నారని చెప్పారు. ఇదే తరహాలో చీరాలలో రూ.65 లక్షల డిఫాల్ట్ కేసులో ష్యూరిటీగా ఉన్న వ్యక్తి నుంచి రూ.6 కోట్లు విలువైన ఆస్తిని అటాచ్ చేయించారని తెలిపారు. ఇలాంటి ఎన్నో అంశాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయన్నారు. సంస్థలోని అంతర్గత లుకలుకలు బయటపడతాయనే చిట్‌ఫండ్స్ యాక్ట్‌ను అమలు చేయడంలేదన్నారు. చిట్ సెటిల్‌మెంట్‌లోనూ నిబంధనలు పాటించడంలేదన్నారు. చిట్ ముగిసిన వారి వివరాలతో, కొన్నింటిలో మానేసిన ఖాతాదారుల పేర్లు వాడి మళ్లీ చిట్‌లు నడుపుతున్నారని తెలిపారు. చిట్ డబ్బు బ్రాంచ్‌లో లేకపోవడంపై ప్రశ్నిస్తే.. మీరెవరు ప్రశ్నించేందుకు అన్న రీతిలో సమాధానాలు ఇస్తున్నారన్నారు. చట్టానికి వారు సహకరించడం లేదని చెప్పారు.

చిట్‌ఫండ్స్ చట్టం అమలు కాకుండా ఏకంగా 26 ఏళ్లు అడ్డుకున్నారు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థను చిట్‌ఫండ్ యాక్ట్ 1982 మేరకు నడపడంలేదని అన్నారు. చిట్‌ఫండ్స్ సొమ్ముతో వేరే వ్యాపారం చేయకూడదన్నారు. చిట్‌ఫండ్ యాక్ట్ ప్రకారమే బ్యాలెన్స్ షీట్లు ఫైల్ చేయాల్సి ఉన్నా.. కంపెనీ యాక్ట్స్ ప్రకారం నడుచుకుంటున్నామని ఈ కేసులో ఏ–2 శైలజాకిరణ్ అవివేకంతో కూడిన సమాధానాలు చెప్పారని తెలిపారు. ఒక గ్రూప్ డబ్బు మరో గ్రూప్‌కు వాడొద్దని చట్టం చెబుతున్నా.. మార్గదర్శి బ్రాంచ్‌లన్నింటిలోని డబ్బు అక్రమంగా హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలిస్తున్నట్టు అన్ని ఆధారాలు లభించాయని చెప్పారు. చిట్‌ఫండ్ యాక్ట్ రావడానికి ముందే మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ప్రారంభమైందన్న వింత వాదన తెస్తున్నారన్నారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం 1982లో చిట్‌ఫండ్ యాక్ట్ పాస్ చేస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వాలు చట్టసభల్లో పాస్ చేయాల్సి ఉందన్నారు. కానీ 26 ఏళ్ల తర్వాత 2008లో అమలు చేశారని, ఇన్నేళ్లూ రామోజీరావు పలుకుబడితో అడ్డుకున్నారని వివరించారు.

వీధి దీపాల ఏర్పాటు పనులు 95 శాతం పూర్తి

- మిగిలినవి నెలాఖరు కల్లా పూర్తి
- హైకోర్టుకు నివేదించిన సీఆర్‌డీఏ న్యాయవాది
- వ్యక్తిగత హాజరు నుంచి కమిషనర్‌కు మినహాయింపునిచ్చిన హైకోర్టు

సాక్షి, అమరావతి: విజయవాడ, గుంటూరు నుంచి హైకోర్టుకు వచ్చే రహదారుల్లో వీధి దీపాల ఏర్పాటు పనులు 95% మేర పూర్తయ్యాయని సీఆర్‌డీఏ తరఫు న్యాయవాది శశివర్ధన్ హైకోర్టుకు నివేదించారు. మిగిలిన పనులను కూడా ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, వ్యక్తిగత హాజరు నుంచి సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్‌కు మినహాయింపునిచ్చింది. తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేస్తూ న్యాయమూర్తి జస్టిస్ దొనడి రమేశ్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. హైకోర్టుకు వచ్చే మార్గంలో విద్యుత్ దీపాలు, తగిన రోడ్లు, భద్రత ఏర్పాటు చేసేలా పురపాలకశాఖ, సీఆర్‌డీఏ, పోలీసు అధికారులను ఆదేశించాలంటూ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాలరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు, నిర్దిష్ట గడువులోపు వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశించింది. ఆ ఆదేశాలను కమిషనర్ అమలు చేయలేదంటూ వేణుగోపాలరావు కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇటీవల విచారణ జరిపిన జస్టిస్ రమేశ్, సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన కోర్టు ముందు హాజరయ్యారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

విజయవాడ స్పోర్ట్స్: మతిస్థిమితం లేని మైనర్ బాలికను అత్యాచారం చేసిన వ్యక్తికి ఏడేళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ ఎస్.రజిని మంగళవారం తీర్పు చెప్పారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లికి చెందిన వ్యక్తి విజయవాడలోని బీసెంట్ రోడ్డులోని ఓ దుకాణంలో పని చేసేవాడు. అతని కుమార్తె (15)కు మానసిక పరిస్థితి బాగోక పోవడంతో తన వెంటే షాపునకు తెచ్చేవాడు. 2017 జనవరి 9న తినుబండారాలు కొనుక్కోవడానికి షాపు నుంచి బయటకు వెళ్లిన బాలికను పెదకాకాని మండలం వెనిగండ్లకు చెందిన ధరావత్తు భిక్షా నాయక్ ఏమార్చాడు. తన బైక్‌పై ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై గవర్నర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి అదే నెల 10న నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. బాధితుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నాగిరెడ్డి, నారాయణరెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి కఠిన కారాగార శిక్షతో పాటు రూ.60 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

1 నుంచి 'సచివాలయాల' వద్ద ప్రత్యేక క్యాంపులు

- నాలుగు వారాలపాటు నిర్వహణ
- క్యాంపుల్లో అన్ని రకాల వినతుల పరిష్కారానికి చర్యలు
- 11 రకాల సేవలకు సర్వీసు చార్జీలు ఉచితం
- 24 నుంచి సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ఆధ్వర్యంలో అవగాహన
- జగనన్న సురక్ష కార్యక్రమం విధివిధానాలు ఖరారు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జూలై 1 నుంచి అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రత్యేక క్యాంపుల్లో ప్రధానంగా 11 రకాల సేవలు, ధ్రువీకరణ పత్రాల జారీకి ఎలాంటి సర్వీసు చార్జీలు వసూలు చేయకూడదని నిర్ణయం తీసుకుంది. నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. 'జగనన్నకు చెబుదాం'కు అనుబంధంగా అన్ని రకాల ప్రజా వినతులను సంతృప్త స్థాయిలో పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీని నిర్వహణకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మంగళవారం విధివిధానాలతో కూడిన ఉత్తర్వులను జారీ చేశారు. తహసీల్దార్, ఎంపీడీవోలతో సహా వివిధ మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో జూలై 1 నుంచి సచివాలయాల వారీగా ఈ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. వలంటీర్లతో పాటు సచివాలయాల సిబ్బంది ఈ నెల 24 నుంచే ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమం గురించి వివరిస్తారు. అంతేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ రకాల వ్యక్తిగత ధ్రువీకరణ పత్రాల జారీకి వినతులను కూడా సేకరిస్తారు. క్యాంపుల



నిర్వహణ సమయంలో వినతుల స్వీకరణ, పరిష్కారం కోసం రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, సర్వీసు రిక్వెస్టు డెస్కులను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఆయా డెస్కుల్లో మండల స్థాయి అధికారులు, సచివాలయాల సిబ్బంది నిర్వహించాల్సిన బాధ్యతలను కూడా పొందుపరిచారు.

- గ్రామ సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపుల నిర్వహణ కోసం మండలాల వారీగా ఎంపీడీవో, తహసీల్దార్ల ఆధ్వర్యంలో రెండు వేర్వేరు బృందాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి బృందంలో ముగ్గురేసి మండల స్థాయి అధికారులు ఉంటారు. ఒక మండల పరిధిలో 24 కంటే ఎక్కువగా సచివాలయాలు ఉంటే అవసరమైన పక్షంలో మూడో బృందాన్ని ఏర్పాటు చేసుకునే వెసులుబాటును స్థానిక అధికారులకే అప్పగించారు.
- అత్యధిక వార్డు సచివాలయాలు ఉండే నగరాలు, పట్టణాల్లో దగ్గరగా ఉండే సచివాలయాలను క్లస్టర్‌గా వర్గీకరిస్తారు. ఆ క్లస్టర్ల వారీగా క్యాంపులు నిర్వహిస్తారు. అయితే, క్లస్టర్ పరిధిని గరిష్టంగా ఐదు వార్డు సచివాలయాలకే పరిమితం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.
- క్యాంపుల పర్యవేక్షణకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను జిల్లా కలెక్టర్లు నియమిస్తారు.
- గ్రామీణ ప్రాంతాల్లో ఆయా గ్రామ సచివాలయాల భవనాల్లోనే ఈ క్యాంపులు నిర్వహించాలని పేర్కొన్నారు. అద్దె భవనాల్లో సచివాలయం ఉంటే ఇతర ప్రభుత్వ భవనాల్లో క్యాంపులు నిర్వహిస్తారు.
- ఏ రోజు ఏ సచివాలయం పరిధిలో క్యాంపు నిర్వహిస్తున్నారో ముందస్తుగా అందరికీ తెలిసేలా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొనే సిబ్బంది, వలంటీర్లకు ముందస్తుగా శిక్షణ ఇవ్వాలని సూచించారు.

సచివాలయాల వద్ద నిర్వహించే క్యాంపుల్లో ఈ 11 సర్వీసులకు ఎలాంటి సర్వీసు చార్జీలు ఉండవని ప్రభుత్వం పేర్కొంది. అయితే, మ్యుటేషన్ ఆఫ్ ట్రాన్సాక్షన్‌కు సంబంధించి పాస్ పుస్తకాల జారీకి దరఖాస్తుదారులు చెల్లించాల్సిన స్టాట్యుటరీ చార్జీలను మాత్రం వసూలు చేస్తారు.

సర్వీసు చార్జీలు లేకుండా అందజేసే సేవలివే..

- ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు (కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు)
- ఆదాయ ధ్రువీకరణ పత్రం
- డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్
- మరణ ధ్రువీకరణ పత్రం
- మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్ (భూకొనుగోలు అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు), మ్యుటేషన్ ఫర్ కరక్షన్స్ (ఆన్‌లైన్‌లో భూవివరాల నమోదులో మార్పులు చేర్పులు)
- వివాహ ధ్రువీకరణ పత్రం (పట్టణ ప్రాంతాల్లో 90 రోజుల్లోగా, గ్రామీణ ప్రాంతాల్లో 60 రోజుల్లోపు)
- ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు
- ఆధార్‌కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్
- కౌలు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ)
- కొత్త రేషన్‌కార్డు లేదా రేషన్‌కార్డు విభజన
- ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో కొంత మంది సభ్యుల పేర్ల తొలగింపు.

డీఈఈసెట్ ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి: ఎలిమెంటరీ టీచర్ ట్రైనింగ్‌కు నిర్వహించిన డీఈఈ సెట్ ఫలితాలను పాఠశాల విద్యా శాఖ మంగళవారం విడుదల చేసింది. ఈ టెస్టులో 2,362 మంది పరీక్ష రాయగా 2,051 మంది క్వాలిఫై అయ్యారు. ఫలితాలు, రెస్పాన్స్ షీట్లను https://apdeecet.apcfss.in/ లో పొందుపరిచింది.

ఏపీ ఈసెట్‌కు 91.46 శాతం హాజరు

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): పాలిటెక్నిక్, బీఎస్సీ (గణితం) ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో చేరడానికి నిర్వహించే ఏపీ ఈసెట్ ఆన్‌లైన్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 19,216 మందికిగాను 17,162 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 18,965 మందికి గాను 17,341 మంది హాజరయ్యారు. రెండు సెషన్లు కలిపి 91.46 హాజరు శాతం నమోదైంది.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెట్ చైర్మన్

రాష్ట్రానికి గర్వకారణం క్రికెటర్ భరత్

- ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి
- ఏసీఏ ఆధ్వర్యంలో కేఎస్ భరత్‌కు ఘన సన్మానం

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ క్రికెటర్ కేఎస్ భరత్ రాష్ట్రానికి ఎంతో గర్వకారణమని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు శరత్ చంద్రారెడ్డి అన్నారు. నాలుగేళ్లుగా నైపుణ్యం గల అంతర్జాతీయ క్రికెటర్లను తయారు చేయడమే లక్ష్యంగా ఏసీఏ పని చేస్తోందని చెప్పారు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన తొలి ఏపీ క్రికెటర్ కేఎస్ భరత్‌ను ఏసీఏ ఆధ్వర్యాన మంగళవారం విజయవాడలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ కేఎస్ భరత్ వికెట్ కీపర్‌గా, బ్యాటర్‌గా అద్భుత ప్రతిభతో అంచెలంచెలుగా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎదిగారని కొనియాడారు. భారత క్రికెట్ మాజీ చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ మాట్లాడుతూ ఏపీ నుంచి భారత టెస్టు క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించిన మూడో క్రికెటర్‌గా భరత్ రికార్డు సృష్టించారన్నారు. కేఎస్ భరత్ మాట్లాడుతూ దేశం తరఫున టెస్టు క్రికెట్ ఆడటం అనేది ప్రతి క్రీడాకారుడి కలగా చెప్పారు. ఏసీఏ సీఈవో శివారెడ్డి మాట్లాడుతూ ఏపీలో క్రికెట్ క్రీడకు పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 8 ప్రధాన క్రికెట్ మైదానాలు ఉండగా, మరో 18 చిన్న మైదానాల్లో క్రికెట్ సాధనకు తగిన వసరులు అందుబాటులో ఉంచామని తెలిపారు. కోచ్ కృష్ణారావు మాట్లాడుతూ అపజయాలను చూసి కుంగిపోకుండా క్రమశిక్షణ, విలువలతో ఆటను సాధన చేసి భరత్ విజయం సాధించారన్నారు. టెస్టు క్రికెట్‌లో అడుగుపెట్టేందుకు ఐదేళ్లపాటు సుదీర్ఘంగా కష్టపడినట్టు తెలిపారు. అనంతరం భరత్‌ను ఏసీఏ తరఫున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, కార్యదర్శి గోపీనాథరెడ్డి, సభ్యులు రాకేష్, పురుషోత్తం, గీతా, జె.శర్మ, వివిధ జిల్లాల క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.



కేఎస్ భరత్‌ను సత్కరిస్తున్న శరత్‌చంద్రారెడ్డి, గోపినాథ్‌రెడ్డి, ఎమ్మెస్కే ప్రసాద్ తదితరులు



జీవితంలో నిజమైన వైఫల్యం ఏమిటంటే, తనకు బాగా తెలిసినదానికి సత్యంగా ఉండకపోవడం మాత్రమే.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 21 జూన్ 2023

ఆశలు మోసులెత్తుతున్న వేళ..

భారత ప్రధాని మోదీ మంగళవారం 3 రోజుల అధికారిక పర్యటనకు అమెరికా పయనమవడంతో ఒక చరిత్రాత్మక ఘటనకు తెర లేచింది. ఇది భారత, అమెరికాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను సమూలంగా మార్చివేసే ఘట్టమని విశ్లేషణ. అమెరికాలో వ్యక్తమవుతున్న ఆసక్తి, జరుగుతున్న హంగామా, అధికారిక విందు, చివరకు అమెరికన్ పార్లమెంట్‌లో మోదీ ప్రసంగం – ఇలా పర్యటన అంశాల్ని గమనిస్తే ఆతిథ్యదేశం దీన్ని ఎంతో ప్రత్యేకంగా భావిస్తున్నట్టు అర్థమవుతోంది. ఈ పర్యటనలో రక్షణ, స్వచ్ఛ ఇంధనం, అంతరిక్షం సహా పలు రంగాల్లో భాగస్వామ్యాలపై చర్చలు జరగనున్నాయి. సెప్టెంబర్‌లో జీ20 సదస్సుకు భారత్ ఆతిథ్యమివ్వనున్నందున ఇది ప్రాముఖ్యం సంతరించుకుంది.

నిజానికి, 2014 మేలో తొలిసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి గడచిన తొమ్మిదేళ్ళలో మోదీ అనేకసార్లు అమెరికాలో విస్తృతంగా పర్యటించారు. అయితే, ఇప్పుడు స్నేహపూర్వక ద్వైపాక్షిక సంబంధానికి ఉన్నతస్థాయి వ్యక్తీకరణగా భావించే 'స్టేట్ విజిట్'గా ఈ పర్యటన సాగుతోంది. ఇలా వెళ్ళడం మోదీకీ ఇదే మొదటిసారి. ఒక దేశ ప్రభుత్వాధినేత ఆహ్వానం మేరకు మరో దేశ ప్రభుత్వాధినేత సాగించే ఈ సాదర ఆహ్వానయుత పర్యటనకు సహజంగానే సాధారణ అధికారిక పర్యటనకు మించిన హంగూ, ఆర్భాటం ఉంటాయి. అమెరికా అధ్యక్ష దంపతులు స్వయంగా వైట్‌హౌస్‌లో కళ్ళు మిరుమిట్లుగొలిపే అధికారిక విందుకు ఆతిథ్యమిస్తారు. గతంలో రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ (1963 జూన్), ప్రధాని మన్మోహన్ (2009 నవంబర్)ల తర్వాత ఈ తరహా పర్యటనకు సాదర ఆహ్వానం అందుకున్న మూడో భారత నేత – మోదీయే. అత్యంత సన్నిహితులకూ, మిత్రపక్షాలకే అందించే ఈ ఆహ్వానం భారత, అమెరికాల మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యానికి ప్రతీక.

ప్రపంచ దృశ్యం సంక్లిష్టమవుతున్న వేళ అమెరికా – భారత సంబంధాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. చైనా అనుసరిస్తున్న ఇండో – పసిఫిక్ వ్యూహం, ఆధునిక రక్షణ పరిజ్ఞానం పంచుకోవడం, జీఈ–414 టర్బోఫ్యాన్ జెట్ ఇంజన్ల ఉత్పత్తి లాంటివి ఇరు దేశాల చర్చల అజెండాలో ఉన్నాయి. వ్యూహాత్మక సాంకేతిక విజ్ఞాన భాగస్వామ్యం అటుంచితే, రెండుచోట్లా రాజకీయం వేడెక్కివున్న పరిస్థితులివి. రానున్న ఎన్నికల్లో మళ్ళీ అధికారం చేపట్టేందుకు ఇరువురు నేతలూ సిద్ధమవుతున్న వేళ ఈ పర్యటన ద్వారా వారు ఏ మేరకు ఇమేజ్ పెంచుకొని, సమర్థ నేతగా కనిపిస్తారన్నదీ కీలకమే. స్టేట్ విజిట్లలో అసలే హడావిడి ఎక్కువనుకుంటే, ఎన్నికల సీజన్ ఈ హంగామాను మరింత పెంచేస్తోంది. ప్రవాసీయులు అధికంగా ఉండడం మోదీ పర్యటనకు ఎక్కడ లేని ఈ ఆర్భాటానికొక కారణం కావచ్చు. జనంలో స్వచ్ఛంద స్పందన వస్తే తప్పు లేదు. ముందస్తు వ్యూహంతో, పద్ధతిగా ప్రతిచోటా జాతర సృష్టించడమే అతి అనిపిస్తోంది. రకరకాల సభలతో 'ప్రవాసీ దౌత్యం'లో మోదీ సిద్ధహస్తుడు గనకనే అనుమానించాల్సి వస్తోందని విమర్శకుల మాట.

అమెరికా పర్యటనలో పలువురు వ్యాపారవేత్తలు, నోబెల్ బహుమతి గ్రహీతలు, ఆర్థికవేత్తలను మోదీ కలవనున్నారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్, శాస్త్రీయ అంశాలను ప్రాచుర్యంలోకి తెచ్చిన నీల్ డిగ్రాస్ టైసన్, రాజకీయ శాస్త్రజ్ఞుడు జెఫ్ స్మిత్ తదితరులు సైతం ఆ జాబితాలో ఉండడం విశేషం. గతంలో నెహ్రూ, రాజీవ్, పీవీ నరసింహారావు, వాజ్‌పేయి, మన్మోహన్‌ల అడుగుజాడల్లో అమెరికన్ పార్లమెంట్ ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు. ఆ వరుసలో ఆరో భారత ప్రధానైన మోదీకి ఈ ప్రసంగ ఘనత దక్కడం ఇది రెండోసారి. 1949లో ప్రపంచ శాంతి, మానవ స్వాతంత్ర్య విస్తరణల పరిరక్షణే భారత విదేశాంగ విధాన దృష్టి అన్న నెహ్రూ నాటికీ, 2005లో కీలక సాంకేతిక విజ్ఞానాల అడ్డగోలు వ్యాప్తికి భారత్ కేంద్రస్థానం కాదన్న మన్మోహన్ నాటికీ... ఇప్పటికీ తేడా చూస్తే అగ్రరాజ్యంతో ఢిల్లీ బాంధవ్యం సుదూరం సాగింది. ఇండో–పసిఫిక్‌లో, అలాగే విశాల విశ్వవేదికపై భారత ప్రభావశీల పాత్రను అమెరికా గుర్తించింది.

ఉక్రెయిన్ సంక్షోభం నేపథ్యంలో ఆయుధ సరఫరా వ్యవస్థలు సంక్షోభంలో పడడంతో రక్షణ రంగంలో ఆత్మనిర్భరత కీలకమని భారత్ గుర్తించింది. అందుకు పాశ్చాత్య ప్రపంచం నుంచి సాంకేతికత అవసరం. ఇప్పుడు అమెరికా ముందుకొచ్చింది గనక మిగతా దేశాలూ ఆ బాటలో నడవచ్చు. మరోపక్క ఉక్రెయిన్ వ్యవహారంలో రష్యాపై దూకుడుగా వ్యవహరించడం లేదంటూ భారత్ పట్ల అసహనంగా ఉన్న పాశ్చాత్య ప్రపంచం చమురు తదితర అంశాల్లో మన అనివార్యతల్ని అర్థం చేసుకొన్నాయి. కొన్ని అంశాల్లో పరస్పర ఏకాభిప్రాయం లేకున్నా, పరిణతితో కూడిన ఆ అవగాహన సాక్షిగా భారత్, అమెరికాలు పరస్పర గౌరవం, ఉమ్మడి లక్ష్యాలతో నవశకంలోకి నడుస్తున్నాయి.

ప్రచ్ఛన్న యుద్ధం నాటి అలీన విధానం నుంచి భారత్ పక్కకు రాకున్నా, ప్రస్తుత ప్రపంచ అధికార క్రమంలో మార్పులను బట్టి పరస్పర విరుద్ధ వర్గాల్లోని దేశాలతో సైతం దోస్తీకి వెనుకాడదనే సంకేతాలిస్తోంది. అలాగే, 'అబ్‌కీ బార్... ట్రంప్ సర్కార్' అంటూ భారీ సభ సాక్షిగా ట్రంప్‌ను మోదీ సమర్థించారు. చివరకు ఆయన ఓడి బైడెన్ వచ్చినా బంధం బలపడిందే తప్ప మార్పు లేదు. ప్రపంచంలోని అతి ప్రాచీన ప్రజాస్వామ్యం, అతి పెద్ద ప్రజాస్వామ్యం – రెండూ సమైక్యంగా ప్రపంచం ముందున్న సవాళ్ళను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాయి. ఇది సుసంపన్న, సురక్షిత భవితవ్యానికి బాటలు వేస్తుందని ఆశ. ప్రపంచ వేదికపై భారత్‌కు సమున్నత, కీలక పాత్ర ఉందని పాలకులు ప్రకటిస్తున్న వేళ ద్వైపాక్షిక బంధంలో ఇది కొత్త అధ్యాయం.

అర్ధ వార్షిక పరీక్షలో భేష్!

విశ్లేషణ



రాజీవ్ భాటియా

జీ20 అధ్యక్ష స్థానాన్ని భారతదేశం చేపట్టి మే 31తో సరిగ్గా ఆరు నెలలు అయ్యింది. ఉక్రెయిన్ ఘర్షణ వల్ల సభ్యదేశాలు స్పష్టంగా చీలిపోవడంతో అధ్యక్ష బాధ్యత మరింత క్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలోనూ భారత్ చక్కగా పనిచేసిందనే చెప్పాలి. అంతర్జాతీయ రంగంలో బాధ్యతాయుతమైన కీలక భాగస్వామిగా, ప్రస్తుత సవాళ్లను గుర్తించి స్పష్టంగా ప్రకటించడమే కాకుండా పరిష్కారాలను రూపొందించడంలో కూడా నాయకత్వం వహించింది. దీనిగురించే జీ20 యంత్రాంగం ఇంతవరకూ 120 సమావేశాలు నిర్వహించింది. అసలు సవాల్ ఏమిటంటే, సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరగనున్న శిఖరాగ్ర సదస్సులో విభిన్నమైన పాత్రధారులతో ఘర్షణ పడటమే. అలాంటప్పుడు 'ఢిల్లీ డిక్లరేషన్'పై ఒక ఏకాభిప్రాయ రూపకల్పన చేయగలరా?

సంవత్సరం పాటు కొనసాగే భారత్ జీ20 (గ్రూప్ ఆఫ్ 20) అధ్యక్ష పదవి మే 31తో దాని మధ్య బిందువును దాటేసింది. అంటే దాని పదవీ కాలంలో ఆరు నెలలు గడిచిపోయాయి. సెప్టెంబర్ 9, 10 తేదీలలో ఢిల్లీలో జరగనున్న శిఖరాగ్ర సదస్సుపై దృష్టి సారించడంతో తదుపరి సగం కాలం ఇప్పుడు ఆవిష్కృతమవుతుంది. జీ20 అధ్యక్షత గత పనితీరు, దాని అవకాశాలపై భావోద్వేగ రహితంగా మూల్యాంకనం చేసుకోవడానికి ఇదే సరైన తరుణం.

భారత్ జీ20 అధ్యక్ష స్థానం... కోవిడ్ మహమ్మారి, ఆర్థిక మందగమనం, పదునెక్కుతున్న భౌగోళిక, రాజకీయ పోటీ ప్రభావాన్ని అధిగమించలేకపోయింది. జీ20 దుర్బలత్వాన్ని బహిర్గతపర్చేలా, ఉక్రెయిన్ ఘర్షణ ద్వారా ప్రేరేపితమైన ధ్రువీకరణ కూడా దీనికి తోడయింది. తీవ్రమైన సవాళ్లతో పోరాడుతున్న సమయంలో ఈ గ్రూప్ చీలిపోయింది. అందుకే, జీ20 అధ్యక్ష బాధ్యత ఇప్పుడు మరింత క్లిష్టంగా మారింది.

ఈ నేపథ్యంలో గ్రూపు కీలక లక్ష్యాలను పరిరక్షించుకోడానికి జీ20 అధ్యక్ష స్థానాన్ని సమతుల్యం చేయడంలో భారత్ చక్కగా పనిచేసిందనే చెప్పాలి. మొదటగా, అంతర్జాతీయ రంగంలో బాధ్యతాయుతమైన కీలక భాగస్వామిగా, భారతదేశం ప్రస్తుత సవాళ్లను గుర్తించి స్పష్టంగా ప్రకటించడమే కాకుండా పరిష్కారాలను రూపొందించడంలో కూడా నాయకత్వం వహించింది. దీనిగురించే జీ20 యంత్రాంగం ఇంతవరకూ 120 సమావేశాలు నిర్వహించింది. రాబోయే నెలలు మంత్రుల స్థాయిలో, చివరకు నాయకుల స్థాయిలో జరిగే చర్చలకు సాక్షీభూతంగా నిలుస్తాయి.

రెండవది, భారతదేశ ఘనమైన సాంస్కృతిక వారసత్వాన్ని, దాని వైవిధ్యం, విజయాలను, ప్రజాస్వామ్య నమూనాతో సాధించిన అభివృద్ధి, రాజకీయ సుస్థిరత ఫలాలను, బలమైన నాయకత్వాన్ని, సమీకృత ఆర్థిక పురోగతిని ప్రదర్శించడమే లక్ష్యం. పర్యాటక రంగాన్ని, వాణిజ్యాన్ని, టెక్నాలజీని, ప్రపంచంతో పెట్టుబడి ఆధార సంబంధాలను బలోపేతం చేసుకోవడంలో భారత్‌కు ఇది ఉపకరిస్తుందన్న అంచనా దీని వెనుక ఉంది.

మూడవది, ప్రపంచరంగంలో న్యూఢిల్లీ నాయకత్వ పాత్రను నొక్కి చెప్పడానికి మరింత సంక్లిష్టమైన ప్రేరణ ఉంది. పశ్చిమ దేశాలతో వ్యవహరించడంలో (తేడాలు ఉన్నప్పటికీ) భారత్ సాకర్యవంతమైన దేశంగా ఉంటుందనీ, రష్యాతో, చివరకు చైనాతో కూడా (విభేదాలు కొనసాగుతున్నప్పటికీ) పొత్తులు నిర్వహిస్తుందనీ, ప్రపంచ దక్షిణ దేశాలకు సలహాదారుగా పనిచేస్తుందనీ ఇది చూపుతుంది. ఈ కత్తి మీద సాము చేయడానికి తెలివైన దౌత్యం, చురుకుదనం, సృజనాత్మకతతో పాటు కాస్త అదృష్టానికి చెందిన సమ్మేళనం కూడా అవసరం.



ప్రభుత్వ, ప్రభుత్వేతర స్థాయిల్లో జరిగిన చర్చలతో సహా జీ20 సంబంధిత పరిణామాలకు భారత మీడియా విస్తృతంగా ప్రచారం కల్పించింది. ఈ క్రమంలో ప్రజలకు దీనిగురించి చక్కటి అవగాహన కలిగేలా చేసింది.

అయితే అసలు సవాల్ ఏమిటంటే, సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరగనున్న శిఖరాగ్ర సదస్సులో విభిన్నమైన పాత్రధారులతో ఘర్షణ పడటమే. ఈ ఢిల్లీ సదస్సు ఫలితాలను న్యాయబద్ధంగా అంచనా వేయడానికి ఏకాభిప్రాయం, జోడింపు, ఆచరణ అనే త్రిముఖ కోణాలను ఉపయోగించడం మంచిది.

మొదటగా, భారతీయ అతిథేయులు ఢిల్లీ శిఖరాగ్ర సదస్సు ముగింపులో 'ఢిల్లీ డిక్లరేషన్'పై ఒక ఏకాభిప్రాయ రూపకల్పన చేయగలరా? లేదా మార్చి నెలలో 20 మంది విదేశాంగ మంత్రుల సమావేశంలో, ఉక్రెయిన్ సమస్యకు చెందిన పేరాలతో మిగిలిన 18 మంది సభ్యులతో కలిసి వెళ్లడానికి రష్యా, చైనాలు తిరస్కరించిన విధంగానే దీని ఫలితం ఉంటుందా? పైగా, ఢిల్లీలో జీ20 దేశాల నాయకులందరూ కనబడటంపై కూడా అనిశ్చితి నెలకొంది. నాయకులు భౌతికంగా హాజరు కాలేకపోవడంతో షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్(ఎస్సీఓ) ఢిల్లీలో సదస్సు నిర్వహణకు అశక్తత వ్యక్తం చేయడం దీన్ని మరింత పెంచింది.

రెండు, జోడింపు అనేది ఢిల్లీ డిక్లరేషన్ ప్రతిపాదించే విషయాలను సూచిస్తుంది. మునుపటి సదస్సుకు సంబంధించిన 'బాలి డిక్లరేషన్'తో పోల్చినప్పుడు, ఢిల్లీ సదస్సులో ప్రత్యేకించి ప్రపంచ పరిష్కారాలకు సంబంధించిన విషయాలు మరింత దృఢంగా, కొత్తగా ఉంటాయా? చివరగా, ప్రధాన ఒప్పందాల ఆచరణకు సంబంధించి: ఏకాభిప్రాయ ప్రాతిపదికన మాత్రమే నిర్ణయాలను అమలు చేయడానికి రాజకీయ సంకల్పంతో కూడిన ఆచరణ జీ20ని ఒక సమర్థమైన నిర్దేశక కార్యాలయంగా చూపిస్తుందా లేక చర్చల దుకాణంగా మాత్రమే చూపుతుందా?

బహువిధ ఆర్థిక వ్యవస్థల్లో సంస్కరణల కోసం నినాదాలు ఇస్తున్నట్టుగా, జీ20 తనను తాను కూడా సంస్కరించుకోగల సమర్థురాలనే సూచన ఢిల్లీ సదస్సులో వెలువడవచ్చు. అలా అయితే తమ కొత్త సభ్యురాలిగా ఆఫ్రికన్ యూనియన్ (ఏయూ)ను చేర్చుకోవడంలో కొంచెం కూడా సందేహం ఉండకూడదు. అలాగే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి విస్తరణ, ప్రజాస్వామికీకరణను వేగవంతం చేయడం కోసం పిలుపునిస్తుందా అన్నది కూడా ప్రత్యేక శ్రద్ధతో గమనించాల్సి ఉంది.

చర్చల్లో పురోగతిని నమోదు చేయడానికి జీ20 అధ్యక్ష పదవి ప్రాధాన్యతలలో రెండు అంశాలు తప్పనిసరి. అవి వాతావరణం, శక్తి పరివర్తిత ఆర్థికం. వీటికి సంబంధించి జీ20 నిబద్ధత నిర్దిష్టంగా ఉండవచ్చు. దీనికి మరిన్ని జోడింపులు చేర్చవచ్చు. ప్రపంచంలో భారతీయ డిజిటల్ పబ్లిక్ గూడ్స్ (డీపీజీ) ప్రాసంగికతను నొక్కి చెప్పడంలో, భారత ప్రభుత్వం అసాధారణ క్రియాశీలతను ప్రదర్శించింది. కాబట్టి ఢిల్లీ సదస్సు తుది ప్రకటనలో ఒక బలమైన సూత్రీకరణ ఖాయంగా కనిపిస్తోంది. అయితే ఈ పరిధిలో సహకారం పొందడం కోసం బంగ్లాదేశ్, ఈజిప్ట్, మారిషస్ వంటి ఎనిమిది అధ్యక్ష అతిథి దేశాలతో ద్వైపాక్షిక చర్చల దిశగా అధికారులు పని చేస్తే బాగుంటుంది.

ప్రజాస్వామ్య స్ఫూర్తితో, విమర్శకుల అభిప్రాయాలను, భిన్నాభిప్రాయాలను గమనించాలి. ఒక మాజీ సీనియర్ అధికారి ఇటీవల ప్రపంచం అంతర్జాతీయ ఘర్షణకు 'ప్రమాదకరంగా దగ్గరవుతోంద'ని పేర్కొంటూ– జీ20, 'ఎస్సీఓ' శిఖరాగ్ర సదస్సుల నుంచి గరిష్ఠ ప్రయోజనాలు పొందాలన్న ఆశలను తగ్గించుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. ప్రజాస్వామ్యం, వైవిధ్యం గురించిన అధికారిక సిద్ధాంతం దేశీయ రాజకీయాలకు అనుగుణంగా లేదని వాదిస్తూ ఒక సీనియర్ ప్రతిపక్ష నాయకుడు 'జీ20 కపటత్వం' గురించి మాట్లాడారు. ఇకపోతే మూడో విమర్శకుడు జీ20 పౌర సమాజ వేదిక హైజాక్ కావడం గురించి రాశారు. కొంతమంది విదేశీ పరిశీలకులు 'థింక్20' ప్రక్రియ గురించి ఫిర్యాదు చేశారు.

భారతదేశ జీ20 అధ్యక్షతకు సంబంధించి బహుముఖ ప్రయాణ క్రమంలో కొన్ని చికాకులు సమానంగా ఉంటాయి. వస్తుగతంగా చెప్పాలంటే, జీ20 అధ్యక్ష పదవీకాలంలో భారత్ ఇప్పటివరకూ బాగా పనిచేసింది. ప్రత్యేకించి ప్రపంచంలో భారత్ పాత్ర గురించి విశ్వవ్యాప్తంగా అపూర్వ సందడిని సృష్టించింది. శ్రద్ధ, దౌత్య చతురత, రాజకీయ దృష్టి, కాస్త అదృష్టంతో ఈ బిడారు విజయవంతంగా తన గమ్యాన్ని చేరుకోవాలి. భారతదేశానికీ, జీ20కీ గొప్ప కీర్తిని తెచ్చిపెట్టాలి.

వ్యాసకర్త మాజీ రాయబారి; డిస్టింగ్విష్డ్ ఫెలో, గేట్‌వే హౌజ్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కపట వాదం



కాంగ్రెస్ తొత్తులు ఎలాంటి కపటులంటే: ఏ రోడ్డు, ఫ్లైఓవర్, నిర్మాణానికో సావర్కర్ పేరు పెడితే వాళ్లు కన్నడిగుడి పేరు పెట్టాలని డిమాండ్ చేస్తారు. కానీ అదే కన్నడిగులు ఈ నెహ్రూ–గాంధీ– ఇందిరా పేర్ల ముఖస్తుతి పట్టింపును ప్రశ్నిస్తే 'పేరుకు అంత ప్రాధాన్యత ఏముంది?' అంటారు.

– చేతన్ కుమార్ అహింస, నటుడు

నది అందరిది!



గంగానదిలోకి శవాలను విసిరేస్తే ఫర్లేదా? మురుగు నీటిని అందులోకి వదిలితే ఫర్లేదా? జలవనరుల్లో అత్యంత మురికికూపాల్లో ఒకటిగా మిగిలిపోతే ఫర్లేదా? కానీ ఒక ముస్లిం మాత్రం అందులోకి దిగకూడదా? అదీ మంచిదే మోలే... ఏదైనా జబ్బుపడితే?

– పూనమ్, వ్యాఖ్యాత

రోడ్డెక్కడం దేనికి?



చట్టం అంటే చట్టమే. ప్రతి ఒక్కరూ తాము పనిచేస్తున్న, దర్శిస్తున్న దేశాల చట్టాలనూ, నియమ నిబంధనలనూ పాటించాలి. యూఏఈలో పదివేల కంటే ఎక్కువ అధికారిక మసీదులున్నాయి, గ్యాస్ స్టేషన్లు, హైవేల్లో ఉన్నవి సహా. రోడ్డు పక్కన ప్రార్థించే అవసరమే లేదు. (రోడ్డుపక్కన ప్రార్థిస్తే యూఏఈలో 1000 దిర్హామ్‌ల జరిమానా కథనానికి స్పందనగా.)

– ఒమర్ అలీ ఘమడీ, సౌదీ వ్యాఖ్యాత

చిరు కానుక



ఐఐటీ బాంబేతో నాకున్న 50 ఏళ్ల అనుబంధానికి గుర్తుగా, నా విద్యాసంస్థకు 315 కోట్ల రూపాయలు విరాళంగా ఇస్తున్నాను. ఇది చేయగలుగుతున్నందుకు కృతజ్ఞుడిని.

– నందన్ నీలేకని, పారిశ్రామికవేత్త

మన గౌరవం



భారత ప్రధానమంత్రికి అమెరికా ప్రభుత్వం (ఇవ్వనున్న) ఘన స్వాగతం పట్ల సంతోషంగా ఉన్నాను. ఇది ఇండియాకు సంబంధించినది, వ్యక్తులు ముఖ్యం కాదు.

– హేపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

మన అపురూప సంజీవని

ఈ ప్రపంచంలో మనిషి మనుగడకు, అతడు చేసే పనులకు శరీరమే ఆధారభూతం. అందుకనే దానిని జాగ్రత్తగా, ఆరోగ్యంగా కాపాడుకొనే బాధ్యతను ఎవరికి వారే గుర్తెరగాలి. భారతీయ సంప్రదాయ జీవనంలో ఒకప్పుడు యోగాసనాలు భాగంగా ఉండేవి. ఇవి మన పూర్వుల శారీరక, మానసిక ఆరోగ్యాలను కాపాడుతూ ఉండేవి. రాజ్యాలు, యుగాలు మారడంతో మన యోగా ప్రాముఖ్యాన్ని మరచిపోయి కాలంతోపాటు పరుగిడుతూ జీవితాన్ని యాంత్రికత్వంతో నింపేసుకుంటున్నాం. ఇవ్వాళ ఒత్తిడి ప్రతి ఒక్కరి జీవితాన్నీ వేధిస్తోంది. ఫలితంగా అనేక శారీరక, మానసిక రుగ్మతలతో జీవితం నరకప్రాయమైపోతున్నది. ఈ స్థితి నుంచి బయటపడి ఆరోగ్యంగా ఉండటానికి యోగాసనాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇటీవలి కాలంలో యోగా ప్రాముఖ్యాన్ని భారతీయులతో పాటూ ప్రపంచ ప్రజలందరూ గుర్తించారు. ఇందుకు జూన్ 21 తేదీన 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా జరుపుకోవడమే నిదర్శనం.



నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత నుంచి యోగా విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారనే చెప్పాలి. అందుచేతనే గడచిన 8 ఏళ్లలో యోగా ప్రాచుర్యం పొందుతోంది. కోవిడ్–19 తరువాత అనేక మంది యోగ సాధనపై మక్కువ కనబరుస్తున్నారు. సీజనల్‌గా సంభవించే వ్యాధులతోపాటు అనేక దీర్ఘకాలిక వ్యాధులను కూడా నయం చేసే శక్తి యోగ సాధనకు ఉంది. పిల్లల నుంచి పెద్దల వరకు... స్త్రీ, పురుష భేదం లేకుండా అందరూ చక్కని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికీ, ఆయుష్షును పెంచుకోవడానికీ యోగా తిరుగులేని సాధనం అని చెప్పాలి. రోగ నిరోధకశక్తిని పెంచుకోవడానికీ, వ్యాధులను జయించడానికీ ఉన్న చక్కని అవకాశం యోగాసనాలు వేయడం.

కేవలం రోజుకు గంట లేదా గంటన్నర సేపు యోగాసనాలు, ధ్యానం వంటి వాటికి సమయం కేటాయిస్తే... అజీర్తి, ఊబకాయం, జలుబు, తలనొప్పి, కీళ్ల నొప్పులు, నిద్రలేమి, షుగర్, బీపీ, కండరాల బలహీనత వంటి వాటికి దూరం కావచ్చు. మనసు ప్రశాంతతను సంతరించుకుంటుంది. పిల్లల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంచేందుకు యోగా శిక్షణ ఇవ్వాలి. ఇందుకుగాను ప్రతి పాఠశాలలో కనీసం ఒక గంట యోగా శిక్షణ పొందేలా విద్యాశాఖ నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని పలువురు తల్లిదండ్రులు భావిస్తున్నారు. అనేక రుగ్మతలకు సంజీవనిగా పనిచేసే యోగాను ప్రోత్సహిద్దాం. ఆచరిద్దాం. ఆరోగ్యంగా ఉందాం.

– దవరసింగి రాంబాబు, యోగా టీచర్
(నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం)

తొమ్మిదేళ్లుగా దేశం దూసుకుపోతోంది!

అభిప్రాయం



పురిఘళ్ల రఘురాం

ప్రస్తుతాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేయడం కాదు... కనీసం వచ్చే వందేళ్ల అవసరాలను గమనంలో ఉంచుకొని పని చేయడమే అసలైన ప్రజా ప్రభుత్వాల విధి. ఈ పనిని నరేంద్ర మోదీ ప్రభుత్వం చక్కగా నిర్వహిస్తోంది. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో యువశక్తి, సాంకేతికతలను వినియోగిస్తూ ప్రపంచ ఆర్థిక రంగంలో దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపారు. అవిశ్రాంతంగా, అవినీతి రహితంగా పరిపాలన అందిస్తూ మూడోసారి విజయాన్ని సాధించాలని మోదీ తలపోస్తున్నారు. అందరికీ తాగునీరును 'జల్‌జీవన్ మిషన్' కింద అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టి పేదలకు గూడు కల్పించాలని నిర్ణయించారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి 'స్వచ్ఛ భారత్'ను సాకారం చేయాలని తపిస్తున్నారు. ప్రజలకు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా, వివిధ ప్రభుత్వ ప్రాయోజిత పథకాల ఫలితాలను నేరుగా వారి ఖాతాలోనే చేరేలా ఏర్పాటు చేశారు. గ్రామీణ రైతులకు ఎరువులను సబ్సిడీతో అందిస్తున్నారు. 'పీఎం కిసాన్ యోజన' ద్వారా ఏటా ఆరువేల రూపాయల పెట్టుబడి సాయాన్ని అందిస్తూ రైతులకు దన్నుగా నిలిచారు. రైతులు ఆరుగాలం పండించిన పంటను దేశంలో ఎక్కడైనా సరే అమ్మే అవకాశాన్ని కల్పించే నూతన విధానాన్ని ఆరంభించి, వారి ఆదాయాన్ని మరింతగా పెంచారు.

దళిత యువతకు 70 శాతం పైగా సబ్సిడీ కింద పెట్టుబడి సాయం అందిస్తూ పారిశ్రామిక రంగంలో ప్రోత్సాహకాలను మునుపెన్నడూ లేని విధంగా మోదీ సర్కారు అందిస్తోంది. 2014లో కేవలం 400 ఉన్న స్టార్టప్‌లు 2022 నాటికి 85 వేలకి చేరాయి. ఒక దశాబ్దం కంటే తక్కువ కాలంలోనే చైనా, యూఎస్‌ల తర్వాత ప్రపంచంలో భారత్ స్టార్టప్‌ల పరంగా మూడో స్థానాన్ని ఆక్రమించింది. రక్షణ రంగంలోనూ 'మేకిన్ ఇండియా' లాభసాటిగా దూసుకెళ్తోంది. ఎమ్ఎస్ఎమ్ఈలకు ప్రోత్సాహకాలు అందిస్తూ భారతీయ ఉత్పత్తులను పెంచేందుకు మోదీ సర్కారు చర్యలు చేపట్టింది. నూతన విద్యా విధానాన్ని దేశంలో అమలుకు తెరలేపింది. హెల్త్ మిషన్ ద్వారా



'ఆయుష్మాన్ భారత్' తీసుకొచ్చి... పేదలకు 5 లక్షల రూపాయల విలువైన వైద్య ఖర్చులను ఉచితంగా అందిస్తోంది. జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేసి పౌరులకు అందుబాటు ధరలో మందులు ఉంచుతోంది.

ఉపాధి హామీ పథకంలో వేతనాలను పెంచి బడుగులకు బతుకు భరోసా ఇచ్చింది. కేవలం వేతనాలు పెంచడమే కాదు, లక్షలాది మంది కూలీలకు ఉపయుక్తమైన 'పని దినాలను పెంచే' నిర్ణయం తీసుకొంది. దేశంలో 150కి పైగా ఎయిర్‌పోర్టుల అభివృద్ధి చేపట్టింది. సామాన్యులకు విమాన ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. రైల్వే స్టేషన్‌లను ఆధునికీకరిస్తోంది. కొత్తగా రైల్వే లైన్లు నిర్మిస్తోంది. 'వందే భారత్' రైళ్లను ప్రవేశపెట్టి, వేగవంతమైన, సుఖవంతమైన ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చింది. హైవేల విస్తరణ దేశంలో మునుపెన్నడూ లేని విధంగా శరవేగంగా సాగుతోంది. నాలుగు, ఆరు లేన్‌ల జాతీయ రహదారులను పూర్తిచేసి బైపాస్‌ల నిర్మాణం ద్వారా సులభ ప్రయాణాన్ని అందించింది.

కరోనా సమయంలో ఉచిత టీకాలందించి దేశానికి ఆరోగ్య భద్రత కల్పించారు మోదీ. ప్రపంచంలో ఇంత మందికి వ్యాక్సీన్ వేయగలమని రుజువు చేసి, చాలా దేశాలకు ఇండియా నుంచి వ్యాక్సీన్ ఎగుమతయ్యేలా సైతం చొరవ చూపించారు. ఉచిత రేషన్ ద్వారా సామాన్య ప్రజల ఆకలి తీర్చారు. సంక్షోభ సమయంలో ఒక ప్రభుత్వం ఏం చేయాలో అన్ని రకాల చర్యలూ చేపట్టి, సరిలేరు మీకెవ్వరు అనిపించుకొన్నారు మోదీ.

సోషల్ ఇంజినీరింగ్ ఫార్ములా ద్వారా పేదలకు, ప్రభుత్వం నుంచి మద్దతు అందించారు. రాజకీయంగా ఎన్నో సవాళ్లను అధిగమించి, రాచపుండులా ఉన్న ఎన్నో సమస్యలకు పరిష్కారాలు చూపించారు. అందులో జమ్ము–కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు ఒకటి. రామ మందిర నిర్మాణానికి సంబంధించిన అడ్డంకులను తొలగించారు. 'ట్రిపుల్ తలాక్' కారణంగా ముస్లిం మహిళలు పడుతున్న నరకయాతనకు చరమగీతం పాడారు. ప్రపంచానికి భారతదేశాన్ని ఒక శక్తిమంతమైన దేశంగా చూపించడంలో మోదీ నూటికి నూరుపాళ్ళు విజయం సాధించారు. ఇప్పుడు దేశంలోనే కాదు మోదీ ప్రభంజనం అనేక ప్రపంచ దేశాల్లోనూ కనిపిస్తోంది. 'ద బాస్ మోదీ' అంటూ అగ్రదేశాల అధినేతలు సైతం ఆయన పేరును జపిస్తున్నారు. ఇండియా విశ్వ గురువుగా అవతరించడానికి మోదీ బాటలు వేస్తున్నారు.

వ్యాసకర్త బీజేపీ నాయకులు

మాయా ప్రపంచం

జీవమూర్తి అనే ఒక నటుడున్నాడు. ఆయన హరిశ్చంద్ర నాటకంలో నటిస్తున్నంతసేపూ తను హరిశ్చంద్రుడు అయినట్టూ, చంద్రమతి తన భార్య అయినట్టూ, లోహితాస్యుడు తన కుమారుడే అయినట్టూ వ్యవహరిస్తాడు. నాటకంలో హరిశ్చంద్రుడు రాజ్యం పోగొట్టుకొంటే తనే రాజ్యం పోగొట్టుకొన్నట్టు అభినయిస్తాడు. హరిశ్చంద్రుడి పుత్రుడు మరణిస్తే, తన పుత్రుడే మరణించినట్టు పుట్టెడు దుఃఖం ప్రదర్శిస్తాడు. నటించేప్పుడు ఆయనకు తను హరిశ్చంద్రుడిని కాననీ, జీవమూర్తి అనే మనిషిననీ, తనకు ఉన్న రాజ్యాలూ, పోయే రాజ్యాలూ ఏవీ లేవనీ ధ్యాసే ఉండదు.

అందుకు కారణం ఆ నాటకం దర్శకుడు పరమేశ్వర రావు. ఆయన దర్శకత్వమొక ఇంద్రజాలమే! ఆయన సూత్రధారిత్వంలో నటులందరూ తమ పాత్రలలో లీనమై, పూర్తి 'తాదాత్మ్యత'తో నటిస్తారు. తన అద్భుత శక్తితో ఆయన ఆ నటులందరి మీదా ఒక గారడీ వస్నేస్తాడు. ఆ గారడీలో ఉన్నప్పుడు జీవమూర్తి తను నటుడినని మరిచిపోతాడు. హరిశ్చంద్రుడి కష్టాలన్నీ తనవిగా భావించి శోకిస్తాడు. 'ఊరుకోవయ్యా! నీకెందుకీ దుఃఖం, నువ్వేమన్నా హరిశ్చంద్రుడివా? ఇదంతా వట్టి తాత్కాలికమైన కల్లబొల్లి వ్యవహారం కదా?' అని ఎవరయినా చెప్పినా గ్రహించలేడు. 'నా భార్య అష్టకష్టాలు పడుతుంటే, నా కొడుకు చనిపోయి నేను ఇంత బాధపడుతుంటే, ఇదంతా నాటకమంటావా? నీకు బుద్ధీ, హృదయమూ – రెండూ లేవు. నువ్వు మూర్ఖుడివి. అంధుడివి. కళ్ళకు కనిపించేదాన్నే కల్ల అని మభ్య పెట్టే మోసగాడివి' అంటాడు. ఇది కూడా ఆ దర్శకుడి ఇంద్రజాల ఫలితమే.

జగన్నాటకాన్ని నడిపే సూత్రధారి, ఆ నాటకంలో నటించే మనలాంటి నటీనటులందరి మీద చేసే ఈ ఇంద్రజాలాన్ని 'మాయ' అని ప్రస్తావిస్తుంది గీత. '**ఇది దైవీ మాయ. దైవీ హి ఏషా గుణమయీ, మమ మాయా దురత్యయా.** ఇది లోకాతీతమైన నా దివ్యమాయ. సత్వరజస్తమో గుణాలన్న దినుసులతో ఏర్పడింది. ఇది చాలా బలవత్తరమైంది. **మాం ఏవ యే ప్రపద్యంతే, మాయాం ఏతాం తరన్తి తే.** నన్ను ఎవరయితే ఆశ్రయిస్తారో, వాళ్ళు ఈ మాయను అధిగమించ గలుగుతారు' అంటాడు గీతాచార్యుడు. మాయ ఏదో, సత్యమేదో చక్కగా చూడగలిగిన జ్ఞాని అన్ని దుఃఖాలకూ అతీతుడవుతాడు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.తదియ ప.12.53 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** పుష్యమి రా.11.44 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** ఉ.6.07 నుండి 7.55 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.34 నుండి 12.26 వరకు, **అమృతఘడియలు:** సా.4.41నుండి 6.28 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.33.

బంగ్లాదేశ్‌కు ఐఎన్‌ఎస్ కిల్టన్



ఐఎన్‌ఎస్ కిల్టన్ నౌకాధికారికి బంగ్లాదేశ్‌లో స్వాగతం

దొండపర్తి(విశాఖ దక్షిణ): భారత నావికాదళానికి చెందిన యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ కిల్టన్ మంగళవారం బంగ్లాదేశ్‌లో చట్టోగ్రామ్‌కు చేరుకుంది. ఆ దేశ నావికాదళం అధికారులతో సమావేశమై పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఇరు దేశాల నావికాదళ అధికారులు, సిబ్బంది బుధవారం యోగాసనాలు వేయనున్నారు.

'వాణిజ్య పన్నుల' అవినీతి కేసులో దర్యాప్తు ముమ్మరం

అవినీతి అధికారుల ఇళ్లల్లో పోలీసుల సోదాలు

ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలతో పాటు హైదరాబాద్‌లో తనిఖీలు

పరారీలోనే అవినీతి కీలక సూత్రధారి సూర్యనారాయణ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: వాణిజ్యపన్నుల శాఖ అధికారుల భారీ అవినీతి కేసులో ఎన్టీఆర్ జిల్లా పోలీసు యంత్రాంగం దర్యాప్తు ముమ్మరం చేసింది. దీన్లో భాగంగానే ఇప్పటికే రిమాండ్‌లో ఉన్న నలుగురు ఉద్యోగుల ఇళ్లతోపాటు పరారీలో ఉన్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణకు చెందిన ఇళ్లల్లో మంగళవారం ఏకకాలంలో పోలీసులు సోదాలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సత్యనారాయణపురంలోని రెండు ఇళ్లు, కృష్ణాజిల్లా కానూరులో రెండు, గుడివాడలో ఒక ఇల్లు, హైదరాబాద్‌లోని ఎస్ఆర్‌నగర్‌లో ఒక ఇంట్లో పోలీసులు తనిఖీలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాలతో జిల్లా పోలీసు యంత్రాంగం, సిటీ టాస్క్‌ఫోర్స్ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు నిర్వహించారు. కె.ఆర్.సూర్యనారాయణ ఇళ్లతోపాటు జీఎస్టీ అధికారులు బలిజేపల్లి మెహర్‌కుమార్, కంచర్లకోట సంధ్య, సీనియర్ అసిస్టెంట్ కావూరి వెంకటచలపతి, సబార్డినేట్ మరీదు సత్యనారాయణ ఇళ్లల్లో ఈ సోదాలు చేశారు. వాణిజ్యపన్నుల శాఖ రాష్ట్ర కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ ఫిర్యాదుతో గత నెలలో ఈ అవినీతి వెలుగులోకి వచ్చింది. ఈ ఫిర్యాదుతో ఎన్టీఆర్ జిల్లా పోలీసులు.. నలుగురు ఉద్యోగులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచడం, వారికి కోర్టు రిమాండ్ విధించటం తెలిసిందే. ఈ నలుగురు అధికారులు పాల్పడిన వందల కోట్ల రూపాయల అవినీతి వెనుక ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ హస్తం ఉందని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. దీంతో పోలీసులు ఆయనపైనా కేసు నమోదు చేశారు.



విజయవాడ సత్యనారాయణపురంలోని బలిజేపల్లి మెహర్‌కుమార్ నివాసంలో సోదాలు చేస్తున్న పోలీసులు

విలువైన ఆస్తిపత్రాలు, ఫైళ్లు, సొత్తు స్వాధీనం

విజయవాడ సత్యనారాయణపురం పాపరాజు వీధిలోగల సాయిరత్న టవర్స్‌లోని బలిజేపల్లి మెహర్‌కుమార్ ఫ్లాట్‌లో, కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరులోని ఆశ్రిషి రెసిడెన్సీలోని కంచర్లకోట సంధ్య ఫ్లాట్‌లో, గుడివాడ సమీపంలోని బేతపూడి గ్రామంలో కావూరి వెంకటచలపతి ఇంట్లోను, కానూరులో మరీదు సత్యనారాయణ ఇంట్లోను, విజయవాడ సత్యనారాయణపురంలోను, హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్‌లోను ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ ఇళ్లల్లో సోదాలు చేశారు. డీసీపీ విశాల్ గున్ని పర్యవేక్షణలో సెంట్రల్ ఏసీపీ పి.భాస్కరరావు నేతృత్వంలో ఆరు బృందాలు ఈ తనిఖీలు చేశాయి. ఐదుగురు నిందితులు అక్రమ సంపాదనతో కూడబెట్టిన ఆస్తుల డాక్యుమెంట్లు, నగదు, బంగారు, వెండి ఆభరణాలు, విలువైన సమాచారం ఉన్న ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, వాణిజ్యపన్నుల కార్యాలయంలో కనిపించకుండాపోయిన ఫైళ్ల వివరాలు సేకరించినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. మరిన్ని విలువైన ఆస్తిపత్రాలు, కేసుకు సంబంధించిన మరిన్ని ఫైళ్ల కోసం సోదాలు కొనసాగిస్తామని చెప్పారు. సోదాల్లో స్వాధీనం చేసుకున్న సొత్తును న్యాయస్థానానికి అందజేస్తామని తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే నలుగురు రిమాండ్‌లో ఉండగా.. కీలక సూత్రధారి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న ఆయన ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్లను కోర్టులు తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ కేసులో సూర్యనారాయణ పాల్పడిన అవినీతే ఎక్కువగా ఉందని తెలుస్తోంది.

సోమేశ్వరుడి సేవలో జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులు

నిడదవోలు: తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులోని శ్రీ బాలా త్రిపుర సుందరి, శ్రీ సోమేశ్వరస్వామివారి ఆలయంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులకు ఈవో, వేదపండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆలయ ప్రధానార్చకుడు శ్రీకాకుళపు లక్ష్మీనరసింహశాస్త్రి, వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ముందుగా జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులు నిడదవోలులోని ప్రముఖ జ్యోతిష్యులు ప్రక్కి వీరభద్రరావు ఇంటికి వెళ్లి ఆయన్ను కలిశారు.

ఏసీబీ వలలో ఎర్రగుంట్ల సీఐ



ఎర్రగుంట్ల: వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్ సీఐ ఎం. మంజునాథ్‌రెడ్డి ఏసీబీ వలకు చిక్కారు. షేక్ జిలానీబాషా అనే మధ్యవర్తి ద్వారా లంచం తీసుకున్నట్లు విచారణలో తేలడంతో సీఐని అదుపులోకి తీసుకున్నట్లు తిరుపతి ఏసీబీ అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్ మీడియాకు వెల్లడించారు. ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన గరిషా గంగాధర్‌రెడ్డి అనే లారీ ఓనర్ స్లాబ్ స్టోన్ నుంచి వచ్చే పౌడర్‌ను రవాణా చేసే సమయంలో ఎలాంటి అడ్డంకులు లేకుండా, కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు సీఐ నెలవారి మాములు కింద రూ.1,500 వసూలు చేసేవారు. అయితే ఆ మాములు రూ.3,700కు పెంచి ఏడాది మొత్తం ఒకేసారి లంచంగా ఇవ్వాలని సీఐ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10న రూ.10 వేలు మధ్యవర్తి ద్వారా వసూలు చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. మిగిలిన మొత్తం రూ.8 వేలను మంగళవారం మధ్యవర్తి జిలానీబాషా ఇంటి వద్దకు వెళ్లి బాధితుడు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కర్నూల్‌లో సీఐ మంజునాథ్‌రెడ్డిని అరెస్ట్ చేశారు.

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అనుకూలం

దుబాయ్ పారిశ్రామికవేత్తలతో ఎంపీ భరత్



రాయల్‌ఫ్యామిలీతో ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: దుబాయిలో ఇండో అరబ్ ఇంటర్నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డును స్వీకరించిన వైఎస్సార్‌సీపీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ మంగళవారం రాయల్ ఫ్యామిలీ ఆహ్వానం మేరకు ఆతిథ్యం స్వీకరించేందుకు అతిథిగా వెళ్లారు. అక్కడ పలువురు ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలతో సమావేశమయ్యారు. పర్యావరణ పరిరక్షణ, ఏపీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన 'జగనన్న హరిత నగరాల' కాన్సెప్ట్, రాజమహేంద్రవరం నగరంలో నిర్వహిస్తున్న' యువత హరిత'..గో గ్రీన్‌ఛాలెంజ్.. తదితర కార్యక్రమాల గురించి ఎంపీ భరత్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ సందర్శించాలని యునైటెడ్ అరబ్ కంట్రీస్ కింగ్‌ను ఎంపీ భరత్ ఆహ్వానించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి రాయల్ ఫ్యామిలీకి తెలియజేశారు. రాష్ట్రంలో వివిధ వ్యాపారాలు, పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూల పరిస్థితులను వివరించారు. పెట్టుబడులు పెట్టేందుకు రావాలని కోరారు. రాయల్ ఫ్యామిలీతోపాటు షేక్ అవాద్ మహ్మద్ బిన్, షేక్ షాదిక్ అలి సాహెబ్ థాంగల్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ అనిరుద్ధ్ బోస్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిరుద్ధ్ బోస్ మంగళవారం కుటుంబ సమేతంగా జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అప్పన్న సేవలో స్వరూపానందేంద్ర సరస్వతి



స్వరూపానందేంద్రకు శేషవస్త్రాలు అందజేస్తున్న ఈవో, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: సింహాచలంలోని శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ధ్వజస్తంభం వద్ద ఈవో డి.భ్రమరాంబ, ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీదేవి, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని స్పృశించి బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. చాతుర్మాస దీక్ష ఆహ్వాన పత్రాలను స్వామి పాదాలచెంత ఉంచి పూజలు చేశారు. సింహగిరి క్షేత్ర పాలకుడు త్రిపురాంతకస్వామికి అభిషేకం చేశారు. పండితులు ఆశీర్వదించగా, ఈవో ప్రసాదాన్ని, శేష వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర మాట్లాడుతూ ఉత్తరాంచల్‌లోని రుషికేష్‌లో జూలై 3వ తేదీ నుంచి సెప్టెంబరు 29వ తేదీ వరకు చాతుర్మాస దీక్ష చేయనున్నట్లు చెప్పారు.

బాబు అవినీతికి ఎల్లో మీడియా గొడుగు

996వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: అధికారం అడ్డుపెట్టుకుని చంద్రబాబు చేసిన అవినీతిని కాపాడేందుకు ఎల్లో మీడియా, అన్ని పార్టీల్లో ఉన్న బాబు సామాజిక వర్గ కులవాదులు తంటాలు పడుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 996వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. 75 సంవత్సరాల భారతదేశ చరిత్రలో జరిగిన వేర్పాటు వాద ఉద్యమాల కారణంగా ఓ ప్రాంతం లాభపడినా మరో ప్రాంతం నష్టపోతున్న కారణంగానే భవిష్యత్తులో ఇలాంటివి జరగకూడదనే ఏకైక యోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిపుణుల కమిటీల సూచనల మేరకు మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. బాబు చేసిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఫలితంగా అమరావతి ప్రాంతంలో రైతులకు తీరని నష్టం జరిగిందని చెప్పారు. దీంతో గత ఎన్నికల్లో దిమ్మతిరిగే షాక్ ఇచ్చి ఓడించినా బాబు తన తీరు మార్చుకోకుండా పదే పదే అబద్ధాలను ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల గడువు ముంచుకొస్తుండడంతో బాబు, ఆయన కుమారుడు లోకేశ్, పవన్ కళ్యాణ్ పలు పార్టీల నాయకులు పాదయాత్రలు, ఇతర యాత్రల పేరుతో నాటకాలాడుతున్నారని విమర్శించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ 'ఇండ్ల'కు అమెరికా తెలుగు సంఘాల ఆహ్వానం



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు, రచయిత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డికి ఉత్తర అమెరికాలో జూలైలో జరిగే తెలుగు సంఘాల సమావేశాల్లో పాల్గొనాలని ఆహ్వానం అందింది. జూలై 1న డల్లాస్‌లో జరిగే నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్(నాటా) మహాసభలో అతిథిగా పాల్గొని 'లవ్, లైఫ్ అండ్ హ్యాపీనెస్' అనే అంశం మీద ప్రసంగించనున్నారు. జూలై 8న ఫిలడెల్ఫియాలో జరిగే తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా(తానా) మహాసభలో పాల్గొని సిరివెన్నెల సీతారామశాస్త్రి మనసు పాటలపై విశ్లేషణాత్మక ప్రసంగం చేయనున్నారు. సిరివెన్నెల సమగ్ర సాహిత్యం పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించనున్నారు.

జై తెలుగు పార్టీ ఆవిర్భావం

కొత్త పార్టీని ప్రకటించిన సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలో తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు రాజకీయ వేదిక ఉండాలనే ఉద్దేశంతో సరికొత్తగా జై తెలుగు పార్టీని ఏర్పాటు చేసినట్లు సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ప్రకటించారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ పేరును ఆయన ప్రకటించారు. భాషా, సంస్కృతుల పట్ల రాజకీయ నాయకులు, ప్రజలకు అవగాహన ఉండాలని, వీటిపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడమే తమ పార్టీ లక్ష్యమని చెప్పారు. పార్టీ విధివిధానాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. ఐదు రంగులతో పార్టీ జెండా రూపొందించామని చెప్పారు. తెలుగు భాషా పరిరక్షణ అజెండాతో వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తామని జొన్నవిత్తుల ప్రకటించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

రెండు ప్రాంతాల్లో భారీగా గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కృష్ణాజిల్లా ఎస్పీ జాషువా

జి.మాడుగుల (అల్లూరి సీతారామరాజు జిల్లా)/ కోనేరుసెంటర్ (కృష్ణాజిల్లా): అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ గిన్నెగరువు గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి 1,760 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం పాడేరు ఏఎస్పీ ధీరజ్ మీడియాకు వెల్లడించారు. జూన్1, 2023లో ఎండీఎస్, చెన్నై జోన్ యూనిట్ 13 ఎన్‌సీబీ కేసులో తమిళనాడుకు చెందిన సురేష్ 160 కిలోల గంజాయితో రాగమటన్‌పల్లి వేపనహీళి పోలీస్‌లకు పట్టుబడ్డాడు. ఈ గంజాయిని పాడేరు ప్రాంత సుందరరావు వద్ద కొనుగోలు చేసినట్టు చెప్పాడు. చెన్నై నుంచి వచ్చిన బృందం పాడేరు వచ్చి జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. జిల్లా ఎస్పీ, ఏఎస్పీ సూచనల మేరకు స్థానిక పోలీసులు పెదబయలు మండలం, ఇంజరి పంచాయతీ గిన్నెగరువు గ్రామానికి చెందిన సుందరరావు ఇంట్లో తనిఖీ చేయగా.. 1,760 కిలోల గంజాయి లభించింది. దీని విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుంది. సుందరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ పట్టివేత..

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్‌ను కృష్ణా జిల్లా పోలీసులు పట్టుకున్నారు. అతనితో పాటు జిల్లాలో గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్న మరో ముగ్గురు వ్యాపారులనూ అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ పి.జాషువా తన కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా పాడువ మండలం చత్వా గ్రామానికి చెందిన కొర్రా రాందాస్ అలియాస్ భట్టు భాయ్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ గంజాయి సరఫరా చేయడం మొదలెట్టాడు. దీనిలో భాగంగా గుడివాడ, అవనిగడ్డ, ఘంటసాల తదితర ప్రాంతాలకు రాందాస్ గంజాయిని సరఫరా చేస్తుంటాడు. మచిలీపట్నంలో గంజాయి అమ్మకాలు సాగిస్తున్న బడుగు నాగరాజును పలుమార్లు పోలీసులు పట్టుకున్నారు. అతని నేర చరిత్రను పరిశీలించిన ఎస్పీ.. నాగరాజుతో పాటు గుడివాడకు చెందిన మందాల కిరణ్‌రాజు, పమిడిముక్కలకు చెందిన చీకుర్తి నాని అలియాస్ బీస్ట్‌పై పీడీ యాక్టును అమలుపరిచి జైలుకు పంపారు. పై ముగ్గురు పట్టుబడిన కేసులో రాందాస్ గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలుసుకున్న ఎస్పీ జిల్లా పోలీసులను అప్రమత్తం చేశారు. ఇదిలా ఉండగా మచిలీపట్నంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా రాందాస్ కంటబడ్డాడు. వెంటనే పోలీసులు రాందాస్‌ను అదుపులోకి తీసుకుని బ్యాగు సోదా చేయగా పెద్ద మొత్తంలో గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. రాందాస్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు తక్షణం అతని వద్ద గంజాయి కొనుగోలు చేసిన గుడివాడలో ఒకరిని, ఘంటసాలలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని.. వారి నుంచి ఆరు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు.

29 నుంచి తిరుపతిలో చతుర్వేద హవనం

తిరుపతి కల్చరల్: లోక కల్యాణార్థం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఆవరణలోని పరేడ్ మైదానంలో ఈ నెల 29 నుంచి జూలై 5 వరకు శ్రీశ్రీనివాస చతుర్వేద హవనం నిర్వహిస్తున్నట్లు టీటీడీ జేఈవో సదా భార్గవి తెలిపారు. మంగళవారం అధికారులతో కలిసి పరేడ్ మైదానంలో ఏర్పాట్లను జేఈవో పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతిలో తొలిసారిగా 7 రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో వేదాల ప్రాముఖ్యత..వేదాలు ఎలా ఉద్భవించాయి.. వేదాల విశిష్టత.. వేదాలు ప్రపంచానికి ఏ విధంగా మేలు చేస్తాయి.. అనే అంశాలపై ప్రముఖ పండితులతో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

జనవరి 14న అయోధ్య రామాలయ ప్రతిష్టాపన

న్యూఢిల్లీ: అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం చకచకా సాగుతోంది. వచ్చే ఏడాది జనవరి 14న మకర సంక్రాంతి రోజు ఆలయ ప్రతిష్టాపన జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా చెప్పారు. ప్రతిష్టాపన వేడుకలు 10 రోజులపాటు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ వేడుకలను దేశ విదేశాల్లో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కనీసం వెయ్యి సంవత్సరాలపాటు పటిష్టంగా ఉండేలా రామాలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు.

ఎన్నికల నిర్వహణ... హింసకు లైసెన్స్ కాదు

మమతకు సుప్రీంలో ఎదురు దెబ్బ

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో జులై 8న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో కేంద్ర బలగాలను మోహరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఎన్నికల సందర్భంగా కేంద్ర బలగాలను మోహరించాలని కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం మంగళవారం కొట్టేసింది. ఎన్నికలు నిర్వహించడమంటే హింసను రాజేయడానికి లైసెన్స్ ఇవ్వడం కాదంటూ మమత ప్రభుత్వంపై మండిపడింది. రాష్ట్రంలో ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా సాగడానికే హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చిందని జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన సుప్రీం బెంచ్ ఆదేశించింది. పంచాయతీ ఎన్నికల నామినేషన్ల సమయంలోనే ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో పలువురు మరణించడంతో హైకోర్టు కేంద్ర బలగాలను మోహరించాలని ఆదేశాలు జారీ చేసింది.

పాక్‌లో అణు విద్యుత్కేంద్రం ఏర్పాటుకు చైనా సాయం

ఇస్లామాబాద్: పాకిస్తాన్–చైనాల వ్యూహాత్మక మైత్రి బలోపేతం అవుతోందనేందుకు మరో ఉదాహరణ. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న పాక్‌లో రూ.39 వేల కోట్లతో 1,200 మెగావాట్ల సామర్థ్యం కలిగిన అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు చైనా ముందుకు వచ్చింది. పంజాబ్‌లోని మియాన్‌వలి జిల్లా చస్మా వద్ద చేపట్టే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందంపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సమక్షంలో మంగళవారం బీజింగ్‌లో రెండు దేశాల మధ్య సంతకాలు జరిగాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణమే ప్రారంభిస్తామని షరీఫ్ ప్రకటించారు.

రాజకీయ వేడి!



పట్నా సమావేశంలో విపక్ష పార్టీలు ఐక్యతను సాధించగలవా ?

ఎన్డీయే పార్టీలను కలిపే వ్యూహాల్లో మోదీ, షా విజయం సాధిస్తారా?

దేశంలో ఇప్పుడు అందరి దృష్టి రెండు మెగా ఈవెంట్స్ మీదే ఉంది.

మొదటిది ప్రధాని మోదీ అధికారిక హోదాలో అమెరికా పర్యటన

రెండోది బిహార్ సీఎం నితీశ్ కుమార్ చొరవతో పట్నాలో జరిగే విపక్షాల భేటీ

అమెరికాలో మోదీ ప్రవాస భారతీయులతో ఆత్మీయ సమావేశంలో మన దేశ పురోగతిపై మాట్లాడే రోజే ఇక్కడ మోదీని గద్దె నుంచి దింపాలన్న ఉమ్మడి ఎజెండాతో విపక్షాలు మంత్రాంగం రచిస్తున్నాయి.

విపక్షాలు ఎంతవరకు ఐక్యరాగం ఆలపిస్తాయి ? దానిని ఎదుర్కొనే వ్యూహాలు ఎన్డీయే దగ్గర ఏమున్నాయి ?





వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఎదుర్కోవడానికి విపక్షాలంతా చేయి చేయి కలిపి తమ బలం చాటనున్నారు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ సహా 20 జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఈ నెల 23న పట్నాలో సమావేశమై మోదీని ఎదుర్కోవడానికి అవసరమైన వ్యూహాలను రచించనున్నారు. దేశంలో అత్యంత బలవంతుడైన నాయకుడు మోదీని ఎదిరించి నిలబడుతున్న రాహుల్ గాంధీ, అరవింద్ కేజ్రీవాల్; మమతా బెనర్జీ వంటి వారు ఈ సమావేశానికి హాజరై వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీని గద్దె దింపడమే లక్ష్యంగా మంత్రాంగం నడపనున్నారు. పాట్నా సమావేశంలో ప్రతిపక్ష పార్టీలందరూ ఒకే తాటిపైకి రాగలరా అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. పార్టీల్లో ఎవరికి వారికే ప్రధానమంత్రి పదవి తమకే దక్కాలన్న ఆశ ఉండడంతో చెట్టుకొకరు పుట్టకొకరుగా ఉన్నారు. ప్రధాని మోదీని ఎదుర్కోవాలంటే విపక్షాల ఓట్లు చీలకుండా ఉండడానికి బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ విపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి తీసుకురావడానికి చొరవ చూపించారు. ప్రతీ నియోజకవర్గంలోనూ బీజేపీకి దీటుగా ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిని బరిలో దింపుదామని ఆయన ప్రతిపాదించారు. కానీ ఇదెంతవరకు కార్యరూపం దాలుస్తోందన్న అనుమానాలున్నాయి.

- ప్రాంతీయ పార్టీల మధ్య నెలకొన్న రాజకీయ శత్రుత్వం విపక్షాల ఐక్యతకు అసలు సిసలైన సవాల్‌గా నిలుస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో ఉప్పు నిప్పుగా ఉన్న టీఎంసీ, లెఫ్ట్ పార్టీలను ఒకే తాటి పైకి తీసుకురావడం కష్టమనే అభిప్రాయాలున్నాయి. జమ్మూ కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ వంటి వాటితో కాంగ్రెస్ కలిసే అవకాశం లేదు
- సీట్ల సర్దుబాటు అన్నది లెక్కకు మించిన పార్టీల మధ్య సవ్యంగా జరగడం అతి పెద్ద సవాల్. పశ్చిమ బెంగాల్, అస్సాం, జార్ఖండ్, కేరళ, త్రిపుర, ఉత్తరప్రదేశ్‌లో పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అంత సులభంగా కనిపించడం లేదు. ఈ రాష్ట్రాల్లోనే 172 లోక్‌సభ స్థానాలున్నాయి.
- ఆమ్ ఆద్మీ పార్టీ మధ్యప్రదేశ్ , రాజస్తాన్‌లలో తాము పోటీకి దిగమని హామీ ఇస్తోంది కానీ తమకు గట్టి పట్టున్న న్యూఢిల్లీ, పంజాబ్‌లో కాంగ్రెస్ పార్టీ పోటీపడకూడదని షరతు విధిస్తోంది. అదే విధంగా పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ అధిక సంఖ్యలో సీట్లు కాంగ్రెస్‌కు కేటాయించడానికి సిద్ధంగా లేరు.
- బీజేపీపై ఉమ్మడి అభ్యర్థిని నిలపకపోతే మోదీని ఎదుర్కోవడం కష్టసాధ్యమని నితీశ్ కుమార్ అభిప్రాయంగా ఉంది. ఆ దిశగా ఆయన ఎంతవరకు ఒప్పించగలరన్నది సందేహమే.
- ప్రధాని మోదీకున్న చరిష్మాను తట్టుకొని నిలబడాలంటే చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ రాజీపడి ఇతర పార్టీలకు దగ్గరవాలని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది.
- ఈ సవాళ్లన్నింటిని అధిగమించడం ఇప్పుడే సాధ్యం కాదు కాబట్టి ప్రస్తుత సమావేశం దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలైన ధరాభారం, నిరుద్యోగంతో పాటు మతం పేరుతో సమాజాన్ని చీల్చే చర్యలకి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాట వ్యూహాన్ని చర్చించడానికి పరిమితమయ్యే అవకాశాలున్నాయి

ఒకవైపు విపక్ష పార్టీలన్నీ ఏకం కావడానికి సర్వశక్తులు ఒడ్డుతూ ఉంటే అధికార ఎన్డీయే నుంచి ఇప్పటికే ఎన్నో పార్టీలు దూరమయ్యాయి. మళ్లీ వారందరితోనూ జత కట్టడానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ద్వయం దృష్టి పెట్టారు. మహారాష్ట్రలో శివసేన దూరమయ్యాక ఆ పార్టీని చీల్చి ఏక్‌నాథ్ షిండేని సీఎంను చేసిన బీజేపీకి ఇప్పుడు ఆయన వైఖరి కూడా కొరుకుడు పడడం లేదు. మహారాష్ట్రలో బీజేపీకి చెందిన ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కంటే ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండేకి జనాదరణ అధికంగా ఉందని పేపర్‌లో ప్రకటన ఇవ్వడం బీజేపీకి మింగుడు పడడం లేదు.తమిళనాడులో మిత్రపక్షమైన ఏఐఏడీఎంకే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై జయలలితపై చేసిన వ్యాఖ్యల్ని వ్యతిరేకిస్తూ ఒక తీర్మానం చేసింది. ఇక బిహార్‌లో నితీశ్ కుమార్ జేడీ (యూ) దూరమయ్యాక ఎన్నికల్లో బీజేపీ నష్టపోతుందని పార్టీ అంతర్గత సర్వేల్లో వెల్లడైంది. ఇటీవల ప్రధాని మోదీ బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎం, డిప్యూటీ సీఎంలతో జరిగిన సమావేశంలో తమతో కలిసే మిత్రపక్షాలను కలుపుకొని పోవాలని మోదీ ఆదేశాలిచ్చినట్టు తెలుస్తోంది.

- కేంద్రం తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ 2020లో ఎన్డీయేకి గుడ్‌బై కొట్టేసిన పంజాబ్‌లోని శిరోమణి అకాలీదళ్‌ను కూడా తిరిగి ఎన్డీయే గూటికి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు.
- ఇక కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడిన మాజీ ప్రధాని దేవెగౌడకు చెందిన జేడీ(ఎస్) ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో చేతులు కలపాలని కలిసి పోటీ చేయడం దాదాపుగా ఖరారైంది. బీహార్‌లో కులప్రాతిపదికన చిన్న పార్టీలను కలుపుకొని వెళితే మేలన్న యోచనలో బీజేపీ ఉంది. లోక్‌జనశక్తి పార్టీ (చిరాగ్ చీలిక వర్గం) ఎన్డీయేకి దూరమవకుండా చర్యలు తీసుకుంటూనే హిందూస్తాన్ అవామ్ మోర్చా (హెచ్‌ఏఎం) దగ్గరకు తీసుకునే చర్యలు చేపడుతోంది. నితీశ్ ప్రభుత్వంలో మంత్రిగా ఉండే ఇటీవల విభేదాల కారణంగా బయటకు వచ్చిన వికాశ్ శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) చీఫ్ ముకేశ్ సాహ్నితో కూడా మంతనాలు సాగిస్తోంది.
- ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీతో కలిసి పోటీ చేసిన ఓం ప్రకాశ్ రాజ్‌బహార్‌కు చెందిన సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీతో మంతనాలు సాగిస్తోంది. బీజేపీ యూపీ అధ్యక్షుడు చౌదరి భూపేంద్ర సింగ్ వారణాసిలో జరిగిన రాజ్‌బహార్ వ్యక్తిగత కార్యక్రమానికి హాజరయ్యారు. ఇలా అన్ని వైపుల నుంచి ఎన్డీయేని బలోపేతం చేయడానికి బీజేపీ వ్యూహాలు పన్నుతోంది.

సాక్షి, నేషనల్ డెస్క్

భార్యపై కోపంతో బస్తాలకొద్దీ నాణేలు..

జైపూర్: భార్యకు భరణంగా ఇవ్వాల్సిన రూ.55 వేలను రూపాయి, రెండు రూపాయల నాణేల రూపంలో తెచ్చిన ఓ భర్తకు కోర్టు షాకిచ్చింది. వాటిని తీసుకోవాలని భార్యను కోరుతూనే, ఆ మొత్తాన్ని రూ.వెయ్యి వంతున స్వయంగా లెక్కించి ఇవ్వాలంటూ భర్తను ఆదేశించింది. రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. హర్మదా ప్రాంతానికి చెందిన దశరథ్ కుమావత్, భార్య సీమ విభేదాలు రావడంతో విడాకుల కోసం కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అక్కడ ఈ కేసు పెండింగ్‌లో ఉంది. అప్పటి వరకు సీమకు నెలకు రూ.5 వేల చొప్పున నిర్వహణ ఖర్చుల కింద ఇవ్వాలని దశరథ్‌ను న్యాయస్థానం ఆదేశించింది. అయితే, అతడు 11 నెలలుగా ఆ సొమ్మును ఇవ్వడం లేదు. దీంతో, సీమ మళ్లీ కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అతడిపై కోర్టు రికవరీ వారెంట్ జారీ చేసింది. డబ్బు చెల్లించేందుకు అతడు నిరాకరించడంతో పోలీసులు జూన్ 17న అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఫ్యామిలీ కోర్టు సెలవులో ఉండటంతో పోలీసులు దశరథ్‌ను అదనపు జిల్లా న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. దశరథ్ అరెస్ట్ కావడంతో సీమకు చెల్లించాల్సిన డబ్బును అతడి కుటుంబసభ్యులు ఏడు బస్తాల్లో కోర్టుకు తీసుకువచ్చారు. రూ.55 వేలకు సమానమైన రూ.1, రూ.2 నాణేలు వాటిలో ఉన్నాయి. ఆ డబ్బును తీసుకునేందుకు సీమ నిరాకరించారు. తనను మానసికంగా వేధించాలని ఉద్దేశపూర్వకంగానే ఇలా తీసుకువచ్చారని ఆరోపించారు. న్యాయమూర్తి మాత్రం నాణేల రూపంలో దశరథ్ డబ్బు చెల్లించవచ్చని తెలిపారు. అయితే, ఆ నాణేలన్నిటినీ అతడే స్వయంగా లెక్కించాలని స్పష్టం చేశారు. ఈ కేసు విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి వరకు డబ్బు కోర్టు అధీనంలోనే ఉంటుందని తెలిపారు. విచారణ తేదీ రోజున డబ్బును దశరథ్ లెక్కించి రూ.వెయ్యి చొప్పున ప్యాకెట్లుగా విభజించి, కోర్టులో వాటిని భార్యకు అప్పగించాలని తేల్చి చెప్పారు.

ఐఐటీ–బాంబేకు మరో రూ.315 కోట్ల విరాళం

రూ.400 కోట్లకు చేరిన నందన్ నీలేకని విరాళం

ముంబై: ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, చైర్మన్ నందన్ నీలేకని(68) ప్రఖ్యాత ఇంజనీరింగ్ విద్యాసంస్థ ఐఐటీ–బాంబేకు మరో రూ.315 కోట్ల విరాళం అందజేశారు. దీంతో ఈ సంస్థకు ఆయన ఇప్పటిదాకా ఇచ్చిన విరాళం రూ.400 కోట్లకు చేరుకుంది. నందన్ నీలేకని 1973లో ఐఐటీ–బాంబేలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్స్ డిగ్రీలో చేరారు. ఈ సంస్థతో తన అనుబంధానికి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా రూ.315 కోట్ల విరాళం ఇచ్చినట్లు నీలేకని చెప్పారు. ఐఐటీ–బాంబేకు పూర్వ విద్యార్థులు ఇచ్చిన అతిపెద్ద విరాళాల్లో ఇది కూడా ఒకటిగా రికార్డుకెక్కింది. ఆయన గతంలో ఇదే సంస్థకు రూ.85 కోట్ల విరాళం అందజేశారు. ఐఐటీ–బాంబే 1958లో ఏర్పాటయ్యింది. దేశంలో ఇది రెండో ఐఐటీ.

శారీరక బంధం నిరాకరణ నేరం కాదు

సాక్షి బెంగళూరు: వివాహం అనంతరం శారీరక సంబంధాన్ని నిరాకరించడం నేరం కాదని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు అభిప్రాయపడింది. ఇదే సమయంలో హిందూ వివాహ చట్టం–1955 ప్రకారం లైంగిక చర్యకు నిరాకరించడం క్రూరత్వంతో సమానమని తెలిపింది. శారీరక సంబంధం నిరాకరించిన ఘటనలో ఒక భర్తపై భార్య, ఆమె తల్లిదండ్రులు దాఖలు చేసిన క్రిమినల్ కేసుపై విచారించిన హైకోర్టు ఈమేరకు వ్యాఖ్యానించింది. శారీరక సంబంధాన్ని నిరాకరించడం ఐపీసీ సెక్షన్ 489ఏ కిందికి రాదని, అది నేరం కాదని స్పష్టం చేసింది. ఐపీసీ సెక్షన్ 498ఏ, వరకట్న నిరోధక చట్టం–1961 సెక్షన్ 4 కింద దాఖలైన కేసులు, పోలీసు చార్జిషీట్‌ను వ్యతిరేకిస్తూ భర్త హైకోర్టును ఆశ్రయించాడు. అతడి పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న విచారించారు. 'పిటిషనర్ ధార్మికుడు. అతని దృష్టిలో ప్రేమ అంటే శారీరక సంబంధం కాదు. అది ఆత్మల కలయిక. అందుకే భార్యతో శారీరక సంబంధాన్ని నిరాకరించాడు'అని జడ్జి తెలిపారు. ఇలా శారీరక సంబంధం కలిగి ఉండకపోవడం హిందూ వివాహ చట్టం సెక్షన్ 12 (1) (ఏ) కింద క్రూరమైన చర్య, అయితే ఐపీసీ 498 (ఏ) కింద నేరం కాదంటూ భర్త, అతని తల్లిదండ్రులపై పెట్టిన కేసులను కొట్టివేశారు.

శాంతి వైపే భారత్

ఉక్రెయిన్–రష్యా యుద్ధంపై మా వైఖరి తటస్థం కాదు

ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని అందరూ గౌరవించాల్సిందే

వాల్‌స్ట్రీట్ జర్నల్ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఉక్రెయిన్–రష్యా యుద్ధంపై భారత్ తటస్థంగా వ్యవహరిస్తోందని కొందరు చెబుతున్నారని, అందులో ఎంతమాత్రం నిజం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. తాము తటస్థంగా లేమని, శాంతి వైపే ఉన్నామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాలు, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని ప్రపంచదేశాలన్నీ గౌరవించాల్సిందేనని అన్నారు. అంతర్జాతీయ వేదికపై మరింత సమున్నత పాత్ర పోషించే అర్హత భారత్‌కు ఉందని వ్యాఖ్యానించారు. అగ్రరాజ్యం అమెరికాతో భారత్ సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత బలంగా ఇప్పుడు ఉన్నాయని చెప్పారు. అమెరికా పర్యటన సందర్భంగా మోదీ మంగళవారం ప్రఖ్యాత 'వాల్‌స్ట్రీట్ జర్నల్' పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఇతర ఏ దేశానికీ భారత్ ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. ప్రపంచంలో తమకు దక్కాల్సిన సరైన స్థానం సంపాదించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. భారత్–చైనా సంబంధాలపై మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య సాధారణ సంబంధాలు కొనసాగాలంటే సరిహద్దుల్లో శాంతియుత పరిస్థితులు నెలకొనడం తప్పనిసరన్నారు. ఇతర దేశాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను గౌరవిస్తామన్నారు. భేదాభిప్రాయాలను, వివాదాలను చట్టబద్ధ పాలన ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నదే తమ అభిమతమని ఉద్ఘాటించారు. అదేసమయంలో తమ సార్వభౌమత్వం, గౌరవాన్ని కాపాడుకోవడంలో రాజీపడే ప్రసక్తే లేదని తెలియజేశారు. ఉక్రెయిన్–రష్యా ఘర్షణ నివారణకు తాము చేయాల్సిందంతా చేస్తామన్నారు. ఉక్రెయిన్–రష్యా విషయంలో భారత్ వైఖరిని ప్రపంచం అర్థం చేసుకుందన్నారు. భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాల్సిన ఆవశ్యకతను ప్రధాని నొక్కిచెప్పారు.


న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో భారతీయులతో మోదీ..

న్యూయార్క్ చేరుకున్న మోదీ

భారత ప్రధాని మోదీ మంగళవారం న్యూయార్క్‌కు చేరుకున్నారు. అమెరికా ప్రభుత్వ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. మోదీకి స్వాగతం పలకడానికి భారతీయ–అమెరికన్లు సైతం భారీగా తరలివచ్చారు.

భారత్–అమెరికా బంధం సుసంపన్నం

భారత్–అమెరికా సంబంధాల్లోని వైవిధ్యం, గాఢతను మరింత సుసంపన్నం చేయడానికి తన పర్యటన దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. అమెరికా ప్రభుత్వ పెద్దలతో భేటీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని చెప్పారు. ఆయన మంగళవారం ఉదయం అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్, అమెరికా కలిసికట్టుగా పని చేస్తున్నాయని తెలిపారు. అమెరికాలో పర్యటించాల్సిందిగా అధ్యక్షుడు జో బైడెన్, ప్రథమ పౌరురాలు జిల్ బైడెన్ నుంచి తనకు ప్రత్యేక ఆహ్వానం అందిందని పేర్కొన్నారు. రెండు బలమైన ప్రజాస్వామ్య దేశాలైన భారత్–అమెరికా భాగస్వామ్య బలానికి, శక్తికి, తేజస్సుకు తన పర్యటన ఒక ప్రతిబింబమన్నారు.

అమెరికా పార్లమెంట్ అండదండలు

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తోపాటు అక్కడి ఉన్నతాధికారులతో సమావేశం కాబోతున్నామని ప్రధాని మోదీ వివరించారు. ఇరుదేశాల నడుమ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఈ చర్చలు తోడ్పడుతాయని చెప్పారు. న్యూయార్క్ నుంచే తన పర్యటన ప్రారంభం కాబోతోందని, ఈ నెల 21న ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో యోగా దినోత్సవంలో పాల్గొంటానని తెలిపారు. అమెరికా పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో మాట్లాడబోతున్నానని వివరించారు. అమెరికా పర్యటన అనంతరం 24న ఈజిప్టుకు పయనమవుతానని మోదీ తెలిపారు.

ప్రధాని మోదీ అమెరికాలో నోబెల్ బహుమతి గ్రహీతలు, ఆర్థికవేత్తలు, కళాకారులు, సైంటిస్టులు,వ్యాపారవేత్తలు, విద్యావేత్తలతో సమావేశం కానున్నారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్, రచయిత నీల్ డిగ్రాస్ టైసన్‌లను కలుసుకుంటారు.

నేరాంగీకారానికి సిద్ధమైన బైడెన్ తనయుడు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ తనపై నమోదైన రెండు కేసుల్లో నేరం అంగీకరించేందుకు ముందుకు వచ్చారు. ఆయనపై ఆదాయ పన్ను ఎగవేతతోపాటు అక్రమంగా ఆయుధాన్ని కలిగి ఉన్నారనే అభియోగాలు నమోదయ్యాయి. ఇందుకు సంబంధించిన కేసుల్లో న్యాయశాఖతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారంటూ డెలావెర్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై ఫెడరల్ జడ్జి ఆమోదం తెలపాల్సి ఉంది. అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ హంటర్ బైడెన్ తాజా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఫలితంగా ఆయన జైలు శిక్ష నుంచి తప్పించుకునేందుకు అవకాశాలున్నాయి.

పర్యావరణహిత పర్యాటకం లక్ష్యంగా పనిచేద్దాం

సాక్షి, న్యూఢిల్లీ: పర్యావరణహిత పర్యాటక విధానాన్ని జీ20 సభ్యదేశాలు, ఆతిథ్య దేశాలు అవలంబించినపుడే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోగలమని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పణజిలో జరిగిన జీ20 చివరి (4వ) వర్కింగ్ గ్రూప్ సమావేశంలో మంత్రి మాట్లాడారు. గుజరాత్‌లోని కచ్, బెంగాల్‌లోని సిలిగురి, కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగిన మొదటి మూడు పర్యాటక వర్కింగ్ గ్రూప్ సమావేశాల్లో సభ్య దేశాల ప్రతినిధుల మధ్య కీలకమైన అంశాలపై లోతైన చర్చ జరిగిందన్నారు. అప్పటి నిర్ణయాలపై గోవాలో బుధవారం జరిగే పర్యాటక మంత్రుల సమావేశంలో చర్చిస్తామన్నారు. వాటిని 'గోవా రోడ్ మ్యాప్'పేరుతో తదుపరి కార్యాచరణకు ముందుకు తీసుకెళ్తామని కిషన్ రెడ్డి వెల్లడించారు.

యూపీ, బిహార్‌లకు కేంద్ర బృందాలు

న్యూఢిల్లీ: దేశంలో అత్యధిక రాష్ట్రాలలో ఇంకా వేసవి వడగాడ్పులు కొనసాగుతూ ఉండడంతో కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించింది. వడగాడ్పుల నుంచి ప్రజారోగ్యాన్ని కాపాడే విషయంలో అధికారుల సన్నద్ధతపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సమీక్షించారు. వడగాడ్పులతో 100 మంది వరకు మరణించిన ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో కేంద్ర బృందాలు పర్యటించాలని మాండవీయ ఆదేశించారు. కేంద్ర ఆరోగ్య శాఖలో నిపుణులు, ఐసీఎంఆర్, ఐఎండీ, ఎన్‌డీఎంఏకు చెందిన బృందాలు త్వరలో ఈ రెండు రాష్ట్రాల్లో పర్యటించి వడదెబ్బ తగిలిన వారికి, ఎండాకాలం వచ్చే వ్యాధుల బారిన పడిన నిరుపేదలకు సాయం అందించనున్నారు. ఇక వడదెబ్బ తగలకుండా ప్రజలే జాగ్రత్త వహించేలా అవగాహన పెంచే చర్యలు కూడా చేపట్టాలని కేంద్ర మంత్రి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వడదెబ్బ ప్రభావం శరీరంపై పడకుండా తగ్గించుకోవడానికి ఏం చెయ్యాలనే అంశాలపై స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)ను ఆదేశించారు. దీనికి సంబంధించి విస్తృతంగా అధ్యయనాలు, పరిశోధనలు చెయ్యాలన్నారు. వేసవికాలంలో ఎండ తీవ్రతను ఎదుర్కోవడానికి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాతీయ స్థాయిలో రచించిన ప్రణాళికను ఇప్పటికే అన్ని రాష్ట్రాలతో ప్రధాని పంచుకున్నారని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంచడం అవసరమని మాండవీయ వివరించారు.



వైభవంగా జగన్నాథుని రథయాత్ర

పూరీ: ఒడిశాలోని పూరి జగన్నాథుడి రథయాత్ర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఏడాదికొకసారి జరిగే ఈ యాత్రలో సుభద్ర, బలభద్రసమేతుడైన జగన్నాథుడి రథయాత్రని కళ్లారా వీక్షించడానికి పూరీకి ప్రపంచం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. 45 అడుగుల ఎత్తైన జగన్నాథుడు, బలరాముడు, సుభద్ర కొలువు దీరిన రథాలను జై జగన్నాథ్ అంటూ భక్త జన సందోహం నినాదాలు, పూజారులు మంత్రోచ్ఛటనాల మధ్య యువకులు రథాలను లాగుతూ 2.5 కి.మీ. దూరంలో ఉన్న గుండిచా మందిరంలో భక్తుల సందర్శనార్థం ఉంచారు. తొమ్మిది రోజుల పాటు ఈ మందిరంలోనే భక్తులకు దర్శనమిస్తారు. జూన్ 28న జరిగే తిరుగు రథయాత్రలో పూరి మందిరానికి జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర తిరిగి చేరుకుంటారు. రాష్ట్ర గవర్నర్ గణేశ్ లాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జగన్నాథుడి రథాన్ని లాగి లాంఛనంగా యాత్రను ప్రారంభించారు. అంతకు ముందు గజపతి మహరాజ్ దివ్యసింగ్ దేవ్ మూడు రథాలను బంగారం చీపురుతో శుభ్రం చేసి రథయాత్రకు వాటిని సిద్ధం చేశారు.

టైటానిక్ వీక్షణకు వెళ్లి..

మినీ జలాంతర్గామి 'టైటాన్'గల్లంతు • యాత్రికుల్లో ముగ్గురు కుబేరులు • అట్లాంటిక్ సముద్రంలో గాలింపు

బోస్టన్: అట్లాంటిక్ సముద్రంలో శతాబ్దం క్రితం మునిగిపోయిన టైటానిక్ నౌక శకలాల సందర్శనకు నలుగురు యాత్రికులతో వెళ్లిన మినీ జలాంతర్గామి 'టైటాన్'జాడ తెలియకుండా పోయింది. ఈ మినీ జలాంతర్గామిలోని యాత్రికుల్లో ముగ్గురు కుబేరులున్నారు. కెనడాలోని న్యూఫౌండ్‌లాండ్ రాష్ట్రం సెంట్ జాన్స్‌కు 700 కిలోమీటర్ల దూరంలోని అట్లాంటిక్ సముద్రంలోని టైటానిక్ శకలాల వద్దకు ఆదివారం దిగుతూ 1.45 గంటల తర్వాత సంబంధాలు తెగిపోయినట్లు యాత్ర నిర్వహిస్తున్న ఓషన్ గేట్ సంస్థ తెలిపింది. యాత్రికుల్లో ఒకరు దుబాయ్‌లో ఉంటున్న బ్రిటిష్ వాణిజ్యవేత్త, యాక్షన్ ఏవియేషన్ చైర్మన్ హమిష్ హార్డింగ్ కాగా. మిగతా ఇద్దరు లండన్‌లో ఉంటున్న పాక్ జాతీయుడైన వాణిజ్యవేత్త షహజాదా దావూద్, ఆయన కొడుకు సులేమాన్.

తెగిన సంబంధాలు..

టైటాన్‌కు పోలార్‌బేర్ అనే ఐస్‌బ్రేకర్ నౌక మార్గదర్శిగా వ్యవహరిస్తుంది. ఆదివారం ఉదయం సముద్రం లోపలికి వెళ్లిన 1.45 గంటల తర్వాత టైటాన్‌తో సంబంధాలు



తెగిపోయినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో బయలుదేరే సమయానికి అందులో 96 గంటలకు సరిపోను ఆక్సిజన్ ఉందని ఓషన్ గేట్‌కు చెందిన డేవిడ్ కాన్‌కానన్ చెప్పారు.

ఒక్కొక్కరి ఫీజు రూ.2 కోట్లు


హమిష్


సులేమాన్, దావూద్

1912లో అట్లాంటిక్ సముద్రంలో టైటానిక్ ఓడ ఐస్‌బర్గ్‌ను ఢీకొని మునిగిపోగా అందులోని మొత్తం 2,200 మందిలో 700 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నౌక శిథిలాలను సందర్శించాలనుకునే వారి కోసం ఓషన్ గేట్ సంస్థ మినీ సబ్‌మెరీన్‌ను నడుపుతోంది. ఇందులో ముగ్గురిని తీసుకెళుతుంది. ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.2 కోట్లు ఫీజుగా వసూలు చేసింది. టైటానిక్ ఓడ సముద్ర గర్భంలో 3.8 కిలోమీటర్ల అడుగున ఉండగా, టైటాన్ 6 కిలోమీటర్ల వరకు వెళ్లగలుగుతుంది.

చైనా దుష్టబుద్ధి

ఐక్యరాజ్యసమితి: డ్రాగన్ దేశం చైనా మరోసారి తన దుష్టబుద్ధిని చాటుకుంది. పాక్‌కు చెందిన లష్కరే తోయిబా సభ్యుడు, 26/11 ముంబై ఉగ్ర దాడుల్లో పాల్గొన్న సాజిద్ మీర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా పరిగణిస్తూ ఐరాస బ్లాక్‌లిస్టులో చేర్చాలంటూ భారత్, అమెరికా ప్రతిపాదించగా చైనా మంగళవారం అడ్డుకుంది. భద్రతా మండలికి సంబంధించిన '1267 అల్‌ఖైదా శాంక్షన్స్ కమిటీ' ప్రకారం సాజిద్ మీర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించాలని, అతడి ఆస్తులను స్తంభింపజేయాలని, ప్రయాణ నిషేధం విధించాలని భారత్, అమెరికా ప్రతిపాదించాయి. ఈ ప్రతిపాదన ఆమోదం పొందకుండా చైనా అడ్డుపడింది. సాజిద్ మీర్ భారత్‌లో మోస్ట్ వాంటెడ్ జాబితాలో కొనసాగుతున్నాడు. అతడి తలపై అమెరికా ప్రభుత్వం 5 మిలియన్ డాలర్ల బహుమానం ప్రకటించింది. సాజిద్ మీర్ గతంలోనే చనిపోయాడని పాకిస్తాన్ ప్రభుత్వం వాదిస్తోంది.

సాక్షి విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

బుధవారం । 21 । జూన్ । 2023




నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన కూకట్‌పల్లి వెస్ట్రన్ హిల్స్‌కు చెందిన రాలీ భాను మూర్తి రూ.లక్ష విరాళంగా అందజేశారు.



24న జగన్నాథ రథయాత్ర

పాత గుంటూరు: గుంటూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నగరంలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు పుండరీక గోవింద్‌దాస్ తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 520.10 అడుగుల వద్ద ఉంది. ఇది 149.4580 టీఎంసీలకు సమానంగా ఉంది.

న్యూస్‌రీల్

'నెమలి' హుండీ ఆదాయం రూ. 17.76లక్షలు



నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. మార్చి 28 నుంచి మంగళవారం వరకు భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించగా రూ. 17,76,939 నగదు వచ్చినట్లు దేవదాయ సహాయ కమిషర్ డి. శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. గన్నవరం డివిజన్ అధికారి వి. సుధాకర్ పర్యవేక్షణలో ఆలయంలో స్టేట్ బ్యాంక్ సిబ్బంది, సత్యసాయి సేవా సమితి సభ్యులు కానుకలు లెక్కించారు. కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, పాలకవర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రభుత్వ సహకారం భేష్



ఇబ్రహీంపట్నం: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని ఇథియోపియా బృందం సభ్యులు కొనియాడారు. మండలంలోని జూపూడి, మూలపాడు గ్రామాల్లో మంగళవారం ఆ బృంద సభ్యులు పర్యటించారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువుల నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు అందించడంపై మాట్లాడారు. ఈ క్రాప్ నమోదుతో రైతు ప్రయోజనాలు, బీమా సదుపాయాన్ని తెలుసుకున్నారు. పంటకోత దిగుబడి అంచనాపై వీఏఏలు ఫీల్డ్‌లో ప్రయోగం చేసి వివరించారు. వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలుసుకున్నారు. ఇక్కడ పండే పంటలు, సాగునీటి లభ్యతపై ఆరా తీశారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి నాగమణిమ్మ, ఆర్బీకేల కమిషనరేట్ జేడీ వి.శ్రీధర్, ఈ క్రాప్ బుకింగ్ కమిషనరేట్ ఏడీ బాలభాస్కర్, జిల్లా ఏడీ అనితాభాను మైలవరం ఏడీ శ్రీనివాసరావు, ఏఓ శైలజ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

యార్డుకు 46,973 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 46,973 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 44,569 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,700 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాళ్లకు రూ.13,500 నుంచి 23,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి రూ. 24,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.7,000 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 15,755 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

22, 23 తేదీల్లో ఏఎన్‌యూలో జాబ్‌మేళా

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో ప్రఖ్యాత సంస్థల్లో ఉపాధి అవకాశాలు లభించనున్నాయని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించనున్న జాబ్‌మేళా ఏర్పాట్లపై యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అతిథి అధ్యాపకులతో మంగళవారం జరిగిన సమావేశంలో వీసీ ప్రసంగిస్తూ ఈనెల 22, 23 తేదీలలో ఏఎన్‌యూలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. జాబ్‌మేళా విజయవంతానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. డిగ్రీ, పీజీ, ఐటీ విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొని ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. వార్షిక వేతనం గరిష్ఠంగా రూ. 8.5 లక్షల వరకు పొందే అవకాశం ఉందన్నారు. ఉద్యోగ మేళాలో దేశవ్యాప్తంగా వందకుపైగా సంస్థలు పాల్గొని అర్హులకు తమ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నాయన్నారు. ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఆయా సంస్థలు ఎంపిక చేసుకుంటాయన్నారు.

ఆణిముత్యాలకు
మామ భరోసా
విజయవాడలో విద్యోత్సవం

విద్యతో విలువ, విశ్లేషణ శక్తి వస్తుంది. సంస్కార కోణం అబ్బుతుంది. అంతటి మహత్తర శక్తి కలిగిన విద్యామృతాన్ని పిల్లలకు అందించాలనే ఉన్నత లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థకు నవ్యత్వాన్ని అద్దారు. చదువే ఆస్తి అని భావించి పిల్లల బంగారు భవితకు బాటలు వేస్తూ ప్రభుత్వ పాఠశాలలతో.. కార్పొరేట్ స్కూళ్లే పోటీ పడేలా విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారు. పాఠశాలల రూపురేఖలు మార్చారు. వాటిలో సౌకర్యాలు అమర్చడంతో.. ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు విద్యలో సత్తా చాటుతున్నారు. టెన్త్‌లో 'కార్పొరేట్' కంటే ప్రభుత్వ బడుల విద్యార్థులే మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. సత్తా చాటిన టెన్త్, ఇంటర్మీడియెట్‌లో ఆణిముత్యాలైన విద్యార్థులకు మంగళవారం నగరంలోని ఏ కన్వెన్షన్ హాల్లో నగదు పురస్కారం అందజేసి, సత్కరించారు. వీరు ప్రతిరంగంలో ఎదగాలని ఆకాంక్షించి మేనమామగా వారి ఉన్నతికి భరోసా ఇచ్చారు.

- టెన్త్, ఇంటర్‌లో ఆణిముత్యాలను సత్కరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- రేపటి పౌరులు ప్రతి రంగంలో ఎదగాలని ఆకాంక్ష
- భవిష్యత్తులో పేద విద్యార్థులే ఏలికలు



జ్యోతి ప్రజల్వన చేస్తున్న సీఎం జగన్, మంత్రులు తానేటి వనిత, ఉషశ్రీచరణ్, వీఎంసీ మేయర్ భాగ్యలక్ష్మి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్ర స్థాయిలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' నగదు పురస్కారంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్కరించారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాల్లో మంగళవారం రాష్ట్ర స్థాయిలో 10వ తరగతిలో టాపర్స్‌గా నిలిచిన 42 మంది, ఇంటర్ మీడియెట్‌లో గ్రూపుల వారీ టాపర్స్‌గా సత్తా చాటిన 26 మంది, వీరితోపాటు ఉన్నత విద్యలో 5 కేటగిరీల్లో 20 మంది విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.

రేపటి పౌరులకు భరోసా

అవార్డులు అందజేస్తూనే విద్యార్థులను కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు, వారి నేపథ్యాన్ని సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీ జగన్ మామ అండగా ఉంటారని రేపటి పౌరులకు భరోసా ఇచ్చారు. కొంత మంది విద్యార్థులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎంకు తెలిపారు. టెన్త్‌లో టాపర్‌గా నిలిచిన ఓ విద్యార్థి 'తన తల్లికి క్యాన్సర్ సోకిందని' చెప్పగా, ఇంత కష్టమొచ్చినా బాగా చదువుకుంటున్నావని అభినందించారు. ఆ విద్యార్థి తల్లికి మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశించారు. ఉత్తమ విద్యార్థులందరితో గ్రూపు ఫొటో దిగిన సీఎం, అదే సమయంలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ ఉపయోగంపై విద్యార్థులతో ముచ్చటించారు. వీటిని ఎలా వినియోగించుకోవాలో, అగ్‌మెంట్ రియాల్టీలో కూడా పాఠ్యాంశాలను ఎలా నేర్చుకోవచ్చో తన కోసం అధికారులు ఏర్పాటు చేసిన డెమోను విద్యార్థులు పరిశీలించాలని సూచించారు. దీంతో విద్యార్థులు ఆసక్తిగా డెమోను పరిశీలించారు.



ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ చూపిన 'ఎన్టీఆర్' విద్యార్థి చంద్రికకు పురస్కారం అందజేస్తున్న సీఎం జగన్

పండుగ వాతావరణంలో

పండుగ వాతావరణంలో జగనన్న ఆణిముత్యాల అవార్డుల ప్రదాన కార్యక్రమం సాగింది. కార్యక్రమానికి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు చక్కటి ఏర్పాట్లు చేశారు. అవార్డులు ఇచ్చి ప్రోత్సహిస్తున్న జగన్ మామ మేలు ఎన్నటికీ మరువలేమని, ఆయన ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తామనే విశ్వాసాన్ని విద్యార్థులు వ్యక్తం చేశారు. విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రసంగించారు.

మట్టి నుంచి మహావృక్షాలుగా..



విద్యార్థులకు శుభాశీస్సులు అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

మట్టి నుంచి మహావృక్షాలుగా వృద్ధి చెందుతున్న విద్యార్థులను మనసారా ముఖ్యమంత్రి అభినందించారు. సీఎంను చూడగానే ఇంతటి ఉత్తమ కార్యక్రమాన్ని ఎవరూ చేయలేదంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన అభివాదం చేయగానే సత్కారం కోసం వచ్చిన వారు పులకించిపోయారు. 'మన పిల్లలు అన్ని రంగాల్లో ఎదగాలని' సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంటూ ఉండగా, మీ నమ్మకాన్ని వమ్ము చేయం సార్ అంటూ విద్యార్థులు అంటూ ఆయన హామీ ఇవ్వడం కనిపించింది. పేద విద్యార్థులే ప్రపంచాన్ని ఏలే పరిస్థితి త్వరలో వస్తుందని సీఎం అంటుండగా.. కొంత మంది ఇప్పుడే వచ్చిందని చర్చించుకున్నారు.

సీఎంకు ఘన స్వాగతం ...

జగనన్న ఆణిముత్యాల అవార్డుల ప్రదానోత్సవానికి వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం చెప్పారు. మంత్రులు బొత్స సత్యనారాయణ, తానేటి వనిత, మేరుగ నాగార్జున, కారుమూరి నాగేశ్వరరావు, ఉషశ్రీచరణ్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, కల్పలతారెడ్డి, అరుణ్‌కుమార్, రుహుల్లా, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, వసంత కృష్ణ ప్రసాద్, రెడ్డి శాంతి, మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, నగర మేయర్ భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు శ్రీశైలజారెడ్డి, దుర్గ, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, బండి పుణ్యశీల , విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్, ఇంటర్ మీడియెట్ విద్యాశాఖ కమిషనర్ శేషగిరిరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ టీకే రాణా, డీసీపీలు విశాల్‌గున్ని, అజిత వేజెండ్ల, ఏడీసీపీలు రమణమూర్తి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.




వానతో ఉపశమనం

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): మండుటెండ, ఉక్కపోతతో మధ్యాహ్నం వరకు అల్లాడిపోయిన ప్రజలు, మంగళవారం మధ్యాహ్నం తర్వాత కురిసిన భారీ వానతో ఉపశమనం పొందారు. నగరంతో పాటు జిల్లాలోని పలుప్రాంతాల్లో గంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వేసవిలో భానుడి ప్రతాపానికి అల్లాడిపోయినా... వర్షం కురవడంతో హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఒక్కసారిగా వాతావరణం మారి చల్లటి గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రోడ్లపై వాన నీరు నిలిచింది. అప్పటి వరకు ఎండవేడి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షంలో గొడుగులు వేసుకుని ఉత్సాహంగా తిరుగుతూ కనిపించారు. జిల్లాలో పంటలు వేసేందుకు పొలాలు సిద్ధం చేసుకున్న రైతులు పది రోజులుగా రుతుపవనాల రాకకోసం ఎదురు చూస్తున్నారు. ఒక్కసారిగా వర్షం కురవడంతో తొలకరి వచ్చినట్లేనని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వర్షం.. హర్షం.. వానలోనే ప్రయాణం

- విశాఖపట్నంకు చెందిన ఓ కుటుంబం దుర్గమ్మ దర్శనం కోసం ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. అమ్మవారి దర్శనం తర్వాత ఆలయ ప్రాంగణంలో సేద తీరుతూ చేతిలో ఉన్న సంచి అక్కడే మర్చిపోయారు. తీరా కొండ దిగిన కొద్దిసేపటి తర్వాత చేతిలో ఉండాల్సిన సంచి గుర్తుకు వచ్చింది. కొండపైకి వెళ్లే సరికి సంచి అక్కడ లేదు. ఇంతలో ఆలయ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు.. సీసీ కెమెరాలను పరిశీలించారు. ఓ భక్తుడు ఆ సంచిని తీసుకొని వెళ్లడం గమనించారు. వెంటనే సిబ్బంది అప్రమత్తమై ఆ భక్తుడిని పట్టుకుని సంచిని స్వాధీనం చేసుకున్నారు.
- గత శుక్రవారం ఉదయం 11.40 గంటల సమయంలో అమ్మవారికి నివేదన ఇవ్వడానికి అన్ని క్యూలైన్లు నిలిపివేశారు. సర్వ దర్శనం క్యూలో ఓ యువకుడు మహిళా భక్తుల వెనుక నిల్చుని వారితో అసభ్యకరంగా ప్రవర్తించడం సీసీ కెమెరాలో ఆలయ సిబ్బంది గమనించారు. వెంటనే పోలీసులను అప్రమత్తం చేయడంతో ఆ యువకుడిని పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. రెండు, మూడు వారాలుగా ఆ యువకుడు మహిళా భక్తులతో ఇదే రీతిలో వ్యవహరిస్తున్నట్లు సీసీ కెమెరా ఫుటేజీలో గుర్తించారు. ఆ యువకుడి ఫొటోను ఆలయ సెక్యూరిటీ, పోలీసు సిబ్బందికి అందించి నిఘా పెట్టాల్సిందిగా కోరారు.



కన్ను కప్పలేరు..

- దుర్గగుడిలో రెండు వందల సీసీ కెమెరాలు
- 24 గంటలూ మూడు షిఫ్టుల్లో సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో భక్తుల, సిబ్బంది కదలికలను నిఘా నేత్రం గమనిస్తోంది. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం రాష్ట్రంలోని అతి పెద్ద దేవస్థానాల్లో రెండోది. ప్రతి నిత్యం సుమారు 30 నుంచి 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ఇక శుక్రవారం, శని, ఆదివారాల్లో 50 నుంచి 70 వేల మంది భక్తులు వస్తుంటారు. వారి కోసం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. భక్తులు పుణ్యస్నానాలు చేసే దుర్గాఘాట్ పరిసరాలు మొదలుకొని, దర్శనం పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమయ్యే వరకు వారిని అనుక్షణం క్షుణంగా పరిశీలిస్తుంది. దీని కోసం దేవస్థానం సుమారు 200 వందల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. భక్తులు పుణ్యస్నానాల ఆచరించిన తర్వాత బస్సు ఎక్కే ప్రాంతంలో.. లగేజీ భద్రపరుచుకునే క్లోక్‌రూమ్, చెప్పుల స్టాండ్‌లతో పాటు క్యూలైన్ల వరకు పర్యవేక్షిస్తుంది.

అరకిలోమీటర్ దూరంలో ఎవరున్నా

ఆలయ ప్రాంగణంలో దేవస్థానం మొత్తం 200కు పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. వీటిలో 160కి పైగా బుల్లెట్ కెమెరాలు ఏర్పాటు చేయగా, డోమ్ కెమెరాలు మరో 20 వరకు ఉంటాయి. ఇక పీటీ-3 కెమెరాలు మరో 20 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో పీటీ-3 కెమెరాలు 360 డిగ్రీల కోణంలో సుమారు 30 ఎక్స్300 మీటర్ల జూమ్‌తో పని చేశాయి. ఆలయం నుంచి సుమారు అరకిలోమీటర్ దూరంలో ఎవరు ఉన్నా వారి ఫొటోలు, వీడియోలు తీయడంలో ఇవి దిట్ట. ఇక సీసీ కెమెరాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ పని చేస్తుంది. ఇందులో 24 గంటలూ ముగ్గురు సిబ్బంది విధుల్లో ఉంటూ ఆలయ పరిసరాలను పరిశీలిస్తుంటారు. క్యూలైన్‌లో, ఆలయ ప్రాంగణంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించిన అవుట్‌పోస్ట్‌లోని పోలీసులను అప్రమత్తం చేస్తున్నారు.

పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు, చైర్మన్

ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వీక్షించేందుకు ఆలయ ఈవో భ్రమరాంబ, చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు చాంబర్లలో ప్రత్యేక సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈవో భ్రమరాంబ ఆలయంలో లేనప్పుడు కూడా తన సెల్‌ఫోన్‌లో ఆలయంలో జరుగుతున్న వ్యవహారాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆలయంలో రద్దీ, భక్తుల ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

కీలక సమయంలోనూ...

దేవస్థానంలో ఏదైనా ఘటన జరిగితే దానికి మూలకారణం తెలుసుకోవడం ముఖ్యం. అటువంటి ఘటనలు జరిగిన తరుణంలో సీసీ కెమెరాల ఫుటేజీ ఎంతో కీలకంగా మారుతోంది. ఆలయ పరిసరాల్లో చోటు చేసుకుంటున్న చిన్న చిన్న దొంగతనాలు, బైక్ చోరీలు, భక్తులను ఏమార్చి చోరీలకు పాల్పడే వారిపై పోలీసులు నిఘా పెట్టడానికి ఉపయోగకరంగా ఉంటోంది. ఏదైనా వివాదాలు జరిగినప్పుడు కూడా ఫుటేజీ ఉపయోగపడుతోంది. ఎవరూ పట్టించుకోవడం లేదనకుని కొంతమంది భావిస్తున్న దుర్గగుడిలో నిఘా నేత్రం నిశితంగా పరిశీలిస్తోంది.

సొంతింటి దిశగా..



ఇళ్ల నిర్మాణానికి సిద్ధంగా ఉన్న లే అవుట్లు



లే అవుట్ల వద్ద ఇంటి పట్టాల లబ్ధిదారులతో దేవినేని అవినాష్, అడపా శేషు (ఫైల్)

- విజయవాడ నగరంలోని 27,031 మంది లబ్ధిదారులు
- అందరికీ పట్టాల పంపిణీ పూర్తి
- లేఅవుట్లను చూపించి, ఇళ్ల నిర్మాణాలకు ఆప్షన్ల స్వీకరణ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: పేదోడి సొంతింటి కల నెరవేరుతోంది. పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వకూడదనే టీడీపీ కుట్రలను ప్రభుత్వం పటాపంచలు చేస్తూ అన్ని అడ్డంకులు అధిగమించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం మేరకు పట్టాల పంపిణీ కార్యక్రమం పూర్తయ్యింది. ప్రధానంగా విజయవాడ నగర పరిధిలోని మూడు నియోజకవర్గాలు తూర్పు, సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో 27,031 మంది లబ్ధిదారులను ప్లాట్లకు తీసుకెళ్లి, వారికి స్థలాలను చూపి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. లబ్ధిదారుల నుంచి ఆప్షన్‌లు తీసుకున్నారు. ఈ మేరకు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి అనుమతుల కోసం ఇప్పటికే 23,700 మంది జాబితాను పంపారు. లబ్ధిదారులకు సర్వే కోడ్‌ను జనరేట్ చేశారు. సీఆర్డీఏ పరిధిలోని ఆర్5 జోన్లో కేటాయించిన లేఅవుట్లలో గృహ నిర్మాణాలను త్వరితగతిన చేపట్టేందుకు వీలుగా ఇప్పటికే కాంట్రాక్టర్లతో కలెక్టర్ ఢిల్లీరావు సమావేశం ఏర్పాటు చేసి, దిశా నిర్దేశం చేశారు. అలాగే విజయవాడ నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ పి. సంపత్ కుమార్ కూడా కాంట్రాక్టర్లతో చర్చించారు.

సామగ్రి సిద్ధం చేసుకోండి..

సీఆర్‌డీఏ పరిధిలో 737 ఎకరాల విస్తీర్ణంలో 14 లేఅవుట్లలో జిల్లాకు చెందిన 27,031 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. వీరిలో విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులు ఉన్నారు. వీరికి అనంతవరం, కురగల్లు, మందడం, నిడమర్రు, పిచ్చికలపాలెం వద్ద లేఅవుట్లను కేటాయించారు. ఆయా లేఅవుట్లలోని జగనన్న కాలనీలలో కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఐరన్, స్టీల్, వంటి మెటీరియల్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కాంట్రాక్టర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్మాణ పనులకు అవసరమైన విద్యుత్, నీటి సౌకర్యం కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. కాంట్రాక్టర్లు పనులకు అవసరమైన యంత్ర సామగ్రి, కూలీలను సిద్ధం చేసుకుని ప్రారంభించుకోవాలన్నారు. అన్ని లేఅవుట్లలో పనులను ప్రారంభించి బిలో బేస్మెంట్ స్థాయికి తీసుకురావాలని సూచించారు.

ప్రజాప్రతినిధులతో కలిసి..

విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజక ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌లు లబ్ధిదారులకు పట్టాలు అందజేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి కేటాయించిన స్థలం చూసి లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పట్టాల పంపిణీ ఇలా..

నియోజకవర్గం	పేదలకు ఇచ్చే ప్లాట్ల సంఖ్య
విజయవాడ సెంట్రల్	9,495
విజయవాడ ఈస్ట్	8,258
విజయవాడ వెస్ట్	9,278
మొత్తం	27,031

మరింత సమర్థంగా ఎఫ్‌డీపీ

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

నాగాయలంక: రోగ నివారణ లక్ష్యాల సాధనలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు(పీహెచ్‌సీలు) కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం(ఎఫ్‌డీపీ) కాన్సెప్ట్‌ను జిల్లాలో మరింత సమర్థంగా అమలు చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం నాగాయలంక మండలంలో విస్తృతంగా పర్యటించి ఆకస్మిక తనిఖీలు చేశారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ప్రధానంగా వైఎస్సార్ వెల్నెస్ సెంటర్లు, ఎఫ్‌డీపీ, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై దృష్టి పెట్టి పర్యటిస్తున్నాని చెప్పారు. మీడియా ప్రశ్నలకు సమాధానంగా ఈప్రాంతంలో మట్టి అక్రమ తవ్వకాలంటూ 'స్పందన'లో ఫిర్యాదులు అందిన విషయం వాస్తవమేనని, అయితే మట్టి జగనన్న కాలనీల లేఅవుట్‌లకు తోలుతున్నారని మాకు సమాచారం ఉందన్నారు. అయినా ఈ ఆరోపణలపై బందరు ఆర్డీఓను పరిశీలించాలని ఆదేశించానని చెప్పారు. వక్కపట్లవారిపాలెం సమీపంలో ఓఎన్‌జీసీ ప్లాంట్‌ల పరిసరాల్లో నిబంధనలు పాటించక పోవడంతో రైతులు పంటకు తీవ్రనష్టం వాటిల్లుతుందన్న రైతుల ఫిర్యాదుపై సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. తొలుత భావదేవరపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. అనంతరం నాగాయలంకలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ రకాల రికార్డులను తనిఖీ చేశారు. పీహెచ్‌సీ ప్రయోగశాల పనితీరుపై టెక్నీషియన్‌ను, పాముకాటు, కుక్కకాటుకు మెడిసిన్స్ లభ్యత, డేటా ఎంట్రీ విధానంపై వైద్యాధికారి డాక్టర్ డి.జయసుధను అడిగారు. తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం జరిపారు. పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి, బందరు ఆర్డీఓ ఐ.కిశోర్, తహసీల్దార్ విమలకుమారి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, డెప్యూటీ డీఈఓ ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



నాగాయలంక పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాజాబాబు, డీఎంహెచ్‌ఓ గీతాబాయి

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పటమట చెన్నుపాటి రామకోటయ్య స్టేడియం ఆవరణలో బుధవారం 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని అమరావతి యోగా అండ్ ఏరోబిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 గంటలకు ఈ వేడుకలు మొదలవుతాయని పేర్కొన్నారు. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. యోగా డే సందర్భంగా నెల రోజుల నుంచి తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం ఆవరణలో యోగా గురువు అంకాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచితంగా యోగా శిక్షణ తరగతులను నిర్వహించామని పేర్కొన్నారు. ఆ ఉచిత శిక్షణలో సాధన చేసిన వారు బుధవారం యోగా డే వేడుకల్లో ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, యోగాసనాలను ప్రదర్శిస్తారని వివరించారు.

క్లుప్తంగా

25న ఆట్యా పాట్యా బాలబాలికల జట్లు ఎంపిక

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 25న ఆట్యా పాట్యా ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్-14 బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు ఆ సంఘ జిల్లా సమన్వయకర్త డి.నాగరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2009 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టిన బాలబాలికలు ఈ ఎంపికలకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు వయస్సు ధ్రువీకరణ, ఆధార్ పత్రాలతో ఆదివారం ఉదయం 9 గంటలకు క్రీడా ప్రాంగణానికి హాజరుకావాలని కోరారు. ఇతర సమాచారం కోసం 94907 98909 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ముగిసిన ఏపీ క్రీడా పాఠశాలల ప్రవేశానికి ఎంపికలు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ క్రీడా పాఠశాలలో ప్రవేశాల నిమిత్తం ఎంపికలు నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.రవీంద్రభవాని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాల నిమిత్తం విద్యార్థులకు పరుగు, స్టాండింగ్ బ్రాడ్ జంప్ పోటీలను నిర్వహించారు. హాజరైన విద్యార్థుల్లో ముగ్గురు బాలురు ఈ నెల 23, 24 తేదీల్లో గుడివాడలో జరగనున్న జిల్లా స్థాయి ఎంపికలకు అర్హత సాధించినట్లు సెలక్షన్ కమిటీ కన్వీనర్ డి.నాగరాజు తెలిపారు. గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పాడ చంద్రశేఖర్‌రావు, పీఈటీలు మీరా సాహెబ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

లూడో గేమ్‌లో వివాదం : రాళ్లతో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లూడో గేమ్‌లో జరిగిన వివాదంతో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు రాళ్ల దాడికి పాల్పడిన ఘటన నగరంలోని కొత్తపేటలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నంబరు 174 వద్ద కాలనీకి చెందిన కొంతమంది లూడో గేమ్ ఆడుతున్నారు. ఆ గేమ్ వ్యవహారంలో ఇరు వర్గాల మధ్య వివాదం జరిగి, ఒకరిపై మరొకరు రాళ్లతో దాడికి పాల్పడ్డారు. విషయం తెలిసి కొత్తపేట పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాలనీకి చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు, తమ్మిశెట్టి తిరుపతిరావుతో పాటు రెండో వర్గానికి చెందిన సందిపూడి అవినాష్‌బాబు, సందిపూడి అభిలాష్‌బాబును అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కుష్ఠువ్యాధిని సమూలంగా నిర్మూలించాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు
- ఈనెల 26 నుంచి ఇంటింటి సర్వే


జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో కుష్ఠు వ్యాధిని సమూలంగా నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు వైద్యాధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వ్యాధిగ్రస్తుల గుర్తింపు (లెప్రసీ కేస్ డిటెక్షన్ కాంపెయిన్-(ఎల్సీడీసీ)పై కలెక్టర్ ఢిల్లీరావు జిల్లా సమన్వయ కమిటీ సభ్యులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుంచి జూలై 16 వరకు జిల్లా వ్యాప్తంగా ఆశ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లతో ఇంటింటి సర్వే నిర్వహించి కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. వ్యాధిగ్రస్తులకు సరైన ఔషధ చికిత్స అందించి తొలి దశ లోనే వ్యాధిని అరికట్టాలన్నారు. చర్మం పై స్పర్శ లేని మచ్చలు, అరిచేతులు, అరి కాళ్లలో స్పర్శ కోల్పోవడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం వంటివి కుష్ఠు వ్యాధి లక్షణాలని, ఆయా లక్షణాలు కలిగిన వారిని పీహెచ్‌సీల వద్దకు తీసుకువెళ్లి పరీక్ష చేయించాలన్నారు. సర్వే నిర్వహించే సమయంలో ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాలు, కమ్యూనిటీ వారీగా పరిశీలించి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎం.సుహాసిని, జిల్లా లెప్రసీ విభాగ కార్యక్రమ అధికారి ఉషారాణి, టీబీ కంట్రోలింగ్ ఆఫీసర్ పద్మావతి, డీఈవో సీవీ రేణుక, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిని వందశాతం నివారిద్దాం

లబ్బీపేట(విజయవాడతూర్పు): కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి, సక్రమంగా మందులు అందించడం ద్వారా వ్యాధి నివారణకు కృషి చేయాలని ప్రభుత్వాస్పత్రి చర్మవ్యాధుల విభాగాధిపతి డాక్టర్ వాణి అన్నారు. ఈ నెల 26 నుంచి జూలై 16 వరకూ జిల్లాలో నిర్వహించనున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్సీడీసీ) సర్వేపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, నోడల్ పర్సన్‌లు, కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు పాల్గొన్నారు. సదస్సులో డాక్టర్ వాణి మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చర్మం రంగులో తేడా ఉండటం, స్పర్శలో తేడా ఉండటం, పాక్షికంగా లోపించడం, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం వంటివి లెప్రసీ లక్షణాలుగా తెలిపారు. కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, ముక్కులో నుంచి రక్తం కారడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, తెలియకుండానే చేతులు కాళ్లలో బొబ్బలు రావడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు వంటి లక్షణాలు ఉన్న వారిని సర్వేలో గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి, డీపీఎం డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభం పైనుంచి జారి పడి వ్యక్తి మృతి


అంజయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

రామవరప్పాడు: వాణిజ్య ప్రకటనలు ప్రదర్శించే స్తంభంపైన తేనెటీగలు పెట్టిన తొట్టును తొలగించేందుకు పైకి ఎక్కిన వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందిన ఘటన విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేసరపల్లికి చెందిన జూటూరు అంజయ్య (40) కూలి పనులకు వెళుతుంటాడు. రెండు నెలల క్రితం అంజయ్య భార్య అనారోగ్యంతో మృతి చెందింది. మృతునికి ముగ్గురు సంతానం. లీడ్ స్పేస్ అనే వాణిజ్య కంపెనీకి చెందిన ప్రకటనలు ప్రదర్శించే స్తంభంపైన తేనెటీగలు తేనెపట్టును పెట్టాయి. దీంతో ఈ సంస్థ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్ అంజయ్యను తేనెపట్టును తొలగించేందుకు తీసుకెళ్లాడు. స్తంభంపైకి ఎక్కి తేనెపట్టు తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పటమట ఎస్ఐ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో తల్లి, తండ్రిని కోల్పోయి ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలారని మృతుని బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కడుపు నొప్పి తాళలేక యువకుడు ఆత్మహత్య

కంచికచర్ల: కడుపు నొప్పితో బాధపడుతున్న ఓ యువకుడు పొలాల్లోకి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ పెంకె సత్య వెంకట సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని గండేపల్లి గ్రామానికి చెందిన తలమాల అమృతరావు(27) అవివాహితుడు. నిత్యం కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు పలుమార్లు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. అయినా కడుపునొప్పి తగ్గకపోవటంతో తెల్లవారుజామున ఇంటి సమీపంలోని పొలాలకు వెళ్లి తన తల్లి చీరెను వెంట తీసుకుని చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు వెళ్లి చూసి చెట్టుకు వేలాడుతున్న యువకుడిని కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మనస్తాపంతో యువకుడు బలవన్మరణం


మృతుడు సతీష్

జగ్గయ్యపేట అర్బన్: మద్యానికి బానిసైన యువకుడు తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలో మంగళవారం స్థానిక చేపల మార్కెట్ సమీపంలో జరిగింది. పట్టణ ఎస్ఐ బీవీ రామారావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక చేపల మార్కెట్ సమీపంలోని అనాథ వృద్ధుల విశ్రాంత కేంద్రం ఎదురుగా ఉన్న గృహంలో నివశిస్తున్న గండికోటి సతీష్(20) హోటల్‌లో పనిచేస్తూ ఉంటాడు. సతీష్ తండ్రి శంకర్‌రావు అనారోగ్యంతో బాధపడుతూ 20 రోజుల క్రితం మృతిచెందాడు. సతీష్ భార్య కూడా పుట్టింటికి వెళ్లింది. తల్లి కూలి పనులకు బయటకు వెళ్లింది. తండ్రి మృతితో మనస్తాపానికి గురైన సతీష్ అతిగా మద్యం తాగి ఆ మైకంలో మతి స్థిమితం కోల్పోయి తాను నివాసం ఉంటున్న షెడ్డులో రాడ్‌కు చున్నీ కట్టుకుని ఉరివేసుకున్నాడు. ఉరి వేసుకుని వేలాడుతున్న సతీష్‌ను వారి బంధువు నాగమణి, చుట్టుపక్కల వారు చూసి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తల్లి సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఉండవల్లిలో వివాహిత ఆత్మహత్య



తాడేపల్లిరూరల్: ఉండవల్లిలో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం గురజ గ్రామానికి చెందిన పల్లంపాటి నాగరాజు, ఉండవల్లి సెంటర్‌కు చెందిన శ్యామలాదేవికి 2013వ సంవత్సరంలో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. పెళ్లయిన దగ్గర నుంచి తాగుడుకు బానిసై, మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను హింసిస్తుండడంతో శ్యామలా దేవి అత్తగారి ఇంటి దగ్గర నుంచి సొంత ఊరైన ఉండవల్లికి వచ్చేసింది. అప్పటి నుంచి భర్త నాగరాజు కూడా అప్పుడప్పుడు ఇక్కడకు వస్తూ వెళ్తూ ఉండేవాడు. ఈ మధ్యకాలంలో నాగరాజు తన స్వగ్రామం గురజ వెళ్దామని శ్యామలపై వత్తిడి తీసుకువచ్చాడు. తాను అక్కడకు రానని చెప్పి, చిర్రావూరులో ఓ టీడీపీ నాయకుడిని న్యాయం కోసం ఆశ్రయించింది. అయితే వారు కూడా రెండు రోజులుగా భర్త దగ్గరకే వెళ్లాలని శ్యామలపై వత్తిడి తీసుకువచ్చారు. దీంతో మనస్తాపం చెందిన శ్యామలాదేవి తన ఇద్దరు పిల్లలను ఉండవల్లిలోనే ఉండే వరుసకు చెల్లి అయ్యే వసంత లక్ష్మి ఇంట్లో ఉంచింది. సోమవారం రాత్రి తాను ఉంటున్న అద్దె ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని మృతి చెందింది. జరిగిన ఈ సంఘటనపై శ్యామల తమ్ముడైన సింగంశెట్టి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ముద్రగడను విమర్శించే అర్హత బుద్దా వెంకన్నకు లేదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభంను విమర్శించే స్థాయి, అర్హత మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నకు లేదని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు అన్నారు. స్థానిక ముత్యాలంపాడులో మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభంపై మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాపు ఉద్యమం అడ్డం పెట్టుకొని ఈసారి ఏమన్నా చేస్తే కిర్లంపూడి వచ్చి అడ్డుపడతామని హెచ్చరించడం సరికాదన్నారు. బుద్దా వెంకన్న 10 సంవత్సరాల నుంచి టీడీపీలో ఉండి కూడా పశ్చిమ నియోజకవర్గంలో కాపుల ప్రస్తావన ఏనాడైనా తీసుకొచ్చారా, వారికి ఏమైనా న్యాయం చేశారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో కాపు కల్యాణ మండపం కోసం ఇచ్చిన రిప్రజెంటేషన్‌ను పట్టించుకోలేదన్నారు. అమ్మవారి గుడి మల్లికార్జున వీధిలో పేద కాపుల ఇల్లు రోడ్డు విస్తరణలో తీయించేసి, తన ఇల్లు మాత్రం పోకుండా చూసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించం

- డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ
- ఒక ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్, మరొకరికి వార్నింగ్
- రూ.8.06 లక్షలు రికవరీ చేయాలని ఆదేశం


మోపిదేవిలో జరిగిన ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ సూర్యనారాయణ

మోపిదేవి(అవనిగడ్డ): ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పెదకళ్లేపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ పి.కోటేశును సస్పెండ్‌చేశారు. మోపిదేవి ఫీల్డ్ అసిస్టెంట్ దోవారి వెంకట సుబ్బారావుకు వార్నింగ్ ఇస్తూ ఆదేశించారు. వివిధ పనుల్లో జరిగిన అవినీతికి సంబంధించి రూ.45,900 జరిమానా విధించారు. ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.6,89,900, పంచాయతీరాజ్ నుంచి మెటీరియల్ రూపంలో రూ.1,16,999 మొత్తం రూ.8,06,899 రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. 15 రోజుల్లో రికవరీ చేయని పక్షంలో వారి వేతనాల నుంచి వసూలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ఎ.కొండూరు: పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని చీమలపాడులో జరిగింది. గ్రామానికి చెందిన తుళ్లూరు రామారావు(55) మెయిన్‌రోడ్డు సమీపం వద్ద చెరువు ఆయకట్టు కింద ఉన్న ఖాళీ వరి పొలాల్లో తన గేదెలను మేపుతుండగా అకస్మాత్తుగా ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షంతో పాటు సమీపంలోనే పిడుగు పడింది. ఆ పిడుగు ప్రభావంతో రామారావు స్పృహ తప్పి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బాలికపై వృద్ధుడి అసభ్యప్రవర్తన

ఉయ్యూరు: మైనరు బాలికపై వృద్ధుడు వికృత చేష్టలకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఉయ్యూరు పట్టణంలో మంగళవారం జరిగిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే...పట్టణంలోని వెంకటేశ్వర థియేటరు సమీపంలో మైనరు బాలిక (8) కుటుంబం నివాసం ఉంటోంది. మంగళవారం సాయంత్రం తోటి స్నేహితులతో కలిసి ఆరుబయట ఆడుకుంటోంది. ఆ ప్రాంతంలో పరిసే రాఘవయ్య (68) కారు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. పిల్లలు ఆడుకుంటున్న ప్రాంతానికి వెళ్లి మైనరు బాలికను నమ్మకంగా పక్కనే ఉన్న రేకుల షెడ్డులోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. వృద్ధుడి ప్రవర్తనతో బెంబేలెత్తిన బాలిక కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి ఆ వృద్ధుడికి దేహశుద్ధి చేశారు. అనంతరం పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వీరప్రసాద్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని రాఘవయ్యను అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం

పెనమలూరు: యనమలకుదురులో బాలిక అదృశ్యం అవటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో నివసించే దంపతుల కుమార్తె (14) పది పాస్ అయ్యి ఇంట్లోనే ఉంటోంది. ఈ నెల 19వ తేదీన తల్లిదండ్రులు పనులకు వెళ్లారు. వారు రాత్రి ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో కుమార్తె కనిపించలేదు. ఆమె కోసం పలు ప్రాంతాల్లో వెతికారు. అయినా జాడ తెలియకపోవటంతో పోలీసులను ఆశ్రయించారు.

భార్యకు విషాహారం పెట్టి హత్య

- ఈనెల 6న గొట్టుముక్కల గ్రామంలో జరిగిన సంఘటన
- చికిత్స పొందుతూ 20న మృతి

కంచికచర్ల: ఇంట్లో ఉన్న నగదు మాయం అయ్యాయని, అందుకు ఆమే కారణమంటూ ఓ మహిళను భర్త, అత్త, మరిది కలసి తినే భోజనంలో విషం కలిపి తినిపించారు. ఆస్పత్రిలో రెండు వారాల పాటు చికిత్స పొందిన ఆమె మంగళవారం మృతి చెందింది. నందిగామ ఏసీపీ జనార్ధన నాయుడు కథనం మేరకు పెనుగంచిప్రోలు మండలానికి చెందిన జ్యోతి(28)కి కంచికచర్ల మండలం గొట్టుముక్కల గ్రామానికి చెందిన కన్నేటి హనుమంతరావుతో 12 ఏళ్ల క్రితం వివాహమయింది. వారికి పదేళ్ల, ఎనిమిదేళ్ల వయసున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈనెల 6వ తేదీన ఇంట్లో ఉన్న రూ.5వేలు నగదు కనిపించటం లేదని హనుమంతరావు భార్యను అడిగితే తనకు తెలియదని చెప్పింది. దీంతో ఆగ్రహించిన భర్త హనుమంతరావు, అత్త చిట్టెమ్మ, మరిది కోటేశ్వరరావు ఆమెను కొట్టి తీవ్రంగా గాయపర్చారు. ఆ తర్వాత రాత్రి భోజనం చేసే సమయంలో అత్త, భర్త, మరిది వేరొక కూర వేసుకుని భోజనం చేసి, జ్యోతికి మాత్రం బెండకాయ కూర వేశారు. అనంతరం ఆమెకు ఫ్రిజ్‌లో ఉన్న కూల్ డ్రింక్ ఇవ్వబోగా ఆమె పెద్దకుమార్తె కూల్ డ్రింక్‌ను తీసుకుని తాగబోయింది. గమనించిన తండ్రి హనుమంతరావు కుమార్తె నుంచి డ్రింక్‌ను లాక్కుని భార్య జ్యోతికి ఇచ్చాడు. అది తాగిన కొంతసేపటి తర్వాత కడుపులో మంటగా ఉండటంతో జ్యోతి సమీపంలో ఉన్న ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లింది. మరుసటి రోజు తన స్వగ్రామం వెళ్లి తన తల్లితో చెప్పి అక్కడ వైద్యం చేయించుకుంటోంది. కడుపులో నొప్పి ఎక్కువగా ఉండటంతో జ్యోతి ఈనెల 10వ తేదీన విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. విషయం తెలుసుకున్న నందిగామ ఏసీపీ జనార్ధన నాయుడు, కంచికచర్ల పోలీసులు విజయవాడ ఆసుపత్రికి వెళ్లి ఆమెను విచారించారు. తన భర్త, అత్త, మరిది భోజనంలో విషం కలిపి తనకు పెట్టారని, అంతేకాకుండా తనను కొట్టి హింసించారని, వారిపై చర్యలు తీసుకోవాలని మరణ వాఙ్మూలం ఇచ్చింది. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. జ్యోతి మరణ వాఙ్మూలం మేరకు భర్త హనుమంతరావు, అత్త చిట్టెమ్మ, మరిది కోటేశ్వరరావులపై హత్యానేరం కింద కేసు నమోదు చేస్తామని ఏసీపీ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచాలి
- జగనన్న సురక్ష పథకాన్ని సమర్థంగా అమలు చేయాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధి చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. తన చాంబర్ నుంచి మంగళవారం సాయంత్రం మండల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, గృహనిర్మాణం, ఖరీఫ్ ప్రణాళిక అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో ప్రభుత్వంపై సంతృప్తిస్థాయి పెంపొందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ఈ నెల 23వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారని ఈ కార్యక్రమంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. అర్హత కలిగిన వారు ఎవరైనా పథకాలు పొందకపోతే వాటి కారణాలు, సమస్యలు గుర్తించి సచివాలయ పరిధిలో క్యాంపులు నిర్వహించి లబ్ధిదారులకు అవసరమైన ధ్రువపత్రాలను అందించటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేసుకోండి

జిల్లాలో ఆర్బీకేల వారీగా ఖరీఫ్ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి నెలా మొదటి శుక్రవారం ఆర్బీకే స్థాయిలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించాలన్నారు. జిల్లాలో జగనన్న లేఅవుట్ల ద్వారా లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేందుకు నిర్ణయించిన లక్ష్యాలు సాధించే దిశగా అధికారులు అడుగులు వేయాలని కలెక్టర్ సూచించారు. స్పందన అర్జీలు గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు వారి పరిధిలోని పాఠశాలలు పరిశీలించి విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించాలన్నారు. నాడు - నేడు ద్వారా పాఠశాలల్లో రెండు దశల్లో ఇంకా మిగిలి ఉన్న సౌకర్యాలపై ప్రతిపాదనలు వెంటనే పంపాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, కేఆర్ఆర్సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణరెడ్డి, డీపీవో నాగేశ్వరనాయక్, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, డీఎల్డీవో సుబ్బారావు పాల్గొన్నారు.

లాసెట్‌లో చల్లపల్లి యువకునికి స్టేట్ 8వ ర్యాంకు



చల్లపల్లి: ఏపీ లాసెట్-2023 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో చల్లపల్లికి చెందిన యువకుడు రాష్ట్ర స్థాయిలో ఎనిమిదో ర్యాంకు సాధించాడు. చల్లపల్లి నారాయణరావు నగర్‌కు చెందిన దాసరి మెహర్ హేమంత్ 91 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించాడు. తండ్రి దాసరి వెంకట శివరామ ప్రసాద్ కొంత కాలం కిందట మృతి చెందగా.. తల్లి మెహర్ వాణి, సోదరునితో కలిసి జీవిస్తున్నాడు. న్యాయవాది కావాలనే కోరికతో ఈ పరీక్ష రాసినట్లు హేమంత్ తెలిపాడు.

అవనిగడ్డలో త్వరలో డయాలసిస్ సెంటర్


ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే సింహాద్రి, వైద్యాధికారులు

అవనిగడ్డ: అవనిగడ్డలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో త్వరలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుతో కలిసి మంగళవారం ఆయన గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డ్, ప్రభుత్వ ఏరియా వైద్యశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే రమేష్‌బాబు అనేకసార్లు డంపింగ్ యార్డ్, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని అడిగారని, త్వరలోనే ఈ రెండు సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. అవనిగడ్డలో అపోలో ద్వారా త్వరలోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. వేరే చోట పెట్టేందుకు ఆలోచన చేశామని, కానీ ఈ ఏరియా ఆసుపత్రిలో సరిపడా స్థలం ఉన్నందున ఇక్కడే డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వీటికి సంబంధించి మార్పులు, చేర్పుల ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. డంపింగ్ యార్డుకు సంబంధించి స్థల పరిశీలన జరుగుతోందని, సరైన స్థలం దొరికితే వెంటనే మార్చుతామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైద్యాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు డిగ్రీ కోర్సులపై అవగాహన సదస్సు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): జాతీయ విద్యా విధానంలో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న నాలుగు సంవత్సరాల సింగిల్ మేజర్ ఆనర్స్ డిగ్రీ కోర్సులపై ఈ నెల 22వ తేదీ ఉదయం పది గంటలకు తమ కళాశాల ఆవరణలో అవగాహన సదస్సు జరుగుతుందని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్, కృష్ణా విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ రామ్మోహన్ రావు ముఖ్యఅతిథులుగా ఈ సదస్సుకు హాజరై డిగ్రీ కోర్సుల గురించి అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరబోయే విద్యార్థులతో పాటుగా తల్లిదండ్రులు కూడా సదస్సులో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు హైజీన్ కిట్ల పంపిణీ



ఆటోనగర్(విజయవాడతూర్పు): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఐలా (ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ)లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు ఏపీఐఐసీ జోనల్ మేనేజరు సీతారాం బుధవారం హైజీన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. సీపీఆర్‌పై కార్మికులకు విపత్తులపై ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అవగాహన కల్పించడంతో కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీజెడ్‌ఎం మధు, ఐలా మాజీ చైర్మన్, కార్యదర్శులు సుంకర దుర్గాప్రసాద్, అన్నె శివ నాగేశ్వరరావు, డాక్టర్ అబ్దుల్ కలాం, కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



కృష్ణలంక(విజయవాడతూర్పు): రాణిగారి తోట, 17వ డివిజన్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు స్థానిక కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి మంగళవారం వైఎస్సార్ బీమా పరిహారం నగదు అందజేశారు. కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న షేక్ నాగూర్‌బాషా సోమవారం మృతిచెందాడు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ బీమా ద్వారా మట్టి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.10 వేలను మృతుడి భార్య షేక్ రహమతున్నీసాకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

విజయవాడ స్పోర్ట్స్: తొమ్మిదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ సత్యనారాయణపురంలోని హిమాలయ ట్రెడిషన్ పవర్ యోగా కార్యాలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, హిమాలయ ట్రెడిషనల్ పవర్‌యోగా సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94411 19909, 94402 76648 సెల్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

దాసాంజనేయ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి వారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామికి ప్రీతికరమైన రోజు కావటంతో పాటు వాతావరణం చల్లబడటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

ఎస్ఆర్ఆర్‌లో హెల్ప్‌డెస్క్ సేవలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్లలో భాగంగా హెల్ప్‌డెస్క్ సేవలు ప్రారంభమయ్యాయి. హెల్ప్ డెస్క్ ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఏ విధంగా దరఖాస్తులు చేసుకోవాలి, కళాశాలలో ఉన్న కోర్సులు ఏమిటి అన్న వివరాలపై అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం సుమారు 50 మంది విద్యార్థులు హెల్ప్‌డెస్క్ ద్వారా కోర్సుల వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాలలోని హెల్ప్‌డెస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు.

ఆత్మీయ స్వాగతం






రాష్ట్ర స్థాయిలో అత్యున్నత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డులతో సత్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విజయవాడ వచ్చారు. ఏ-కన్వెన్షన్ ఫంక్షన్ హాలు వద్ద ముఖ్యమంత్రికి పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తదితరులు ఆత్మీయ స్వాగతం పలికారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజల అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించి, త్వరలో అమలుచేయనున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ (వీఎంసీ) కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై వార్డు స్థాయి స్పెషల్ ఆఫీసర్లు, వార్డు సెక్రటరీలు, ఆరు పర్యవేక్షణ బృందాలకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అయితే కొందరు లబ్ధిదారులకు అవసరమైన ధ్రువపత్రాలు లేకపోవడంతో ఆ పథకాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు అన్ని రకాల ధ్రువపత్రాలను మంజూరు చేసి ప్రభుత్వ సేవలను అందించేందుకు జూలై ఒకటి నుంచి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. వారంలో మూడు రోజుల చొప్పున ఐదు వారాల పాటు నిర్దేశించిన రోజుల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని సూచించారు. శిబిరం నిర్వహణకు వారం రోజుల ముందు నుంచి వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల అవసరాలను తెలుసుకోవాలని ఆదేశించారు. కులం, ఆదాయం, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, మ్యూటేషన్ లావాదేవీలు, ఆధార్‌కు ఫోన్ నంబరు అనుసంధానం, పంట సాగు హక్కు కార్డులు పొందేందుకు అవసరమైన ధ్రువపత్రాలను మంజూరు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వలంటీర్లు తమ క్లస్టర్లలో ప్రతి ఒక్కరికీ 'జగనన్న సురక్ష' శిబిరం జరిగే తేదీ, సమయం, ప్రదేశం వివరాలు తెలపాలని సూచించారు. ఈ శిబిరాన్ని పర్యవేక్షించేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నగరపాలక సంస్థ అధికారులు, జోనల్ కమిషనర్లు, వారి సిబ్బంది, తహసీల్దారు, డెప్యూటీ తహసీల్దార్, వారి సిబ్బంది నేతృత్వం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టంచేశారు. సదస్సులో అదనపు కమిషనర్ కె.వి.సత్యావతి, అదనపు కమిషనర్ ఎం.శ్యామల, జోనల్ కమిషనర్లు, నగరపాలక సంస్థ అధికారులు పలువురు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే మైనార్టీలకు మేలు



మసీదు పెద్దలతో మాట్లాడుతున్న జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే మైనార్టీలకు ఎంతో మేలు జరిగిందని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్ కే సాత్ అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం కబేళా రోడ్డులోని మక్దుం మసీదులో అసర్ నమాజు అనంతరం ముస్లిం పెద్దలు, మసీదు బాధ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ.. గడిచిన నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా మైనార్టీలకు కోట్లాది రూపాయల లబ్ధి చేకూర్చిందని వివరించారు. ఇది గత ప్రభుత్వం కంటే పది రెట్లు అధికమని పేర్కొన్నారు. హజ్ యాత్రను సులభతరం చేసి దేశంలోని ప్రధాన నగరాల ధరలకే విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి హాజీలు పవిత్ర హజ్ యాత్రకు జిద్దా వెళ్లే ఏర్పాట్లు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. మైనార్టీలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస రావుకు అండగా ఉండాలని కోరారు. అనంతరం మసీదు వద్ద నెలకున్న సమస్యలను పెద్దలను అడిగి తెలుసుకుని వాటిని నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎండీ హబీబుల్లా, మైనార్టీ నాయకులు షేక్ బాజీ షహీద్, మసీదు అధ్యక్షుడు షేక్ జానీ, సెక్రటరీ ఎండీ కాలేషా, కోశాధికారి అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



లబ్బీపేట(విజయవాడతూర్పు): నిత్యం యోగా సాధన చేయడం ద్వారా శారీరక, మానసికంగా ఆరోగ్యంగా జీవించొచ్చని జిల్లా ఎన్‌సీడీ–సీడీ కార్యక్రమ అధికారి డాక్టర్ జి.మాధవి సూచించారు. అంతర్జాతీయ యోగా డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో నిర్వహించిన ఈ ర్యాలీలో డాక్టర్ మాధవి మాట్లాడుతూ.. జీవనశైలి వ్యాధులు దూరంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ధ్యానం, యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సూచించారు. డీపీఎంఓ కిషోర్, ఆర్‌బీఎస్‌కే ఫిజియోథెరపిస్ట్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ పోతురాజు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ప్లానింగ్ ప్రకారం సేవలు అందించాలి

లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ శ్రీశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ దామర్ల శ్రీశాంతి

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లో నూతనంగా ఏర్పాటైన లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆటోనగర్ జెమ్స్ క్లబ్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం మంగళవారం ఉత్సాహంగా జరిగింది. తొలుత 21 మంది సభ్యులతో ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ ఎ.ఆర్.కె.చౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ దామర్ల శ్రీశాంతి మాట్లాడుతూ.. జవహర్ ఆటోనగర్‌లో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు త్వరలో పలు సెంటరల్లో కాఫీ సెంటర్లను ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్మికవాడ ప్రజలకు శాశ్వత కాలం ప్రయోజనం కలిగేలా, ప్లానింగ్ ప్రకారం సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. కార్మిక వాడలో మూడు క్లబ్‌లు ఏర్పడటం అభినందనీయమన్నారు. అనంతరం ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ ఎ.ఆర్.కె.చౌదరి ఆటోనగర్ జెమ్స్ లయన్స్ క్లబ్‌కు రూ.10 వేల చెక్కు అందజేశారు. సెకండ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.వి.పి.ఎస్.ఆంజనేయులు, ఆర్‌సీ, జెడ్‌సీ కాంతారావు, బెవర నాగేశ్వరరావు, ఎంసీఎఫ్ కో ఆర్డినేటర్లు కత్తిక శివనాగేశ్వరరావు, అన్నె శివనాగేశ్వరరావు, ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, ఆటోనగర్ జెమ్స్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్, కార్యదర్శి కె.వి.ఎస్.ఎన్.కె.ప్రసాద్, కోశాధికారి బి.కిరణ్‌కుమార్, పలువురు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఫ్రెజర్‌పేటకు చెందిన వినుకొండ ఎలిజిబెత్ రాణి, మోజేస్ భార్యాభర్తలు. వారికి 2007లో వివాహమైంది. మోజేస్ కారు డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. కొంత కాలంగా భార్యను మోజేస్ వేధింపులకు గురి చేయడమే కాకుండా శారీరకంగా హింసించసాగాడు. భర్త వేధింపులను భరించలేక ఎలిజిబెత్ రాణి ఏడు నెలల కిందట పుట్టింటికి వచ్చేసింది. అయినా భర్త ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉల్లంఘనులకు జరిమానాలు



మొబైల్ కోర్టు నిర్వహిస్తున్న న్యాయమూర్తి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో నిబంధనలు ఉల్లంఘించిన పలువురికి న్యాయమూర్తి వి.వి జయ్‌కుమార్‌రెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చి, జరిమానాలు విధించారు. నగర వీధుల్లోని జనావాసాల్లోకి వస్తున్న పందులను నియంత్రించే చర్యల్లో భాగంగా పెంపకందారులపై చార్జిషీట్లను మొబైల్ కోర్టులో దాఖలు చేయాల్సిందిగా నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టులో భాగంగా కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి విజయ్‌కుమార్ రెడ్డి సర్కిల్–2 కార్యాలయంలో మొబైల్ కోర్టు నిర్వహించారు. శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై 12 కేసులు నమోదు చేసి వారిని న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న, విచ్చలవిడిగా పశువులను రోడ్ల పైకి వదిలివేస్తున్న, రోడ్ల పై చెత్త వేసేసిన నేరాల కింద వారికి న్యాయమూర్తి రూ.8,840 జరిమానా విధించారు. మరోసారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోజువారీ విధుల్లో హిందీ తప్పనిసరి

డీఆర్ఎం శివేంద్రమోహన్



రాజ భాష అమలు కమిటీ సమావేశంలో పాల్గొన్న డీఆర్ఎం శివేంద్రమోహన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు రోజువారీ విధుల్లో అధికార భాష హిందీని తప్పనిసరిగా ఉపయోగించాలని విజయవాడ రైల్వే డీఆర్ఎం శివేంద్రమోహన్ పేర్కొన్నారు. డీఆర్ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 183వ డివిజనల్ అధికార భాష అమలు కమిటీ సమావేశం డీఆర్ఎం అధ్యతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా శివేంద్రమోహన్ మాట్లాడుతూ.. జాతీయ సమైక్యత కోసం అధికార భాష ప్రాముఖ్యతను వివరించారు. రోజువారీ వీధుల్లో రాజభాష హిందీని ఉపయోగించడం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత అన్నారు. అధికార భాష చట్టం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో కృషి చేయాల్సిందిగా సూచించారు. అనంతరం రాజ భాష అధికారి ఆశా మహేష్ కుమార్ డివిజన్‌లో అధికార భాష అమలులో సాధించిన పురోగతిని పవర్ పాయింట్ ప్రాజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ త్రైమాసికంలో డివిజన్ వ్యాప్తంగా ఉద్యోగులకు నిర్వహించిన హిందీ సెమినార్‌లు, వర్క్‌షాపులు, టెబుల్ శిక్షణ తదితర వివరాలు వెల్లడించారు. ముందుగా ఈ ఏడాది మార్చిలో కపుర్తలలో జరిగిన అఖిల భారత రైల్వే హిందీ నాటక పోటీలలో డివిజన్ రెండో స్థానం సాధించడంపై అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు ఎం.శ్రీకాంత్, డి.శ్రీనివాసరావు, ఏసీఎంఎస్ డాక్టర్ రవికాంత్, సీనియర్ డీఈఎన్ ఇ.శాంతారామ్, డీసీఎం ఎండీ ఆలీఖాన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ



భక్తులు అమ్మవారికి సమర్పించిన సారె



సారె సమర్పించిన భక్త బృందం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): స్థానిక ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని పలు భక్త బృందాలు మంగళవారం అమ్మవారికి సారె సమర్పించాయి. సారెను సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం భక్తులు మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ముత్తయిదువులకు పసుపు, కుంకుమతో పాటు ప్రసాదాలను పంపిణీ చేశారు.

అత్తింటి వారిపై కట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తూ భార్యపై దాడి చేసిన భర్తతో పాటు అత్తింటివారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు కోడూరు కాలనీకి చెందిన నడకుదుటి అనూషను నాలుగు సంవత్సరాల క్రితం దుర్గాప్రసాద్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. అయితే ఇద్దరు ఆడపిల్లలను కన్నావని, పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు సరిపోలేదని అదనపు కట్నం కావాలని గత కొద్ది కాలంగా అనూషాని వేధించసాగాడు. భర్తతో పాటు అత్త లక్ష్మి, ఆడపడుచులు నాగమణి, దుర్గారాణిలు కూడా వేధిస్తున్నారు. కాగా భర్త మంగళవారం భార్య అనూషాని పై భర్త దుర్గాప్రసాద్ ఇంటి నుంచి వెళ్లి పోవాలని దాడి చేశాడు. ఈ ఘటన పై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

బీభత్సం సృష్టించిన వర్షం



ఇళ్లపై విరిగిపడిన చెట్టు

గుణదల (విజయవాడ తూర్పు): అప్పటి వరకూ ఎండ తీవ్రతతో సతమతమవుతున్న ప్రజలు చల్లని గాలులకు, వర్షపు చినుకులకు సేదతీరారు. కొన్ని రోజులుగా విపరీతమైన ఎండలతో అట్టుడుకుతున్న వాతావరణం మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా చల్లబడింది. భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గుణదల, మాచవరం, ఏలూరు రోడ్డు ప్రాంతంలో పలు చోట్ల రోడ్లు జలమయమయ్యాయి. గుణదల మైత్రి నగర్ కొండపై రెండు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. అక్కడ సమీపంలో ఉన్న చెట్టు స్థానికంగా ఉన్న ఇళ్లపై విరిగి పడింది. ఫలితంగా రెండు ఇళ్లు దెబ్బతిన్నాయి. భారీ వర్షానికి కొండ ప్రాంతవాసులు ఆందోళనకు గురయ్యారు. చెట్టు విరిగిపోయిన ఘటనలో విద్యుత్ వైర్లు తెగిపడి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే అధికారులు సమన్వయంతో పనిచేసి కూలిన చెట్టును తొలగించారు. విద్యుత్ వైర్లు సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు. వర్షం కారణంగా చెట్టు విరిగి పడిన ఘటనలో ఇళ్లు దెబ్బతిన్న పేదలకు దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వైఎస్సార్ సీపీ నేతలు ఆర్థిక సాయం అందచేశారు. బాధితులను వైఎస్సార్ సీపీ నాయకులు భీమిశెట్టి నాని, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు తదితరులు పరామర్శించారు.

ఆ నాలుగున్నర గంటలే కీలకం



మాట్లాడుతున్న న్యూరాలజిస్ట్ డాక్టర్ ఇందిర

లబ్బీపేట(విజయవాడతూర్పు): బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన నాలుగున్నర గంటల్లోనే బాధితులు న్యూరాలజిస్టును సంప్రదించడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందొచ్చని న్యూరాలసిస్ట్ డాక్టర్ డి.ఇందిర సూచించారు. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలను గుర్తించి సకాలంలో చికిత్స పొందడం కీలకమని పేర్కొన్నారు. గవర్నర్‌పేటలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో సీనియర్ సిటిజన్స్‌కు మంగళవారం సెంటినీ హాస్పిటల్ ఆధ్వర్యంలో బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టర్ ఇందిరా మాట్లాడుతూ.. బ్రెయిన్ స్ట్రోక్‌పై సరైన అవగాహన లేక పోవడంతో బాధితులు సకాలంలో ఆస్పత్రికి చేరుకోలేక పోతున్నారని, దీంతో వైకల్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అత్యాధునిక మందులు అందుబాటులోకి వచ్చాయని, గోల్డెన్ అవర్ (నాలుగున్నర గంటలు)లో ఆస్పత్రికి చేరితే, స్ట్రోక్ రకాన్ని గుర్తిస్తామని వివరించారు. రక్తనాళాల్లో గడ్డలు కారణంగా స్ట్రోక్(ఇస్కిమిక్)కు గురైన వారికి ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు, చికిత్సలపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మన దేశంలో ప్రతి 20 సెకన్‌లకు ఒకరు స్ట్రోక్‌కు గురవుతున్నారని పేర్కొన్నారు. స్ట్రోక్‌కు గురైన వారిలో సకాలంలో చికిత్స పొందక పోవడంతో 50 శాతం మంది వైకల్యాలతో మిగిలి పోతున్నట్లు తెలిపారు. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాల్లో బ్యాలెన్స్ తప్పడం, దృష్టిలోపం, ఒకవైపు చేయి, కాలు పట్టుకోల్పోవడం, మాట ముద్దగా రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. ఈ సదస్సులో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోతుకూరి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన



నున్నలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నున్న గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించిన మూడో గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.23.50లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే వంశీమోహన్ సర్పంచి కాటూరి సరళ, ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఉపసర్పంచి బ్రహ్మానందరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, లిడ్‌క్యాప్ డైరెక్టర్ కోనేరు సత్యప్రియ, గన్నవరం మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనీకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్‌వీఆర్ తదితరులు పాల్గొన్నారు.

● చల్లబడిన వాతావరణం



వర్షపునీటిలో ఇంటికి వెళ్లేందుకు విద్యార్థుల ఇక్కట్లు



నీటమునిగిన నిర్మల హైస్కూలు రోడ్డు

మండుతున్న ఎండల నుంచి మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షం ప్రజలకు ఊరట కలిగించింది. మధ్యాహ్నం వరకు ఎండలతో జనం అల్లాడారు. 2.30 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. సుమారు అరగంటకు పైగా భారీ వర్షం కురిసింది. పటమట జేడీ నగర్‌లో చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. పలు రోడ్లు నీట మునిగాయి.

– ఆటోనగర్(విజయవాడతూర్పు)

పోలీసుల తనిఖీలు

పెనమలూరు: వాణిజ్య పన్నుల శాఖ అధికారుల అవినీతి కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరి ఇళ్లలో పోలీసులు మంగళవారం తనిఖీలు చేశారు. వాణిజ్యపన్నుల శాఖలో పని చేస్తున్న సబార్డినేట్ ఎం.సత్యనారాయణ, అధికారి కె.సంధ్య ఇళ్లలో పోలీసులు సోదాలు చేశారు. కానూరులో టీచర్స్‌కాలనీలో ఇంట్లో, కానూరు మైత్రినగర్‌లో అపార్ట్‌మెంట్‌లో కూడా తనిఖీలు చేశారు.

క్లుప్తంగా...

నేడు, రేపు పలు రైళ్లు రద్దు



రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): సౌత్‌ఈస్టన్ రైల్వేజోన్‌లోని ఖరగ్‌పూర్–బాద్రక్ సెక్షన్‌లో జరుగుతున్న ట్రాక్ పునరుద్ధరణ పనుల కారణంగా 21వ తేదీ, (22వ తేదీ) పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 21న షాలీమార్–హైదరాబాద్ (22887), హైదరాబాద్–షాలీమార్ (18046), బెంగళూరు–హౌరా (22864), చెన్నై సెంట్రల్–షాలీమార్ (12773), హౌరా–శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం (22831), షాలీమార్–సికింద్రాబాద్ (22849), తాంబరం–సంత్రగచ్చి (22842), పుదుచ్చేరి–హౌరా (12868) రైళ్లు రద్దు చేశారు. అదే విధంగా ఈ నెల 22న చెన్నై సెంట్రల్–సత్రగచ్చి (22808), పాట్నా–యర్నాకులం (22644), బెంగళూరు–హౌరా (22888) రైళ్లను రద్దు చేశారు.

జీసీసీ డైరెక్టర్‌గా వెంకటేశ్వరరావు నియామకం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్(జీసీసీ–విశాఖపట్నం) డైరెక్టర్‌గా పాలపర్తి వెంకటేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశ్వరరావు జీసీసీ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ల కాలం కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తెలంగాణ

టీఎస్‌ఆర్‌టీసీ నుంచి ఏపీఎస్ ఆర్‌టీసీకి బదిలీ కోసం వినతి

ముషీరాబాద్: ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి సుమారు పది సంవత్సరాలు కావస్తున్నా ఆర్టీసీలో కిందిస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ స్వరాష్ట్రం ఏపీకీ వెళ్లేందుకు ఇంత వరకు అవకాశం కలగడం లేదని టీఎస్‌ఆర్‌టీసీకి చెందిన కండక్టర్ కె.త్రినాథరావు ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. స్పీకర్ తమ్మినేని సానుకూలంగా స్పందించి తప్పకుండా న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చారని త్రినాథరావు తెలిపారు.

సన్నగిల్లిన నమ్మకంతో చిన్నచూపు చూసిన వారే ఇప్పుడు ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్ల కోసం పరుగులు తీస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో నిరాదరణకు గురైన బడులన్నీ ఇప్పుడు సకల సౌకర్యాలను.. శాశ్వత నిర్మాణాలను సమకూర్చుకుంటున్నాయి. అంతేగాక ఆంగ్ల మాధ్యమ బోధన కూడా అందుబాటులోకి వచ్చింది. ఫీజులు భారమైనా.. బడులు దూరమైనా.. వేలకు వేలు కట్టి పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపిన తల్లిదండ్రులు ఇప్పుడు తమ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు తహతహలాడుతున్నారు. ఫలితంగా సర్కారీ స్కూళ్లలో అడ్మిషన్లను భారీగా డిమాండ్ పెరిగింది. ఏ పాఠశాలలో చూసినా 'నో వేకెన్సీ' బోర్డులు దర్శనమిస్తున్నాయి.



కేఎన్నార్ హైస్కూల్ వద్ద సీట్లు లేవని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

● సర్కారీ స్కూళ్లు..

అడ్మిషన్లు ఫుల్.. సీట్లు నిల్

- ప్రభుత్వ పాఠశాలల్లో వెల్లువెత్తుతున్న విద్యార్థుల చేరికలు
- ఏ పాఠశాలలో చూసినా 'నో వేకెన్సీ' బోర్డులు
- 'మన బడి నాడు–నేడు' కింద సౌకర్యాలు.. ఆంగ్లమాధ్యమ విద్యతో అడ్మిషన్లకు భారీగా పెరిగిన డిమాండ్

ఆటోనగర్ (విజయవాడ తూర్పు)/నెల్లూరు (టౌన్): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో అడ్మిషన్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు పరుగులు తీస్తున్నారు. ఈ నెల 12 నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునఃప్రారంభించారు. అయితే, ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు దొరకడం కష్టంగా మారింది. ఇప్పటికే నగరపాలక సంస్థ పరిధిలోని ఏ పాఠశాలకు వెళ్లినా అడ్మిషన్లు దొరకని పరిస్థితి నెలకొంది. 14 డివిజన్ పరిధిలోని గోవిందరాజుల ధర్మ ఈనాం ట్రస్ట్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలోనూ అడ్మిషన్లు దొరకడం లేదు. రెండు రోజుల నుంచి 6వ తరగతి పిల్లలను చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు భారీగా వస్తున్నారు. ఇక్కడ 1వ నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో 6 నుంచి 10 వతరగతి వరకు సుమారు 1,285 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడే 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రాథమికోన్నత పాఠశాలలో 6వ తరగతి అడ్మిషన్ ఇస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్ల నుంచి ఇక్కడ 6వ తరగతి చేరడానికి వచ్చే వారిని చేర్చుకోవడం లేదు. ఇప్పటికే ఇక్కడ 6వ తరగతిలో 100కు పైగా అడ్మిషన్లు వచ్చాయి. మరింత మంది విద్యార్థులను చేర్చుకుంటే తరగతి గదులు సరిపోవనే ఉద్దేశంతో పిల్లలను చేర్పించుకోవడానికి ఉపాధ్యాయులు వెనుకాడుతున్నారు.

నెల్లూరులో ఇదీ పరిస్థితి

నెల్లూరు భక్తవత్సల నగర్‌లోని కేఎన్నార్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల చేరేందుకు విద్యార్థులు క్యూ కడుతున్నారు. దీంతో అడ్మిషన్లు ఇవ్వలేమంటూ ఉపాధ్యాయులు చేతులెత్తేశారు. పాఠశాల గేటుకు 'నో వెకెన్సీ' బోర్డు తగిలించారు. సీఎం వైఎస్ జగన్ తొలి విడత నాడు–నేడులో భాగంగా రూ.64 లక్షలతో ఈ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించారు. రెండోవిడత నాడు–నేడులో రూ.2.22 కోట్లతో 20 అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. ఇవి పూర్తయితే మరో రెండు వేల మందికి పైగా విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చే అవకాశం ఉంటుందని హెచ్‌ఎం విజయప్రకాష్ చెప్పారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 1,786 మంది విద్యార్థులున్నారు. నెల్లూరు నగరంలోని అన్ని పాఠశాలల్లోనూ ఇంచుమించు ఇదే పరిస్థితి నెలకొంది.

అడ్మిషన్ దొరకడం లేదు



గోవిందరాజు ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్ దొరకడం లేదు. వారం తర్వాత చెబుతామంటున్నారు. మా పాప హాసిని సాయి ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదివింది.సీఎం వైఎస్ జగన్ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్ల ప్రభుత్వ పాఠశాలలో చదించాలని నిర్ణయం తీసుకున్నాం. సీటు దొరుకుతుందో లేదో అర్థం కావడం లేదు.

– మాధవరావు, విద్యార్థి తండ్రి, యనమలకుదురు, విజయవాడ

చాలామంది వస్తున్నారు..



ఈ పాఠశాలలో 1,285 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది అదనంగా మరో 100 అడ్మిషన్లు వచ్చాయి. పక్కనే ప్రాథమిక పాఠశాల ఉంది. అందులో 700 మంది ఉన్నారు. ఇక్కడ గత ఏడాది 5వ తరగతి చదివిన వారు సుమారు 80 మందికి పైగా ఉన్నారు. వీరందరికి అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ ఏడాది కొత్తగా చాలా మంది పిల్లలు ఇక్కడ చేరాలని వస్తున్నారు.

– ఎం.శ్రీనివాసరావు, హెచ్‌ఎం, విజయవాడ

ప్రైవేట్ స్కూల్ వదిలి ఇక్కడ చేరా



ఇక్కడ పాఠాలు అర్థమయ్యేలా చెబుతున్నారు. అందుకే.. ప్రైవేట్ స్కూల్ వదిలేసి ఇక్కడ చేరా. ఏదన్నా అర్థం కాని విషయం ఉంటే సాయంత్రం నిర్వహించే స్టడీ అవర్స్‌లో ఆ సబ్జక్టు ఉపాధ్యాయుడిని అడిగితే పూర్తిగా వివరిస్తున్నారు. ఈ ఏడాది పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తా.

– సీహెచ్ ఆదిత్యశ్రీ, పదో తరగతి, నవాబుపేట

వచ్చే విద్యా సంవత్సరం మరిన్ని అడ్మిషన్లు



ఉపాధ్యాయుల సమష్టి కృషి, విద్యార్థుల్లో పట్టుదల, కృషి ఉండటం వల్లే అత్యధిక మార్కులు సాధించగలుగుతున్నాం. ఇక్కడ చదువుకునే వారు ఎక్కువగా పేద విద్యార్థులు. వారికి నాణ్యమైన విద్య అందించడమే మా ముందున్న ప్రధాన లక్ష్యం. వచ్చే విద్యా సంవత్సరానికి 20 గదులు అందుబాటులోకి వస్తాయి. దీనివల్ల మరింత మంది విద్యార్థులను చేర్చుకునేందుకు వీలుంటుంది.

– విజయప్రకాష్, హెచ్‌ఎం, నెల్లూరు

పలు ప్రాంతాల్లో తొలకరి జల్లులు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్)/ఏలూరు(మెట్రో)/కర్నూలు(అగ్రికల్చర్): నైరుతి రుతుపవనాల రాకతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పలుచోట్ల తొలకరి జల్లులు కురిశాయి. ఓ మోస్తరు వర్షంతో భానుడి నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. కొద్దిరోజులుగా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న తొలకరి జల్లు రైతన్నల్లో కొత్త ఆశలు చిగురింపజేసింది. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ నగరంతో పాటు పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. ఏలూరు, భీమవరం జిల్లా కేంద్రాలతో పాటు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలకరి జల్లు కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండవేడి, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు చల్లటి గాలులు, వర్షంలో ఉపశమనం పొందారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కల్లూరు, వెల్దుర్తి, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది.



విజయవాడలో కురుస్తున్న వర్షం

సింహాద్రిలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం

పరవాడ : అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీలో రెండో యూనిట్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా మంగళవారం ఉదయం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. ఫలితంగా 500 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రెండో యూనిట్ బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం ఏర్పడడంతో విద్యుత్ ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. మరమ్మతులు చేపడుతున్నారు. గురువారం ఉదయానికల్లా రెండోయూనిట్ ద్వారా విద్యుదుత్పత్తిని పునరుద్ధరించే అవకాశాలు న్నాయని, ప్రస్తుతం సంస్థలో 1, 3, 4 యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని సంస్థ అధికారులు వెల్లడించారు.



లింగమనేని పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయండి

- సీఐడీకి హైకోర్టు ఆదేశం
- విచారణ 28కి వాయిదా

సాక్షి, అమరావతి: వ్యాపారవేత్త, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సన్నిహితుడు లింగమనేని రమేశ్ ఇంటిని జప్తుచేసేందుకు చట్టప్రకారం అనుమతి కోసం విజయవాడ కోర్టులో సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌లో తదుపరి చర్యలన్నీ నిలిపేసేందుకు హైకోర్టు సుముఖత వ్యక్తం చేయలేదు. సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌లో తన వాదనలు కూడా వినాలంటూ బాధిత వ్యక్తిగా లింగమనేని రమేశ్ పిటిషన్ దాఖలు చేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ఆయన తరఫున ఓ న్యాయవాది అఫిడవిట్ దాఖలు చేయడంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. అఫిడవిట్ దాఖలు చేసింది ఓ థర్డ్ పార్టీ అని, అందువల్ల వాదనలు వినాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌కు అసలు విచారణార్హతే లేదన్న సీఐడీ న్యాయవాది వై.ఎన్.వివేకానంద వాదనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయకుండా విచారణను వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది. విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. తన ఇంటి జప్తునకు అనుమతి కోరుతూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌లో తమ వాదన కూడా వినాలంటూ లింగమనేని రమేశ్ తరఫున న్యాయవాది కోటేశ్వరరావు విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇటీవల విచారించిన కోర్టు.. లింగమనేని వాదన వినేందుకు తిరస్కరిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ లింగమనేని రమేశ్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై మంగళవారం జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారించారు. పిటిషనర్ న్యాయవాది ఎన్.అశ్వనీకుమార్ వాదనలు వినిపిస్తూ.. సీఐడీ పిటిషన్‌పై అభ్యంతరాలు లేవనెత్తే అవకాశం తమకు ఇవ్వాలన్నారు. జప్తు నిర్ణయం వల్ల తీవ్రంగా ప్రభావితమయ్యే తమ వాదనలు వినాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇదే విషయాన్ని వివరిస్తూ వేసిన అనుబంధ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు తోసిపుచ్చిందన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ.. వాదనలు వినిపించేందుకు అనుమతినిస్తే తప్పేముందని ప్రశ్నించారు. సీఐడీ న్యాయవాది వై.ఎన్.వివేకానంద జోక్యం చేసుకుంటూ.. వాదనలు వినిపించేందుకు అనుమతి కోరుతూ లింగమనేని పిటిషన్ దాఖలు చేయలేదని చెప్పారు. ఆయన తరఫున ఈ వ్యవహారంతో సంబంధం లేని ఓ న్యాయవాది అఫిడవిట్ దాఖలు చేశారని, అందువల్ల ఆ పిటిషన్‌కు విచారణార్హతే లేదని పేర్కొన్నారు. లింగమనేని ఇంటి జప్తునకు అనుమతి కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌లో ఏసీబీ కోర్టు తీర్పును రిజర్వ్ చేసిందని చెప్పారు. సీఐడీ పిటిషన్‌పై లింగమనేని కాకుండా ఆయన తరఫున ఓ న్యాయవాది అఫిడవిట్ వేయడంపై న్యాయమూర్తి అభ్యంతరం తెలిపారు.

జిల్లా వార్తలు

సంగీతం...సుస్వరాల సమ్మోహన రాగం

- నేడు ప్రపంచ సంగీత దినోత్సవం
- నగరంలో ఐదు రోజుల పాటు నిర్వహణ
- సుప్రసిద్ధ సంగీత విద్వాంసుల ఆరాధనా మహోత్సవాలు



అన్నమాచార్యుల సంగీతం ఆలాపిస్తున్న గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ (ఫైల్)

విజయవాడకల్చరల్: శిశుర్వేత్తి..పశుర్వేత్తి..వేత్తి గానరసం ఫణి అన్నారు. సంగీతంలో ఉన్న మాధుర్యానికి స్పందించని వారుండరు. పొత్తిళ్లలో పాపాయి సైతం జోల పాటకు హాయిగా నిద్రిస్తుంది. కాటికి కాలు చాచిన వయోవృద్ధులకు సైతం వారికి చక్కని సంగీతం వినిపించడం ద్వారా శారీరక బాధలను కొంతవరకు నయం చేయవచ్చునని ఆధునిక వైద్యం అంగీకరిస్తోంది. సంగీతం అనే ఈ మూడక్షరాల పదానికి ఉన్న శక్తి మాటలకు అందనిది. మానసిక ఆనందంతో పాటు ఆరోగ్యాన్ని ప్రసాదించే శక్తి సంగీతానికి మాత్రమే ఉంది. మనకు నచ్చిన పాట లేదా మనసుకు హత్తుకొనే సంగీతం విన్నప్పుడు మనకు తెలియకుండానే మనసు ఊహాలోకంలో విహరిస్తూ ఉంటుంది. సంగీతానికి భాషా భేదాలు, ప్రాంతీయ భేదాలు ఉండవు. సజీవ జీవధారలో ఎవరైనా దాహం తీర్చుకోవచ్చు. నేడు ప్రపంచ వ్యాప్తంగా 120 దేశాలలో, వెయ్యి నగరాలలో సంగీత దినోత్సవం ఘనంగా నిర్వహించుకుంటున్నారు. విజయవాడ నగరంలో ఐదు రోజుల పాటు సద్గురువుల ఆరాధనా మహోత్సవాల పేరుతో నిర్వహించే కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

భారతీయ సంగీత సంప్రదాయాలు

కర్నాటక సంగీతం, హిందూస్థానీ, భారత ఫోక్(జానపదం) తుమ్రి, దాద్రా, గజల్, ఖవ్వాలీ, చైతీ కజ్రి, సూఫీ ప్రాచీన సంగీత సంప్రదాయాలు, భాంగ్రా, చలన చిత్ర సంగీతం, పాప్, రాక్, బ్లూస్.



21 నుంచి సంగీత సద్గురువుల ఆరాధనా మహోత్సవాలు

కర్నాటక సంగీత విద్వాంసులు సుసర్ల దక్షిణామూర్తి, గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణ పంతులు శిష్య ప్రశిష్యులు నగరంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఐదురోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. జాతీయ స్థాయిలో జరిగే కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు విదేశాలలో స్థిరపడిన సంగీత కళాకారులు కచేరీలు నిర్వహిస్తున్నారు.భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 21 వ తేది బుధవారం దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో అంతర్జాతీయ సంగీత దినోత్సవం నిర్వహిస్తున్నారు.

సంగీతం ఆపాత మధురం



శాస్త్రీయ సంగీతం బ్రహ్మ పదార్థం కాదు. మనసుతో తెలుసుకుంటే అది ఆపాత మధురం. అందులో ఏ మూలికలు ఉన్నాయో మనకు తెలియకపోయినా, ఒక మందు శరీరం మీద ఎటువంటి ప్రభావం చూపుతుందో అదే విధంగా లక్షణకారులచే శాస్త్రబద్ధం కాబడిన సంగీతం మనసుపై పనిచేసి మానసిక స్వస్థతతో పాటే మన రోగాలెన్నిటినో పోగొడుతుంది.

– మోదుమూడి సుధాకర్, ఆకాశవాణి నిలయ విద్వాంసుడు

భారతీయ సంగీతం విశిష్టమైనది



భారతీయ సంగీతం విశిష్టమైనది. సంగీతానికి జాతి, మత, కుల తారతమ్యాలు లేవు. యువతను, వర్తమాన కళాకారులను సంగీతం వైపు నడిపించి జాతీయ సమైక్యతను సాధించడమే అంతర్జాతీయ సంగీత దినోత్సవం ప్రధాన లక్ష్యం. కర్నాటక సంగీతంలోని 79 మేళకర్తరాగాలే సర్వ సంగీతానికి పునాది. భారతీయ సంగీతం మన జీవితంలో అంతర్భాగం.

– విష్ణుభొట్ల సోదరీమణులు, సంగీత విద్వాంసులు

గురుముఖంగానే అధ్యయనం చేయాలి



సంగీతం నాదోపాసన. త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి లాంటి వాగ్గేయకారులు సంగీతం ద్వారా ముక్తిని పొందవచ్చునని నిరూపించారు. వాగ్గేయకారుల కృతి వైభవాన్ని అవగాహన కలిగించుకోవాలి. దానిలోని భావార్థాలను తమ జీవితాలకు అన్వయించుకోవాల్సిన అవసరం ఉంది. సంగీతం గురుముఖంగానే అధ్యయనం చేయాలి. అదే సంప్రదాయం.

–పోపూరి గౌరీనాథ్, సంగీత విద్వాంసుడు

నరసరావుపేటలో పట్టుబడ్డ పాండిచ్చేరి మద్యం

- ఎస్ఈబీ అదుపులో నిందితులు
- నాలుగు వాహనాలు స్వాధీనం

నరసరావుపేట టౌన్: పాండిచ్చేరి మద్యం అక్రమంగా కలిగి ఉన్న ఇద్దరిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. చిలకలూరిపేట పట్టణంలో ఓ వ్యక్తి దగ్గర పట్టుబడ్డ పాండిచ్చేరి మద్యం బాటిల్ పట్టుబడడంతో తీగలాగితే అక్రమ మద్యం డొంక కదిలింది. దీంతో పెద్ద మొత్తంలో పాండిచ్చేరి మద్యంతో పాటు అక్రమ రవాణాకు వినియోగిస్తున్న రెండు ద్విచక్రవాహనాలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. చిలకలూరిపేట పట్టణంలో పాండిచ్చేరి మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సోమవారం రాత్రి ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించి వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతను ఇచ్చిన సమాచారంతో మరో వ్యక్తిని అదుపులోకి తీసుకొని కారులో తరలిస్తున్న నాలుగు కేసుల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వద్ద దొరికిన ఫోన్ నెంబర్ల ఆధారంగా మద్యం అక్రమ రవాణాలో కీలక సూత్రధారుల కోసం గాలిస్తున్నారు. పాండిచ్చేరి నుంచి అక్రమ మార్గంలో మద్యం ఎలా తీసుకొచ్చారు.. తెచ్చిన మద్యాన్ని ఎవరి ద్వారా విక్రయిస్తున్నారన్నా కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

పవన్ కల్యాణ్‌ను కాపులు ఎప్పటికీ నమ్మరు

రాష్ట్ర కాపు యువసేన అధ్యక్షుడు కర్నా

శావల్యాపురం: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ మాటలను కాపులు మళ్లీ నమ్మే పరిస్థితిలో లేరని రాష్ట్ర కాపు యువసేన అధ్యక్షుడు కర్నా శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ ప్రభుత్వం ముద్రగడ కుటుంబాన్ని అవమానించడం కాపులు మరిచిపోలేదన్నారు. వంగవీటి మోహన రంగాను హత్య చేసిన టీడీపీకి జిందాబాద్‌లు కొట్టాల్సిన అవసరం కాపులకు లేదన్నారు. కాపు రిజర్వేషన్ ఉద్యమానికి మద్దతు తెలిపిన కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేయటం పవన్ కల్యాణ్‌కు తగదన్నారు.

మ్యాప్ పజిల్‌లో బందరు బుడతడు రికార్డు

వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

మచిలీపట్నంటౌన్: ఈ బుడతడి వయస్సు 5 సంవత్సరాల ఐదు నెలలు. ఇండియా మ్యాప్ పజిల్ సెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఇండియా మ్యాప్‌ను ముక్కలుగా చేస్తే వాటిని 1.45 నిమిషాల్లో సరి చేయటంలో ప్రతిభ కనబరిచాడు. బుడతడి ప్రతిభను గుర్తించి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ వారు ఈ అవార్డుకు ఎంపిక చేసి ఇటీవల చెన్నైలో అందజేశారు. ఈ బుడతడి పేరు పాదర్తి నిహాల్. నగరంలోని అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకా రాణి, 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నరసింహగుప్తా దంపతుల కుమార్తె వినీల, జయకృష్ణ దంపతుల కుమారుడు. జయకృష్ణ దంపతులు ఉద్యోగ రీత్యా చెన్నైలో ఉంటున్నారు. వీరి కుమారుడు నిహాల్ ఇండియా మ్యాప్ పజిల్ సెట్‌లో ప్రతిభ కనబరిచి అవార్డు పొందటంతో నగర ప్రజలు నిహాల్‌తో పాటు రేణుకారాణి, గుప్తా దంపతులను అభినందిస్తున్నారు. ఈ అవార్డు పొంది మచిలీపట్నంకు పేరు తెచ్చిన నిహాల్ ప్రతిభను నగర ప్రముఖులు, ప్రజలు ప్రశంసిస్తున్నారు.



అవార్డుతో నిహాల్



జగనన్న ఆణిముత్యాలు పురస్కార సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు బొత్స, మేరుగ, కారుమూరి, వనిత, ఉషశ్రీ, ఎంపీ బాలశౌరి, అధికారులు



బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ అవార్డు అందుకున్న వి.ఆర్.సిద్ధార్థ కళాశాలకు చెందిన ఎ.సౌమ్యశ్రీ



ఇన్నొవేషన్ అవార్డు అందుకున్న పి.వి.పి. సిద్ధార్థ కళాశాలకు చెందిన కోట గోపీచంద్

● ప్రతిభకు పురస్కారం

విజయవాడ ఎ.కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం జగనన్న ఆణిముత్యాలు రాష్ట్ర స్థాయి పురస్కారాల ప్రదానం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, తానేటి వనిత, కారుమూరి నాగేశ్వరరావు, ఉషశ్రీచరణ్, ఎంపీ బాలశౌరి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ఎన్టీ ఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు , ఎమ్మెల్యేలు విష్ణు, వెలంపల్లి తదితరులు పాల్గొన్నారు.



బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ అవార్డు అందుకున్న మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన కె.సాయి వెంకట సుప్రజ



స్టేట్ బ్రిలియంట్స్ అవార్డులో కమ్యూనిటీ సర్వీసు విభాగంలో ప్రతిభా పురస్కారం అందుకున్న కేబీఎన్ కళాశాల విద్యార్థిని ఎ.జ్యోతిమల్లిక



సభకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

క్లుప్తంగా...

ఆరోగ్య రికార్డుల కంప్యూటరీకరణ



సాక్షి, అమరావతి: ప్రజలకు డిజిటల్ వైద్య సేవల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. పౌరులందరి ఆరోగ్య రికార్డులను కంప్యూటరీకరణ (డిజిటలైజేషన్) చేసేలా వైద్య శాఖ అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) కార్యకలాపాల అమలులో రాష్ట్ర వైద్య శాఖ దేశంలోనే ఉత్తమ పనితీరును కనబరుస్తోంది. వైద్య శాఖ అమలు చేస్తోన్న పలు ఆరోగ్య కార్యక్రమాల్లో లబ్ధిదారుల ఐడీలకు వారి ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ అకౌంట్ (ఆభా)ను అనుసంధానిస్తున్నారు. దీనిపై ప్రత్యేక డ్రైవ్‌ను వైద్య శాఖ అమలు చేస్తోంది. వచ్చే నెల 14 వరకు గర్భిణులు, చిన్నపిల్లలు, టీబీ, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, వివిధ వర్గాల ప్రజలకు ఆయా ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన ఐడీకి ఆభాలను అనుసంధానిస్తున్నారు. కాగా, ఇప్పటికే ఏపీలోని 4 కోట్ల మందికిపైగా ప్రజలకు వైద్య శాఖ 'ఆభా'సృష్టించి దేశంలోనే అత్యధిక ఆభాల సృష్టించిన రాష్ట్రాల్లో తొలి స్థానంలో నిలిచింది.

ఖరీఫ్‌కు సమృద్ధిగా ఎరువుల నిల్వలు

- ఎక్కడా ఎరువుల కొరత లేదు..
- కృత్రిమ కొరత సృష్టించినా.. ఎమ్మార్పీకి మించి విక్రయించినా లైసెన్సులు రద్దు
- వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్ హెచ్చరిక



సాక్షి, అమరావతి: ఖరీఫ్–2023 సీజన్‌కు అవసరమైన ఎరువులు సమృద్ధిగా ఉన్నట్లు వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ చెప్పారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీకి మించి విక్రయించినా వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్‌కు 17.74 లక్షల టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేసినట్లు తెలిపారు. 7.74 లక్షల టన్నుల యూరియా, 2.25 లక్షల టన్నుల డీఏపీ, 5.80 లక్షల టన్నుల కాంప్లెక్స్, 1.01 లక్షల టన్నుల ఎస్ఎస్‌పీ, 92,000 టన్నుల ఎంవోపీ ఎరువుల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ఈ నెల 19 నాటికి 1.85 లక్షల టన్నుల ఎరువుల విక్రయాలు జరగ్గా, ఇంకా 9.37 లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటికి అదనంగా జూన్‌కు సంబంధించి ఏపీకి కేటాయించిన 2.60 లక్షల టన్నుల ఎరువులు ఇంకా రావాల్సి ఉందన్నారు. ఆర్బీకేల్లో 69,000 టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచగా, 9,000 టన్నుల ఎరువులను కొనుగోలు చేశారన్నారు. మిగిలిన ఎరువులను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎక్కడా ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. ఎరువులు కొనుగోలు చేసిన ప్రతిసారి తప్పనిసరిగా డీలర్ నుంచి రశీదు తీసుకోవాలని రైతులకు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.

ముద్రగడ పెద్దమనిషి అనుకున్నా: చేగొండి

పాలకొల్లు సెంట్రల్: వారాహి యాత్రలో నాకు పదేళ్ల ముఖ్యమంత్రి అవకాశం ఇవ్వండి.. మీరు కోరుకున్నట్లు నేను చేయలేకపోతే రెండేళ్లలో తప్పుకుంటానని పవన్ కల్యాణ్ ప్రకటన చేయడంతో కాపు సామాజిక వర్గం సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు మాజీ ఎంపీ, కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకులు చేగొండి హరిరామజోగయ్య తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఇంతవరకు ముద్రగడ పెద్దమనిషి, వివాద రహితుడు, కాపుల సంక్షేమం కోరే ఒకే ఒక వ్యక్తి, కాపులకు రాజ్యాధికారం కోరే ప్రముఖుడని తాను అనుకున్నానన్నారు. గతంలో ముద్రగడ చేసిన ఉద్యమాలు కాపు సంక్షేమం కోసం చేశారనుకున్నానని, కానీ అవి కూడా రాజకీయ లబ్ధి కోసమే చేశారని ఇప్పుడు అర్థమవుతోందని పేర్కొన్నారు.

ముద్రగడ లేఖపై ఉలుకెందుకు?

జాతీయ కాపు సమాఖ్య అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి

వన్‌టౌన్ (విజయవాడపశ్చిమ): పవన్‌కళ్యాణ్ గురించి కాపు ఉద్యమ నేత, మాజీ ఎంపీ ముద్రగడ పద్మనాభం రాసిన బహిరంగ లేఖపై పలువురు ఉలిక్కిపడటం విడ్డూరంగా ఉందని జాతీయ కాపు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి పేర్కొన్నారు. రాష్ట్రంలో కాపుల ఐక్యతకు, రక్షణకు, సంక్షేమానికి పాటుపడిన వంగవీటి మోహనరంగా తరువాత ఆ స్థాయిలో కాపుల కోసం పాటుపడిన వ్యక్తి ముద్రగడ అని తెలిపారు. రంగా వంటి నేతల నుంచి ముద్రగడ వరకు కాపుల కోసం పోరాడుతూనే ఉన్నారని గుర్తుచేశారు. ముద్రగడపై కొంతమంది చేస్తోన్న వ్యాఖ్యలు ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. కాపు ఉద్యమనేతగా, కాపుల సంక్షేమాన్ని కాంక్షించే నేతగా ముద్రగడ.. పవన్ మంచి కోరుతూ లేఖ రాశారని, దానిని గ్రహించకుండా కొంత మంది స్పందిస్తున్న తీరు సరికాదన్నారు.

తొక్కతీస్తా.. నార తీస్తా.. ఏమిటీ భాష?

ఎమ్మెల్యే ద్వారంపూడిని దూషించేందుకు మీ సమయాన్ని వృథా చేయొద్దు

జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కు కాపునేత ముద్రగడ లేఖ



సాక్షి ప్రతినిధి, కాకినాడ: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఒకపక్క టీడీపీ, బీజేపీతో కలిసి పోటీ చేస్తానంటూ మరోపక్క తనను ముఖ్యమంత్రిని చేయాలని కోరడం హాస్యాస్పదంగా ఉందని కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వ్యాఖ్యానించారు. కలసి పోటీ చేస్తే ముఖ్యమంత్రిని చేయమని ఎలా అడుగుతున్నారో అర్థం కావడంలేదన్నారు. పవన్ 175 స్థానాల్లో పోటీ చేస్తే ముఖ్యమంత్రిని చేయాలని కోరడం తప్పు కాదన్నారు. ఒక పార్టీని స్థాపించాక పదిమంది ప్రేమను పొందాలేగానీ వీధి రౌడీ భాషలో మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ మేరకు పవన్‌ను ఉద్దేశించి రాసిన లేఖను ముద్రగడ మంగళవారం మీడియాకు విడుదల చేశారు. పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న తీరు, ప్రజాప్రతినిధులపై ఉపయోగిస్తున్న పరుష పదజాలాన్ని లేఖలో ముద్రగడ తీవ్రంగా తప్పుబట్టారు. 'ఈ లేఖ రాసినందుకు మీకు ఎక్కడా లేని కోపం రావచ్చు. మీ కోట్లాది మంది అభిమానులు నన్ను తుద ముట్టించే ప్రయత్నం చేయవచ్చు. అయినప్పటికీ నిజాన్ని నిర్భయంగా రాయక తప్పడం లేదు' అని అందులో పేర్కొన్నారు.

రెచ్చగొట్టి పబ్బం గడుపుకోలేదు

కులాన్ని అడ్డం పెట్టుకుని నేను నాయకుడిగా ఎదగలేదు. కులాన్ని అడ్డు పెట్టుకుని ఎప్పుడూ ఏ పదవీ పొందలేదు. యువతను వాడుకుని భావోద్వేగాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోలేదు. వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగ్గంపేట సభలో రిజర్వేషన్ల అంశం తన చేతిలో ఉండదని, అది కేంద్రం పరిధిలో ఉందని అన్నప్పుడు నేను ఇచ్చిన సమాధానం ఏమిటో పవన్ ఎవరినైనా అడిగి తెలుసుకోవాలి. పిల్లి సుభాష్ చంద్రబోస్, బొత్స సత్యనారాయణలలో ఒకరిని ముఖ్యమంత్రిని చేయమని కోరా. నేను కోట్లాది రూపాయల కోసం, సూట్‌కేసులకు అమ్ముడు పోవడానికి ఉద్యమం చేయలేదు. నాకంటే చాలా బలవంతుడైన పవన్ నేను వదిలేసిన ఉద్యమాన్ని చేపట్టి కాపు యువతకు రిజర్వేషన్ ఫలాలను ఎందుకు సాధించలేదో చెప్పాలి. పవన్‌కు రాజకీయ సలహాలు ఎవరిస్తున్నారో నాకు తెలియదు. ఆయన మాట్లాడే భాష వల్ల నష్టమేగానీ లాభం ఉండదు. 'తొక్క తీస్తా.. నార తీస్తా.. కింద కూర్చోబెడతా.. చెప్పుతో కొడతా.. గుండు గీయిస్తా..!' వంటి వ్యాఖ్యలు పదేపదే చేస్తున్నారు. ఇప్పటివరకూ ఎంత మందిని అలా చేశారో ఆయనే చెప్పాలి. పవన్ గతంలో నావద్దకు రాయబారులను పంపిస్తే ప్రత్యేక హోదా, రైల్వే జోన్, విశాఖ ఉక్కు, కడప స్టీల్ ప్లాంట్ తదితర సమస్యలపై పోరాడాలని సూచించా. పవన్‌కు నిజంగా రాష్ట్ర ప్రజలపై ప్రేమ ఉంటే ఈ సమస్యలపై యుద్ధం చేయాలి. అంతేకానీ నాలాంటి అనాథలపై కాదు.

కాపు ఉద్యమానికి ద్వారంపూడి కుటుంబం సహకారం

కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, ఆయన తండ్రి భాస్కరరెడ్డి, తాత కృష్ణారెడ్డి తప్పుడు మార్గాల్లో సంపాదించారన్న పవన్ ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదు. ఆ కుటుంబంతో నాకు ఎన్నో ఏళ్ల అనుబంధం ఉంది. ఎప్పుడూ ఎక్కడికీ వెళ్లని కృష్ణారెడ్డి మాఇంట్లో శుభకార్యాలకు వచ్చి దీవించేవారు. 1984లో ఎన్టీఆర్ ప్రభుత్వంలో మంత్రి పదవిని నేను తీసుకోకపోవడంతో కృష్ణారెడ్డి, భాస్కరరెడ్డి ఉదయం 6 గంటలకు కిర్లంపూడి వచ్చి రెండు గంటలు నచ్చచెప్పారు. మంత్రి పదవి స్వీకరించి పది మందికి సహాయపడాలని ద్వారంపూడి కుటుంబం నాకు సలహా ఇచ్చింది. అలాంటి కుటుంబాన్ని దూషించేందుకు పవన్ తన విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దు. 1988లో విజయవాడ కాపునాడు సభకు సుమారు 100 లారీలను ఆ కుటుంబమే సమకూర్చింది. 1993 – 94 కాపు ఉద్యమ సమయంలో కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోస్టర్లు ముద్రించేందుకు మావద్ద రూ.50 కూడా లేని సమయంలో రూ.50 వేలతో పోస్టర్లు సిద్ధం చేసిన కుటుంబం ద్వారంపూడిదే. కాపు ఉద్యమాలకు సహాయం చేసిన వారిని విమర్శించడం పవన్‌కు తగదు. పవన్ ఆరోపణలు నిజమైతే కాకినాడలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిపై పోటీచేసి గెలుపొంది సత్తా చాటుకోవాలి. కాపు ఉద్యమాల్లో పాల్గొనని పవన్ తరచూ కాపులు పెద్దన్న పాత్ర పోషించాలనడం విడ్డూరం.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'పై వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై సీఎం వైఎస్ జగన్ బుధవారం వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, ప్రాంతీయ సమన్వయకర్తలు పాల్గొంటారు. 'గడప గడపకు మన ప్రభుత్వం'నిర్వహిస్తోన్న తీరును సమీక్షించి..మరింత మెరుగ్గా నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై వీరికి సీఎం జగన్ దిశానిర్దేశం చేస్తారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పథకాల ద్వారా అర్హతే ప్రామాణికంగా, వివక్షకు తావు లేకుండా, పారదర్శకంగా ప్రతి కుటుంబానికి చేస్తోన్న మేలును వివరించి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరేందుకు గతేడాది మే 11న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంపై ఎప్పటికప్పుడు వర్క్ షాప్‌లు నిర్వహిస్తూ..మరింత ప్రభావవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సీఎం జగన్ దిశానిర్దేశం చేస్తున్నారు. అందులో భాగంగా గత ఏప్రిల్ 3న వర్క్ షాప్ నిర్వహించారు. ఆగస్టులోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సీఎం జగన్ ఆదేశించారు.

సినిమాటిక్‌గా పవన్ యాత్ర

- సబ్జెక్టు లేకే అవాకులు చెవాకులు
- మాజీ మంత్రి కన్నబాబు


మాట్లాడుతున్న మాజీ మంత్రి కన్నబాబు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పవన్‌కళ్యాణ్ వారాహి యాత్ర సినిమాటిక్‌గా సాగుతోందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు విమర్శించారు. సినిమాలో క్లైమాక్స్ సీన్‌లో హావభావాలు, డైలాగులతో అభిమానులను అలరించేలా పవన్ యాక్షన్ ఉంటోందన్నారు. కాకినాడలో మంగళవారం ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కన్నబాబు మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ యాత్రలో ప్రభుత్వానికి, ఈ ప్రాంతానికి మంచి జరిగేలా నాలుగు సూచనలు చేస్తారని అంతా ఎదురుచూశారని, ఆయన అందుకు విరుద్ధంగా ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై పరుష పదజాలంతో దూషణలకే పరిమితమయ్యారని విమర్శించారు. సినిమాలో హీరో విలన్లను కొడితే జనం చప్పట్లు కొడతారని, ఆ మాదిరిగా పవన్.. ఆయన్ని హీరోగా, ముఖ్యమంత్రిని మెయిన్ విలన్‌గా తమను చిన్న విలన్లుగా ఊహించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిని అవుతానని చెప్పుకొంటూ ఇంత దారుణమైన భాషను వినియోగించడం చూస్తుంటే పవన్ వద్ద సబ్జెక్టు ఏమీ లేదనే విషయం అర్థమవుతోందన్నారు. ఫుల్‌టైమ్ రాజకీయం చేస్తున్న తమకు.. అకేషనల్‌గా వచ్చే పవన్ చేస్తున్న వ్యాఖ్యలకు స్పందించాలా అనిపిస్తోందని పేర్కొన్నారు.

కాపులను విద్రోహశక్తులుగా చిత్రీకరించిన బాబుతో చెలిమి

శాసనసభ్యుల తొలి సమావేశంలో ముఖ్యమంత్రి చెప్పినట్లు.. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడాలనే కర్తవ్యాన్ని కొనసాగిస్తున్నామన్నారు. మూడేళ్ల ముందునుంచే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాము ప్రజల్లో తిరుగుతున్నామనే కడుపుమంటతో పవన్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. కులాల ప్రస్తావన లేని రాజకీయం తమ సిద్ధాంతమని జనసేన ఆవిర్భావంలో చెప్పిన ఆయన ఇప్పుడు కులాల మధ్య చిచ్చుపెట్టే పనులే చేస్తున్నారన్నారు. వారాహి సభల్లో కులాల ప్రస్తావన లేకుండా పవన్‌కళ్యాణ్ ప్రసంగించారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో టీడీపీనే కులాల కుంపట్లు రాజేసిందని విమర్శించారు. కాపులపై సంఘవిద్రోహ శక్తులుగా కేసులు పెట్టించిన చంద్రబాబుతో పవన్ ఎందుకు కలిసి వెళుతున్నారని నిలదీశారు. కాపులపై చంద్రబాబు అన్యాయంగా పెట్టిన కేసుల్ని ముఖ్యమంత్రి జగన్ ఎత్తేశారని గుర్తుచేశారు. కాపులు 90 శాతం మంది జగన్ వెంటే ఉన్నారన్నారు. తనను చంపడానికి సుపారీ ఇచ్చారని చెబుతున్న పవన్.. డీజీపీకి ఫిర్యాదు చేయాలని, లేదా తాను ఎంతో సానుకూలంగా ఉంటున్న కేంద్ర హోంమంత్రికి ఫిర్యాదు చేయాలని సూచించారు. కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య గతిని మార్చిన జగన్‌పై నోరుపారేసుకోవడం తగదని పవన్‌కు హితవు చెప్పారు.

ముస్లింలకు అండగా ఉంటా

ముఖాముఖిలో పవన్ కళ్యాణ్



బాలాజీచెరువు(కాకినాడ సిటీ): అధికారం ఉన్నా... లేకున్నా ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటానని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు. వారాహి యాత్రలో భాగంగా మంగళవారం కాకినాడలోని ఒక హోటల్‌లో ముస్లింలతో పవన్‌కళ్యాణ్ ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో మత ప్రాతిపదికన దేశం విడిపోవడం ఎక్కడా జరగలేదన్నారు. బ్రిటీష్ పాలన ముగిశాక మహ్మద్ అలి జిన్నా ముస్లింలు, హిందువులు కలిసి ఒకే దేశంలో ఉండలేరని, రెండు దేశాలను ప్రతిపాదించారన్నారు. ఆ రోజు నుంచి మత ఘర్షణలు మొదలై లక్షలాది మంది అమాయకులు మరణించారన్నారు. మైనార్టీలు అంటే ముస్లింలు మాత్రమే అని అంటారని, వాస్తవానికి హిందూ సమాజంలో మాదిరిగానే అనేక ఉప కులాలు మైనార్టీలో కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ముస్లిం సమాజంలో రాజకీయంగా సమాన అవకాశాలు అందరికీ దక్కడం లేదని తాను రాజకీయాల్లోకి రావాలనుకున్నప్పుడే గుర్తించానని చెప్పారు. ఏ పార్టీలో అయినా విపరీత ధోరణిని, అతివాదాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. 'బీజేపీ అంటే మతతత్వ పార్టీగా ముస్లింలు భావిస్తారు. బీజేపీతో ఏ పార్టీ పొత్తు పెట్టుకున్నా మీకు నచ్చదు. కానీ హిందువులు మతతత్వ ధోరణితో ఉన్నట్లయితే 17శాతం ఉన్న ముస్లింలు ఇంత స్వేచ్ఛగా ఉండలేరనేది నా వ్యక్తిగత అభిప్రాయం. పరమతాలను గౌరవించే సంస్కృతి హిందూ మతం నేర్పించింది.' అని పవన్ అన్నారు. అనంతరం వారాహి యాత్ర తాళ్లరేవు, యానాం మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం చేరుకుంది.

వంగవీటి వీరాభిమాని ద్వారంపూడి

- చంద్రశేఖరరెడ్డి రాజకీయ ప్రస్థానం రంగాతోనే ప్రారంభం
- ఆరోపణలన్నీ పొంతనలేని రాజకీయపరమైన అసత్యాలు
- చెప్పుడు మాటలువిని ఆరోపణలు చేయడం కరెక్ట్ కాదు
- ద్వారంపూడి కాపు వ్యతిరేకి అనడం పచ్చి అబద్ధం.. రంగా కుటుంబంతో ఇప్పటికీ అదే అనుబంధం
- 'సాక్షి'తో రంగా బావమరిది చెన్నుపాటి శ్రీనివాస్

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: 'కాకినాడ శాసనసభ్యుడు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి రాజకీయ ప్రస్థానం దివంగత వంగవీటి మోహన్ రంగారావుతోనే మొదలైంది. ఆయన అభిమానం అప్పటి నుంచి ఇప్పటికీ ఏమాత్రం చెక్కుచెదరలేదు. చంద్రశేఖరరెడ్డి కాపు వ్యతిరేకి అనడం పచ్చి అబద్ధం. తప్పుడు ఆరోపణలు చేయడం ఏమాత్రం సరికాదు.' అని వంగవీటి రంగా బావమరిది చెన్నుపాటి శ్రీనివాస్ స్పష్టంచేశారు. వారాహి యాత్రలో భాగంగా కాకినాడ బహిరంగ సభలో ద్వారంపూడిపై జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో చెన్నుపాటి శ్రీనివాస్ స్వచ్ఛందంగా స్పందించారు. ఆయన మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

కాకినాడలో రంగా తొలి సభ పెట్టింది ద్వారంపూడి

నాకు 1985, 86ల నుంచే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డితో పరిచయం ఉంది. అప్పటికే వాళ్ల ఫ్యామిలీ చాలా రిచ్. రైస్ మిల్లులు, సినిమా థియేటర్స్ ఇవన్నీ ఉండేవి. అప్పటికే రంగాకు ఆయన స్ట్రాంగ్



ఫాలోయర్. రంగా అభిమానిగా తిరిగిన ద్వారంపూడి ఆయన ద్వారానే రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1988లో ఎవరూ ధైర్యం చేయని రోజున కాకినాడ ప్రాంతంలో భారీ స్థాయిలో ర్యాలీ పెట్టి వంగవీటిని తీసుకెళ్లి అతిపెద్ద బహిరంగ సభ నిర్వహించారు. బహుశా అప్పటి నుంచి ఇప్పటివరకు అంతపెద్ద బహిరంగ సభ ఎప్పుడూ జరిగి ఉండదు. అంతటి వీరాభిమాని చంద్రశేఖరరెడ్డి. వంగవీటి తదనంతరం వైఎస్ రాజశేఖరరెడ్డిని ఫాలో కావడం, రాజకీయంగా ఎదగడం జరిగింది. మూడున్నర దశాబ్దాలుగా పరిచయమున్న చంద్రశేఖరరెడ్డి గురించి, వాళ్ల కుటుంబం గురించి పూర్తిగా తెలుసు. ఆయనపై ఆరోపణలన్నీ రాజకీయపరమైనవి, పొంతనలేనివిగానే కనిపిస్తున్నాయి. వాటిలో ఏమాత్రం వాస్తవం లేదు. ఏదైనా తెలుసుకుని మాట్లాడితే మంచిదని నా అభిప్రాయం. ఎవరో చెబితే విని ఆరోపణలు చేయడం కరెక్ట్ కాదు. రాజకీయంగా పూర్తిగా దూరంగా ఉన్నాను కాబట్టి నేను రాజకీయంగా వాటి గురించి కామెంట్ చేయలేను. కానీ, చంద్రశేఖరరెడ్డి విషయం గురించి వస్తే మాత్రం నాకు ఆయన విషయాలు పూర్తిగా తెలుసు. కాబట్టి ఆ ఆరోపణలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా. రంగా అభిమానిగా మొదలైన ద్వారంపూడి రాజకీయ ప్రస్థానంలో కాపు వ్యతిరేకి అనేది పూర్తిగా అవాస్తవం. అలాంటి ఉద్దేశాలు ఉన్న రాజకీయ నాయకుడు కూడా కాదు. వెరీ ఫెయిర్ పొలిటీషియన్. 1985 నుంచి ఈ రోజు వరకు వంగవీటి అభిమానిగానే కొనసాగుతున్నాడు. మా బావగారు చనిపోయి ఇప్పటికి 33 సంవత్సరాలు అవుతున్నా... ఇంకా మా ఫ్యామిలీతో సన్నిహితంగా ఉన్నాడు.

ప్రగతి పథంలో ఆర్టీసీ

పెరిగిన రాబడి... తరిగిన అప్పులు

ఆర్టీసీ అభివృద్ధికి సీఎం జగన్ ప్రత్యేక చర్యలు

- కరోనా సంక్షోభాన్ని తట్టుకొని మరీ ఆదాయం ఆర్జన
- 17 శాతం పెరిగిన ఆర్టీసీ రాబడి
- దసరా, సంక్రాంతి పండుగల్లోనూ సాధారణ చార్జీలే..
- ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన సర్వీసులు
- స్లీపర్, విద్యుత్తు బస్సులు.. పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు
- మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం
- ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకే పచ్చ మీడియా దుష్ప్రచారం





సాక్షి, అమరావతి: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) ప్రజా రవాణా వ్యవస్థ. దానిని ఎంత నూతనత్వంగా తీర్చిదిద్దితే అంతగా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం ఉంటుంది. ఈ విషయాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడమే కాకుండా, ఆ సంస్థ అభివృద్ధికి అన్ని చర్యలు చేపట్టారు. దీంతో కరోనా కష్టకాలాన్ని కూడా అధిగమించి ఆర్టీసీ ప్రగతి పథంలో పయనిస్తోంది. ఆర్టీసీ రాబడి 17 శాతం పెరగడమే దీనికి నిదర్శనం. పచ్చ మీడియా రాజకీయ దురుద్దేశంతో ఆర్టీసీ తిరోగమనంలో ఉందంటూ ప్రజల్ని తప్పుదారి పట్టించేలా అభూత కల్పనలతో వార్త ప్రచురించింది. కానీ, వాస్తవం మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. అవేమిటో పరిశీలిద్దాం..

- టీడీపీ హయాంలోకంటే వైఎస్సార్‌సీపీ హయాంలో ఆర్టీసీ ప్రగతి బాట పట్టింది. కోవిడ్ కారణంగా దేశంలోఅన్ని రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థల మాదిరిగానే ఆర్టీసీ కూడా 2020, 2021లో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంది. కానీ మళ్లీ వెంటనే గాడిన పడింది. కోవిడ్ ముందుకంటే మెరుగైన ఫలితాలు సాధిస్తోంది. ఆక్యుపెన్సీ రేటు (ఓఆర్) పెరిగింది. ఆర్టీసీ సాధిస్తోన్న రాబడి లెక్కలే ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి.
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది అంటే 2019–20లో ఆర్టీసీకి రూ.4,781 కోట్ల రాబడి వచ్చింది. 2022–23లో రూ.5,574 కోట్ల రాబడి సాధించింది. అంటే కరోనా సంక్షోభాన్ని ఎదుర్కొని కూడా 2019–20 కంటే 2022–23లో రూ.793 కోట్లు అధికంగా (17% అధికం) రాబడి సాధించడం విశేషం.
- 2019–20లో కిలోమీటర్‌కు రాబడి రూ.31.31 ఉండగా.. 2022–23లో రూ.37.91కు పెరిగింది. కిలోమీటర్‌కు రూ. 6.60 అంటే 21 శాతం అధికంగా సాధించింది.
- దసరా, సంక్రాంతి పండుగలకు దశాబ్దాలుగా ఆర్టీసీ అధిక చార్జీలు వసూలు చేసేది. ప్రస్తుతం దసరా, సంక్రాంతి పండుగల్లో కూడా సాధారణ చార్జీలతోనే సర్వీసులు నిర్వహిస్తోంది.
- ప్రయాణికుల అభిరుచికి తగ్గట్టుగా నాన్ ఏసీ స్లీపర్ బస్సులు ప్రవేశపెట్టడం వంటి వినూత్న చర్యలు చేపట్టింది. దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతోంది.
- రూ.50 కోట్లతో 2,200 బస్సులను ఆధునీకరించింది. 900 డీజిల్ బస్సులను కొత్తగా ప్రవేశపెట్టింది.
- తొలిసారి 100 ఈ–బస్సులను కూడా అందుబాటులోకి తెచ్చింది. కొత్తగా 1,500 బస్సులను కొనుగోలు చేసే ప్రక్రియ కొనసాగుతోంది.
- ఆర్టీసీ 980 బస్సులను తుక్కు కింద తొలగించిందని పచ్చ మీడియా పేర్కొంది. ఇది అవాస్తవం. కేంద్ర ప్రభుత్వ విధానాన్ని అనుసరించి 214 బస్సులను తొలగించింది.
- ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు సీమాంధ్ర నుంచి తెలంగాణ ప్రాంతానికి రోజూ 1,226 బస్సు సర్వీసులను నిర్వహించేవారు. వాటిలో అత్యధిక సర్వీసులు హైదరాబాద్‌కే నిర్వహించేవారు కూడా. కోవిడ్ అనంతర పరిణామాలతో తెలంగాణ ఆర్టీసీ ఇరు రాష్ట్రాల మధ్య సర్వీసులను తగ్గించాలని ప్రతిపాదించింది. ఆమేరకు రెండు రాష్ట్రాల ఆర్టీసీల మధ్య కుదిరిన కొత్త ఒప్పందం మేరకు బస్సు సర్వీసులు తగ్గించారు. కోవిడ్‌కు ముందు ఏపీ నుంచి తెలంగాణకు రోజూ 2.65 లక్షల కిలోమీటర్ల మేర సర్వీసులు నిర్వహిస్తే.. ప్రస్తుతం రోజూ 1.60 లక్షల కి.మీ. సర్వీసులు నిర్వహిస్తున్నారు. అంటే 1.04 లక్షల కి.మీ. మేర సర్వీసులను తగ్గించారు. అదే రీతిలో తెలంగాణ ఆర్టీసీ కూడా ఏపీకి నిర్వహించే బస్ సర్వీసులను తగ్గించింది. అంతర్రాష్ట్ర ఒప్పందం మేరకు తీసుకున్న ఈ నిర్ణయాన్ని వక్రీకరిస్తూ ఆర్టీసీ బస్ సర్వీసులు తగ్గిపోయాయని ఎల్లో మీడియా దుష్ప్రచారం చేయడం విడ్డూరంగా ఉంది.

అప్పులు తీర్చి.. మౌలిక సదుపాయాలు కల్పిస్తూ..

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత సంస్థ గణనీయమైన ప్రగతిని సాధిస్తోంది. ఈ మూడేళ్లలో తీర్చిన అప్పులే అందుకు నిదర్శనం. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల బకాయిలు రూ.886కోట్లు, పీఎఫ్ బకాయిలు రూ.996కోట్లు, సీసీఎస్ బకాయిలు రూ.226 కోట్లు, ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.307 కోట్లు వెరసి మొత్తం రూ.2,415 కోట్ల బకాయిలను ఆర్టీసీ తీర్చింది. మరోపక్క మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఆర్టీసీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. రూ.34 కోట్లతో పులివెందులలో బస్ స్టేషన్‌ను నిర్మించింది. రూ.91 కోట్లతో కొత్తగా 19 బస్ స్టేషన్ల నిర్మాణం చేపట్టింది. రాజమహేంద్రవరం, అనంతపురం, తిరుపతి, నరసరావుపేటలలో డిస్పెన్సరీలను ఆధునీకరించింది.

పశుపోషణ, పాడి, డెయిరీ, సాగు రంగాల్లో..

ఏపీ దేశానికే ఆదర్శం

- కేరళ పశుసంవర్థక శాఖమంత్రి చెంచురాణి వెల్లడి
- రాష్ట్రంలో పర్యటిస్తున్న ఆ రాష్ట్ర సెలక్ట్ కమిటీ
- మంత్రి సీదిరి అప్పలరాజు, పశుసంవర్థక శాఖాధికారులతో భేటీ
- ఏపీలో అమలవుతున్న కార్యక్రమాలపై అధ్యయనం
- ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి ఆర్బీకేను సందర్శించిన ఇథియోపియా బృందం
- ఆర్బీకే, యంత్ర సేవా కేంద్రాలు బాగున్నాయని కితాబు

సాక్షి, అమరావతి/భవానీపురం/ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ) : పశుపోషణ, పాడి, డెయిరీ, సాగు రంగాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని కేరళ, ఇథియోపియా బృందాలు కొనియాడాయి. ఏపీలో అమలవుతున్న కార్యక్రమాలు.. అలాగే, రైతుభరోసా కేంద్రాలు (ఆర్బీకే) ద్వారా గ్రామస్థాయిలో అందిస్తున్న సేవలు నిజంగా అద్భుతంగా ఉన్నాయని తెలిపాయి. ఏపీలో తీసుకొస్తున్న లైవ్‌స్టాక్ అండ్ పౌల్ట్రీ ఫీడ్ అండ్ మినరల్ మిక్చర్ బిల్లు–2022ను స్ఫూర్తిగా తీసుకుని దానిని మరింత పటిష్టంగా తీర్చిదిద్దడంతో పాటు ఇక్కడ అమలవుతున్న కార్యక్రమాలను అధ్యయనం చేసి తమ రాష్ట్రంలో అమలుచేసే నిమిత్తం మంత్రి చెంచురాణి నేతృత్వంలోని 10 మంది ఎమ్మెల్యేలు, ఇతర ఉన్నతాధికారులతో కూడిన కేరళ ప్రభుత్వ సెలక్ట్ కమిటీ రాష్ట్రంలో పర్యటిస్తోంది. ఇందులో భాగంగా విజయవాడలో మంగళవారం రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఉన్నతాధికారులతో కేరళ బృందం సమావేశమైంది. మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో తమ ప్రభుత్వం నాలుగేళ్లలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చిందని వివరించారు. ప్రతీ ఆర్బీకేను రూరల్ లైవ్‌స్టాక్ యూనిట్‌గా తీర్చిదిద్దామన్నారు. జగనన్న పాల వెల్లువ ద్వారా మహిళా పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ డెయిరీ రంగం బలోపేతానికి కృషిచేస్తున్నామన్నారు. కేరళ ఎమ్మెల్యేల సందేహాలను మంత్రి అప్పలరాజు నివృత్తి చేశారు. ఏపీ పశుదాణా చట్టం –2020 అమలుతీరును పశుసంవర్థక శాఖ డైరెక్టర్ డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్ వివరించారు.

సీఎం జగన్ దూరదృష్టి అద్భుతం : కేరళ మంత్రి చెంచురాణి

కేరళ మంత్రి చెంచురాణి మాట్లాడుతూ ఏపీలో అమలవుతున్న కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టికి తామంతా ముగ్ధులయ్యామన్నారు. పశుపోషణ, పాడి, డెయిరీ రంగాల్లో ఏపీ సర్కార్ అందిస్తున్న సేవలను ఆమె ప్రశంసించారు. కేరళలో పాడి, పౌల్ట్రీ సంపదకు అవసరమైన దాణా, ఫీడ్ కోసం పొరుగు రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. 50 శాతానికి పైగా పశు దాణా, పౌల్ట్రీ ఫీడ్‌లను


కేరళ బృందంతో సమావేశమైన మంత్రి అప్పలరాజు

దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. ఈ విషయంలో ఏపీ చేపట్టిన కార్యక్రమాలను కేరళలో కూడా అమలుచేసేందుకు తమ ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు, వైద్య, విద్యరంగాల్లో తీసుకొచ్చిన మార్పులను అడిగి తెలుసుకున్నారు. కేరళ మంత్రి, ఎమ్మెల్యేలు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనక దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఆచరించదగ్గ ఎన్నో విషయాలున్నాయిక్కడ: ఇథియోపియా బృందం ప్రశంస

మరోవైపు.. ఆర్బీకేల సేవలు అద్భుతంగా ఉన్నాయని ఇథియోపియా ప్రతినిధి బృందం కితాబిచ్చింది. ప్రపంచంలో వ్యవసాయాధారిత దేశాలన్నీ ఆచరించదగ్గ ఎన్నో కార్యక్రమాలు ఇక్కడ అమలవుతున్నాయని అభిప్రాయపడింది. ఇథియోపియా బృందం పర్యటనలో భాగంగా రెండోరోజు ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గ పరిధిలోని గొల్లపూడి ఆర్బీకే కేంద్రాన్ని బృందం సందర్శించింది. ఆర్బీకేలోని కియోస్క్ ద్వారా సర్టిఫై చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల బుకింగ్, సరఫరా గురించి రైతులను అడిగి బృందం సభ్యులు తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకిచ్చిన ట్రాక్టర్ ఎక్కి రైతు క్షేత్రంలో దుక్కి పనుల్లో పాల్గొన్నారు. మూలపాడులో ఖరీఫ్ పంటల ఈ–క్రాప్ నమోదును పరిశీలించారు. రైతులతో ముఖాముఖిలో పాల్గొని ఆర్బీకే ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆర్బీకేల గురించి తాము విన్నదానికంటే ఎన్నో రెట్లు బాగున్నాయని బృంద సభ్యులు ప్రపంచానికే ఏపీ ఒక దిశానిర్దేశం చేసిందన్నారు. ఈ బృందంలో ప్రపంచ బ్యాంకు సలహాదారు హిమ్మత్ పటేల్, ఇథియోపియా వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా...

ఒకేసారి ఆల్ ఇండియా, రాష్ట్ర స్థాయి కౌన్సెలింగ్!

వైద్య విద్య పీజీ, యూజీ కోర్సుల్లో ప్రవేశాల్లో కొత్త విధానం

సాక్షి, అమరావతి: వైద్య విద్య పీజీ, యూజీ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియలో భాగంగా ఆల్ ఇండియా, రాష్ట్ర స్థాయి కౌన్సెలింగ్‌ను ఏకకాలంలో నిర్వహించాలని మెడికల్ కౌన్సెలింగ్ కమిషన్ (ఎంసీసీ) యోచిస్తోంది. దీంతో పాటు ప్రవేశాల ప్రక్రియలో మరికొన్ని మార్పులను ప్రవేశపెట్టబోతోంది. ఈ క్రమంలో కొత్త విధానంపై రాష్ట్రాలు తమ సూచనలు, సలహాలు తెలియజేయాలంటూ డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ ఇటీవల అన్ని రాష్ట్రాల ఆరోగ్య విశ్వవిద్యాలయాలకు లేఖ రాసింది. కిందటి సంవత్సరం వరకూ పీజీ, ఎంబీబీఎస్, ఇతర కోర్సుల్లో ప్రవేశాల్లో భాగంగా ఆల్ ఇండియా కౌన్సెలింగ్‌ను తొలుత ప్రారంభించేవారు. అనంతరం రాష్ట్రాల్లో కౌన్సెలింగ్ నిర్వహించేవారు. అయితే నూతన విధానంలో రెండు కౌన్సెలింగ్‌లు ఏకకాలంలో చేపట్టనున్నారు. అదే విధంగా సీట్ల బ్లాకింగ్‌కు తావివ్వకుండా డైనమిక్ కౌన్సెలింగ్‌ను ప్రతిపాదించారు. ఈ విధానంలో భాగంగా పీజీ, యూజీ సీట్లన్నీ భర్తీ అయ్యే వరకూ కౌన్సెలింగ్ చేపడతారు. ఇప్పటి వరకూ రెండు రౌండ్‌ల కౌన్సెలింగ్ అనంతరం మిగిలి పోయిన సీట్లకు మాప్-అప్ రౌండ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తూ వస్తున్నారు. కొత్త విధానంలో సీట్లన్నీ భర్తీ అయ్యే వరకూ కౌన్సెలింగ్ నిర్వహిస్తూనే ఉండేలా చర్యలు చేపట్టాలని యోచిస్తున్నారు. అంతేకాకుండా మొదటి రెండు కౌన్సెలింగ్‌లలో తమకు వచ్చిన సీట్లలో విద్యార్థులు చేరేది, చేరనిది ఆన్‌లైన్‌లో తెలియజేసేందుకు వీలు కల్పించనున్నారు. మరోవైపు అన్ని ప్రైవేట్ కళాశాలలకు కామన్ కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రతిపాదించారు. సింగిల్ చాయిస్ విధానం ద్వారా అన్ని కౌన్సెలింగ్‌లను నిర్వహించాలనుకుంటున్నారు.

ఏపీ విపక్షాల్లో బ్రిటిష్ అవశేషాలు

ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విపక్ష పార్టీ నేతల్లో బ్రిటీష్ అవశేషాలు ఎక్కువగా ఉన్నాయని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఎంపీ, పార్టీ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి పూర్వం భారత్‌ను ఏలిన బ్రిటిష్ పాలకులు 'విభజించి పాలించు' అనే సిద్ధాంతాన్ని అనుసరించే వారన్నారు. అంతే కాక.. కొన్ని కులాలను రెచ్చగొట్టేవారని, అణగారిన, వెనుకబడ్డ వర్గాల వారిని మరింతగా తొక్కేసేవారని ఆయన గుర్తుచేశారు. అదే సిద్ధాంతాన్ని ఇప్పుడు ఏపీలో విపక్షాలు అనుసరిస్తున్నాయని ఆరోపించారు. స్వాతంత్రానికి ముందు అది చెల్లింది కానీ ఇప్పుడు చెల్లదన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్‌ను అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో)ను విజయసాయిరెడ్డి ప్రశంసించారు. రాష్ట్ర విభజన తరువాత ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరిగిందని.. 260 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉందన్నారు. ఈ డిమాండ్‌ను వ్యవసాయ అవసరాలతో సహా ఏపీ జెన్‌కో సునాయాసంగా అందించగలుగుతుండడం అభినందనీయమన్నారు.వరుసగా రెండోరోజు మంగళవారం కూడా పెద్దఎత్తున వినతులను విజయసాయిరెడ్డి స్వీకరించి కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కరించారు. .

విశాఖలో మాఫియాపై కేంద్రం దృష్టి పెట్టాలి

కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీపీఐ నారాయణ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖలో మాఫియాపై తక్షణమే దృష్టి సారించాలని సీపీఐ కార్యదర్శి కె. నారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ వివిధ రకాల మాఫియాకు, సంఘ వ్యతిరేక శక్తులకు అడ్డాగా మారిందని అమిత్ షా చెప్పారని, ఆయన వచ్చి వెళ్లిన మూడు రోజులకే వైఎస్సార్‌సీపీ ఎంపీ సత్యనారాయణ ఇంట్లో కుటుంబ సభ్యుల కిడ్నాప్ జరిగిందన్నారు. ఎంపీ అనేక భూకుంభకోణాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. మంగళవారం ఢిల్లీలోని ఏపీభవన్‌లో నారాయణ మీడియాతో మాట్లాడుతూ..ఈ వ్యవహారాన్ని తేలిగ్గా తీసుకోకూడదని, కేంద్ర హోంశాఖ కేంద్ర దర్యాప్తు సంస్థలతో దర్యాప్తు జరిపించాలని కోరారు.

ఏపీ అంటే అరాచకప్రదేశ్

ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ అంటే ఒక్కప్పుడు అన్నపూర్ణ రాష్ట్రం అనేవారని, అదికాస్తా ఇప్పుడు అరాచక ప్రదేశ్‌గా మారిపోయిందని ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబాన్ని దుండగులు బెదిరించి కోట్ల రూపాయలు వసూలు చేశారని, ఇది వందల కోట్ల రూపాయల భూముల అంశమని అన్నారు. విశాఖ ఎంపీ నివాసంలో జరిగిన ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలోని ఏపీభవన్‌లో భానుప్రకాశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో రికార్డ్స్ ప్రకారం అత్యధికంగా గంజాయి స్మగ్లింగ్ అవుతున్న రాష్ట్రం ఏపీ అని వెల్లడైందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏ విధంగా ఉన్నాయో ముఖ్యమంత్రి పర్యవేక్షించాలని భానుప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

కళ్లుండీ కబోదిలా

భూసారానికి ఢోకా లేదు.. జోరుగా మట్టి నమూనా పరీక్షలు

- ఆర్బీకే స్థాయిలో ప్రతి రైతుకు సాయిల్ హెల్త్ కార్డు
- 2019–20లో 2.26 లక్షల నమూనాల సేకరణ, విశ్లేషణ
- కరోనా నేపథ్యంలో రెండేళ్ల పాటు దేశవ్యాప్తంగా నిలిపివేత
- 2023–24లో 6.37 లక్షల నమూనాలు సేకరించాలని లక్ష్యం
- ఇప్పటికే 2.60 లక్షల నమూనాల సేకరణ, విశ్లేషణ
- మట్టినమూనా విశ్లేషణలో అత్యాధునిక సాంకేతికత
- మొబైల్ ద్వారా రైతులకు ఫలితాల సమాచారం
- పారదర్శకంగా భూసార పరీక్షలు
- నిర్వహిస్తున్నా ఈనాడు బురద రాతలు

సాక్షి, అమరావతి

తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సామూహిక భూసార పరీక్షలు నిర్వహిస్తోంది. ఆర్బీకే స్థాయిలో మట్టి నమూనాలను తీసుకుంటూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో కచ్చితమైన ఫలితాలు వచ్చేలా పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాటి ఫలితాలను నేరుగా రైతుల మొబైల్‌కు పంపిస్తున్నారు. మరోవైపు ప్రతి రైతుకు భూసార కార్డు జారీకి శ్రీకారంచుట్టారు. కళ్లెదుట ఈ వాస్తవాలు కనిపిస్తున్నప్పటికీ కళ్లుండీ కబోదిలా తయారైన రామోజీ వాస్తవాలకు ముసుగేసి బురద రాతలతో ప్రభుత్వంపై తన అక్కసును వెళ్లగక్కుతున్నాడు.

ఆరోపణ: గతంలో పెద్ద ఎత్తున పరీక్షలు..

వాస్తవం: భూసార పరీక్షలు పూర్వం గ్రిడ్ పద్ధతిలో జరిగేవి. 25 ఎకరాల విస్తీర్ణానికో మట్టి నమూనా తీసుకుని దాన్ని విశ్లేషించి గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరికి అదే ఫలితాలతో కూడిన కార్డులిచ్చేవారు. ఇలా సేకరించిన మట్టి నమూనాలతో సంబంధం లేకుండా అశాస్త్రీయ పద్ధతుల్లో ఇష్టానుసారం కార్డులు జారీచేశారు. వీటివల్ల తమకు ఎలాంటి ప్రయోజనం లేదని రైతులు వాపోయేవారు. తమ పొలాల్లో మట్టినమూనాలు సేకరించి విశ్లేషిస్తే.. ఎలాంటి లోపాలున్నాయో తెలుస్తుందిగానీ, గ్రామంలో ఏదో ఒక మూల నమూనా తీసి విశ్లేషిస్తే ప్రయోజనమేమిటంటూ ఆందోళన చెందేవారు. ఈ విధానంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసేవారు.

ఆరోపణ: మూడేళ్లుగా భూసార పరీక్షలు అటకెక్కించేశారు

వాస్తవం: 25 ఎకరాలకు ఒక నమూనా సేకరణపై రైతుల నుంచి వచ్చిన వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకుని 2.5 ఎకరాలకు ఒక మట్టి నమూనా తీసుకొని శాస్త్రీయంగా విశ్లేషించాలని కేంద్రం స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఆ మేరకు 2019–20లో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని పైలెట్ ప్రాజెక్టుగా మట్టి నమూనాల పరీక్షలకు శ్రీకారం చుట్టారు. ఆ ఏడాది ఏకంగా 2.26 లక్షల మట్టినమూనాలను సేకరించి శాస్త్రీయ పద్ధతుల్లో విశ్లేషించి ఫలితాలను రైతులకు తెలియజేశారు. తదనుగుణంగా సూక్ష్మపోషకాలు అందించారు. పైలెట్ ప్రాజెక్టులో మెరుగైన ఫలితాలు రావడంతో 2020–21లో సామూహికంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇంతలో కోవిడ్ మహమ్మారి విరుచుకుపడడంతో రెండేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వాదేశాల మేరకు భూసార పరీక్షలు నిర్వహించే అవకాశం లేకుండా పోయింది.

ఆరోపణ: పరికరాలు, సిబ్బంది కొరత..

వాస్తవం: కేంద్ర ప్రభుత్వం జారీచేసిన నిబంధనల మేరకు 2023–24లో ప్రతి గ్రామంలో ప్రతి రైతుక్షేత్రంలో మట్టినమూనాలు సేకరించి, విశ్లేషించడమే కాకుండా.. ప్రతి రైతుకు భూసార కార్డు జారీచేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. రైతులను భాగస్వాములను చేస్తూ మూడేళ్లలో 25 లక్షల నమూనాలు పరీక్షించి 25 లక్షల మందికి భూసార



మట్టి నమూనాలు విశ్లేషిస్తున్న దృశ్యం

కార్డుల జారీ లక్ష్యంతో సామూహిక భూసార పరీక్షలకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను కూడా అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఉన్న భూసార పరీక్ష కేంద్రాలను ఆధునీకరించారు. అవసరమైన పరికరాలను సమకూర్చారు. సిబ్బందిని నియమించారు.

ఆరోపణ: సాగు మొదలయ్యాక నమూనాల సేకరణ?

వాస్తవం: 2023–24 సీజన్‌లో రూ.19.82 కోట్ల అంచనా వ్యయంతో 6,37,453 మట్టి నమూనాలు విశ్లేషించి రైతులకు భూసార కార్డులివ్వాలని నిర్ణయించారు. ఆర్బీకే స్థాయిలో అధికారులకు విడతల వారీగా శిక్షణ కూడా ఇచ్చారు. మట్టి నమూనాల సేకరణ కోసం ఏప్రిల్‌లో భూసార వారోత్సవాలు నిర్వహించారు. ఏప్రిల్, మే నెలల్లో మట్టినమూనాలు సేకరించారు.

ఆరోపణ: అంతా మొక్కుబడిగా..

వాస్తవం: వారోత్సవాల్లో 2.60 లక్షల మట్టి నమూనాలను రైతుల సమక్షంలోనే మొబైల్ యాప్ ద్వారా జియో కో ఆర్డినేట్‌లను పొందుపరిచి మరీ సేకరించారు. క్యూఆర్ కోడ్ టెక్నాలజీని ఉపయోగించి సేకరించిన మట్టి నమూనాల స్థితిని అక్కడికక్కడే తెలుసుకునేలా ఏర్పాటు చేశారు. కచ్చితమైన జియో కో ఆర్డినేట్‌లను నమోదు చేయడం ద్వారా మట్టి నమూనాలు ఎక్కడ నుంచి సేకరించారో రాష్ట్ర మ్యాప్ ద్వారా స్పష్టంగా తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. నేల ఆరోగ్యస్థితిని తెలుసుకునేందుకు వీలుగా సాయిల్ ఫెర్టిలిటీ మ్యాప్‌లను రూపొందించారు. ఫలితాలను మొబైల్ యాప్ ద్వారా రైతులకు అందిస్తున్నారు. జియో కో ఆర్డినేట్స్‌తో రైతుల వారీగా భూసార పరీక్ష ఫలితాలను సాయిల్ హెల్త్ కార్డ్ పోర్టల్‌లో కూడా పొందుపరుస్తున్నారు.

ఆరోపణ: సున్నా నుంచి మొదలు పెట్టాల్సిందే?

వాస్తవం: మట్టి నమూనాలను సేకరించడం అనేది నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక నుంచి ప్రతి సీజన్‌లో ఖరీఫ్–రబీ పంటకాలాలకు ముందు సామూహికంగా మట్టి నమూనాలను సేకరించి భూసార కేంద్రాల్లో విశ్లేషించి కనీసం మూడేళ్లపాటు వర్తించేలా రైతులకు భూసార కార్డులను జారీచేయాలని నిర్ణయించారు. ఈ ఫలితాలు ఆధారంగా.. రసాయనిక ఎరువుల అనవసర, విచక్షణారహిత వినియోగానికి అడ్డుకట్ట వేయడం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించి, నాణ్యమైన పంట దిగుబడి పెంచేలా ఆర్బీకేల ద్వారా అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు.

కుట్రలు, శవ రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు

- అధికారం కోసం క్షుద్ర ఆలోచనలు చేస్తారు
- బాబు చేసేవి డర్టీ పాలిటిక్స్
- అమర్నాథ్ కుటుంబానికి గంటల వ్యవధిలోనే ప్రభుత్వ సహాయం
- నిందితులను గంటల వ్యవధిలోనే అరెస్టు చేశారు
- పవన్ కళ్యాణ్ ఒక తింగరోడు
- మంత్రులు సీదిరి, జోగి, కొట్టు, ఎంపీ మోపిదేవి ధ్వజం

కుట్రలకు, శవ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ ప్రతిపక్ష నేత చంద్రబాబు అని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్, పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ధ్వజమెత్తారు. చంద్రబాబు డర్టీ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. హత్యకు గురైన బాలుడు అమర్నాథ్ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లి ఓట్లు అడుక్కోవడం ఏమిటని నిలదీశారు. శవాలపైన పేలాలు ఏరుకుంటున్నారని నిప్పులు చెరిగారు. అధికారం కోసం క్షుద్ర ఆలోచనలు చేస్తున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఈ మేరకు నలుగురు నేతలు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల వ్యవహార శైలిని దుయ్యబట్టారు. **- సాక్షి, అమరావతి**

అతిపెద్ద సైకో చంద్రబాబు



పవన్ కళ్యాణ్, చంద్రబాబు 'ఈనాడు'లో తయారైన ఒకే స్క్రిప్టును వల్లె వేస్తూ సీఎం వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారు. రేపల్లె నియోజకవర్గంలో వ్యక్తిగత గొడవలతో చోటుచేసుకున్న మరణానికి కూడా సిగ్గుమాలిన రాజకీయం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మహిళలు, బీసీ, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలపై జన్మభూమి కమిటీలు, కాల్ మనీ ముసుగులో సాగించిన దాడులు, దాష్టీకాలను ప్రజలు మరిచిపోలేదు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు ఎప్పటికీ టీడీపీకి ఓటేయరు. ఇప్పుడున్న 23 స్థానాల నుంచి రెండు మూడు సీట్లకే టీడీపీ పరిమితమయ్యే పరిస్థితి వస్తోందనే భయంతో చంద్రబాబు పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారు. పేదల చదువు బాధ్యత ప్రభుత్వానిది కాదు.. చైనా(చైతన్య, నారాయణ)దేనని తప్పుకున్న చంద్రబాబు అతిపెద్ద సైకో. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అధోగతిపాలు చేసిన బాబును మించిన సైకో ఎవరూ ఉండరు. ఆయనకు ఇవే చివరి ఎన్నికలు. 2029 ఎన్నికల్లో కుప్పంను మరొకరికి అప్పగిస్తానని.. ఈ ఒక్కసారి తనను గెలిపించాలని బతిమాలే దుస్థితికి దిగజారారు. సీఎం వైఎస్ జగన్ జిల్లాకు ఒక హార్బర్, నాలుగు పోర్టులు నిర్మిస్తూ.. మత్స్యకార భరోసా, డీజిల్ సబ్సిడీ, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.పది లక్షల పరిహారం అందిస్తూ మత్స్యకారులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. మత్స్యకారులకు ఇది స్వర్ణయుగం. యువకుల కష్టాన్ని, శ్రమను ప్యాకేజీ కోసం చంద్రబాబు వద్ద తాకట్టు పెట్టిన పవన్ పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారు. మత్స్యకారుల సమస్యలపై పవన్‌కు అవగాహనే లేదు. 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఒక్క పోర్టుకు ఒక్క ఇటుక కూడా వేయలేదు. హార్బర్‌లు లేకపోవడం వల్లే మత్స్యకారులు వలస వెళ్తున్నారని గుర్తించిన సీఎం వైఎస్ జగన్.. జిల్లాకో హార్బర్ కడుతున్నారు. మత్స్యకారులను తోలు తీస్తా.. తాటతీస్తానని చంద్రబాబు బెదిరించినప్పుడు నీ నోట్లో లాలీ పాప్ పెట్టుకున్నావా పవన్? నిన్ను, నీ యజమానిని మత్స్యకారులు ఎప్పటికీ నమ్మరు.

– గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

చంద్రబాబుకు మతిభ్రమిస్తోంది..



చంద్రబాబుకు మతిభ్రమిస్తోంది. అమర్నాథ్ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లి అక్కడ శవ రాజకీయం చేశారు. ఎవరైనా ఒక కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లినప్పుడు బాధితుల్ని కలిసి వీలైతే సాయం చేసి ధైర్యం చెబుతారు. కానీ, చంద్రబాబు బాధిత కుటుంబంతో కలిసి సభ నిర్వహించి ఓట్లు అడుక్కున్నారు. ఆయన మాత్రమే ఇలాంటి నీచ రాజకీయం చేస్తారు. అమర్నాథ్ హత్య చాలా బాధాకరం, దురదృష్టకరం. ఎవరి ఇంట్లోనూ ఇలాంటి ఘోరం జరగకూడదు. ఈ ఘటన జరిగిన వెంటనే సీఎం వైఎస్ జగన్ తీవ్రంగా చలించిపోయారు. ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించింది. ఇంతటి కిరాతకానికి పాల్పడిన నలుగురు నిందితుల్ని పోలీసులు కేవలం 24 గంటల్లోనే అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. అసలు ఆడబిడ్డల్లేని బాబుకేం తెలుసు వారి విలువ? ఆయన హయాంలో ఆడబిడ్డల ఆక్రందనలెన్నింటినో రాష్ట్ర ప్రజలు చూశారు. రిషితేశ్వరి ఆత్మ హత్య, తహసీల్దార్ వనజాక్షి కేసుల్లో నేరస్తులకు చంద్రబాబు కొమ్ముకాశారు. కాల్‌మనీ, సెక్స్ రాకెట్‌తో మహిళల జీవితాలతో ఆడుకుంది టీడీపీ నేతలు కాదా? ముద్రగడ రాసిన లేఖను ఆసాంతం చదివితే పవన్‌కళ్యాణ్ హైదరాబాద్ పారిపోవడం ఖాయం. పూటకోమాట మాట్లాడే పిచ్చోడు పవన్.

– గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్

40 ఏళ్లుగా రాష్ట్ర రాజకీయాలకు పట్టిన శని చంద్రబాబు



ఏదో రకంగా అధికారంలోకి రావడం కోసం చంద్రబాబు ప్రశాంతంగా ఉన్న ప్రజల జీవితాల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. అందరి మనసుల్ని విషతుల్యం చేయడానికి అనేక మాయోపాయాలు, అబద్ధపు ప్రచారాలకు తెర దీస్తున్నారు. ఆయన 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని వీటికోసమే వాడుతున్నారు. వీటిపట్ల రాష్ట్ర ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. ఈ మధ్య పిట్టల దొరలా సూపర్ సిక్స్, పీ4 వంటి మాటలు చెబుతున్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నా ఏమీ చేయకుండా, కొత్తగా ఇప్పుడే పార్టీ పెట్టినట్లు బాబు చెబుతున్న మాటలు విని ప్రజలు నవ్వుకుంటున్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా చంద్రబాబు ఓ 650 దాకా హామీలు ఇస్తుంటారు. గత మూడుసార్లు ఎన్నికల్లో ప్రజలకు రెండువేల హామీలిచ్చారు. ఇప్పుడు టీజర్ అంటూ కొత్త హామీలు ఇస్తున్నారు. మరి ఆ రెండువేల హామీల పరిస్థితి ఏంటి? అవన్నీ తూచ్ అన్నట్టేనా? చంద్రబాబు మేనిఫెస్టోలకు అసలు విలువ ఉందా? ఆయనకు అన్ని ఆలోచనలు ఉంటే 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు ఎందుకు చేయలేకపోయారు? నాలుగు దశాబ్దాలుగా రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న శని.. చంద్రబాబు. ఆయన ఏది చెబితే అది మాట్లాడుతున్న పవన్ ఒక తింగరోడు, పిచ్చి మాలోకం. పవన్ చేష్టల ద్వారా తమ సామాజికవర్గం ఉనికికే ప్రమాదం ఉందని కాపులు భావిస్తున్నారు. ఆయనకు ఏమైనా జరిగితే చంద్రబాబు వల్లే.

– రాష్ట్ర సచివాలయంలో మీడియాతో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

నీచ రాజకీయాలకు నిలయం.. కరకట్ట గెస్ట్‌హౌస్



కృష్ణా నది కరకట్టన చంద్రబాబు ఆక్రమించుకున్న గెస్ట్‌హౌస్ నీచ రాజకీయాలకు నిలయంగా మారింది. అమర్‌నాథ్ హత్య జరిగితే పరామర్శించడానికి వచ్చిన చంద్రబాబు కుల తగాదాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం ఏమిటి? బాధిత కుటుంబానికి ప్రభుత్వం సాయం అందించినా నోటికొచ్చినట్టు అవాకులు చెవాకులు పేలడం మంచి పద్ధతి కాదు. చంద్రబాబు ఖాళీగా ఉన్నారు.. ఎవరు పిలుస్తారా.. ఎక్కడకు వెళ్లి ఎవరి నెత్తిన బట్టకాల్చి వేద్దామా అని సిద్ధంగా ఉన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కుట్రలు, కుతంత్రాలకు కరకట్ట గెస్ట్ హౌస్‌ను నిలయంగా మార్చేశారు. అక్కడి నుంచే అన్ని ప్రాంతాలకు సిగ్నల్స్ పంపిస్తున్నారు. అమర్నాథ్ హత్య కులాలకు, మతాలకు సంబంధం లేని ఘటన. 24 గంటలు గడవకముందే ఆ కుటుంబాన్ని నేను పరామర్శించాను. అమరన్‌నాథ్ సోదరికి ఉద్యోగం, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం, ఇంటి స్థలం, ఇల్లు కావాలని బాధిత కుటుంబం కోరితే ప్రభుత్వం వాటన్నింటినీ నెరవేర్చింది. సీఎం వైఎస్ జగన్ ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం, ఇంటిస్థలం, ఇల్లు, అంగన్‌వాడీ ఉద్యోగం ఇచ్చారు. మేము ఇంత చేసినా మృతదేహంతో టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ శవ రాజకీయం చేయడం సిగ్గుచేటు. చంద్రబాబు హయాంలో ఎన్నో ఘటనలు జరిగాయి.. ఏ ఒక్క కేసులోనైనా ఆయన సత్వరం స్పందించారా?.. నిందితులకు ఒక్కరికైనా శిక్షలు వేయించిన దాఖలాలు ఉన్నాయా? పవన్ కళ్యాణ్‌లా ప్యాకేజీ సొమ్ము నా దగ్గర లేదు. అందుకే అమర్నాథ్ కుటుంబానికి నా కష్టార్జితం రూ.లక్ష ఇచ్చాను. చంద్రబాబు స్క్రిప్ట్ చదవడం తప్ప మత్స్యకారులపై పవన్‌కు అవగాహన లేదు.

– గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

'స్పందన' ఫిర్యాదుతో అక్రమ మైనింగ్ బట్టబయలు

నెల్లూరు జిల్లాలో భారీగా రోడ్డు మెటల్ అక్రమ తవ్వకాలు

- లీజు భూమిలో క్రషర్ యూనిట్, పెట్రోల్ బంకులు, క్వార్టర్ల నిర్మాణం
- లీజు గడువు ముగిసిన చుట్టు పక్కల ఇతరుల క్వారీల్లోనూ యథేచ్ఛగా తవ్వకాలు
- దాదాపు 12 లక్షల క్యూబిక్ మీటర్ల రోడ్డు మెటల్ తవ్వినట్లు నిర్ధారణ
- రాఘవేంద్ర, గురు రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ నిర్వాకాలు వెలుగులోకి



నెల్లూరు జిల్లా జలదంకి మండలంలో అక్రమంగా తవ్వకాలు జరిపిన ప్రాంతం

సాక్షి, అమరావతి: స్పందనలో అందిన ఫిర్యాదు ఆధారంగా నిర్వహించిన తనిఖీల్లో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో రూ.వందల కోట్ల విలువైన అక్రమ మైనింగ్ వ్యవహారం బట్టబయలైంది. రోడ్డు మెటల్ తవ్వకాల కోసం లీజుకున్న తీసుకున్న భూమిలో స్టోన్ క్రషర్, వే బ్రిడ్జిలు, క్వార్టర్లు నిర్మించడంతోపాటు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశారు. ఒక్క టన్ను మెటల్ తవ్వకున్నా తవ్వినట్లుగా స్థానిక మైనింగ్ అధికారులు పర్మిట్లు జారీ చేసేశారు. చుట్టుపక్కల గడువు ముగిసిన లీజు ప్రాంతాల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరిపారు. రాఘవేంద్ర, గురు రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ దాదాపు 12 లక్షల క్యూబిక్ మీటర్ల రోడ్ మెటల్‌ను అక్రమంగా తవ్వి భారీగా సొమ్ము చేసుకున్నట్లు తేలింది. వీటి విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.200 కోట్లు కాగా మార్కెట్ విలువ రూ.600 కోట్లకు పైమాటే ఉంది.

ప్రత్యేక బృందం తనిఖీలు

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి మండలం గట్టుపల్లి, అన్నవరంలో రోడ్డు మెటల్ తవ్వకాలు అక్రమంగా జరుగుతున్నట్లు గత నెలలో కలెక్టరేట్‌కు స్పందన ద్వారా ఫిర్యాదు అందింది. స్థానికంగా రెండు గ్రామాల్లో తవ్వకాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో నిగ్గు తేల్చేందుకు మైనింగ్ శాఖాధికారులు ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణప్రసాద్, శివపార్వతి, గోవిందరావు, షేక్ అబ్దుల్లా సభ్యులుగా మైనింగ్ శాఖ ఒక ప్రత్యేక బృందాన్ని నియమించింది. వారం రోజులపాటు విస్తృతంగా తనిఖీలు జరిపిన బృందం అక్రమాలు నిజమేనని తేల్చింది. ఈమేరకు మైనింగ్ శాఖ డైరెక్టర్‌కు నివేదిక సమర్పించింది.

- జలదంకి మండలం గట్టుపల్లిలో సర్వే నెంబర్ 10, 15లో గురు రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్‌కు 9.8 ఎకరాలను రోడ్ మెటల్ తవ్వకాల కోసం 2008లో మైనింగ్ శాఖ లీజుకిచ్చింది. అయితే ఆ భూమిలో తవ్వకాలు జరపకుండా స్టోన్ క్రషర్ యూనిట్ ఏర్పాటు చేశారు. పెట్రోల్ బంకులు, వే బ్రిడ్జిలు, సర్వెంట్ క్వార్టర్లను నిర్మించారు. ఒక్క టన్ను ఖనిజం తవ్వకపోయినా మైనింగ్ అధికారులు 28 వేల క్యూబిక్ మీటర్ల రోడ్ మెటల్‌ను తవ్వినట్లు పర్మిట్లు జారీ చేయడం గమనార్హం. ఇతర ప్రాంతాల్లో తవ్విన ఖనిజం కోసం ఈ పర్మిట్లు ఉపయోగించారు. లీజు ప్రాంతాన్ని పూర్తిగా దుర్వినియోగం చేసినట్లు స్పష్టమైంది. వేరే చోట తవ్విన 700 క్యూబిక్ మీటర్ల కుపైగా రోడ్ మెటల్‌ను అక్కడ నిల్వ చేశారు.
- జలదంకి మండలం అన్నవరం గ్రామం 851 సర్వే నెంబర్‌లో రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ లీజు గడువు ముగిసిపోయినా తవ్వకాలు నిర్వహిస్తోంది. అక్కడ సుమారు 5 లక్షలకుపైగా క్యూబిక్ మీటర్ల రోడ్డు మెటల్‌ను అక్రమంగా తవ్వినట్లు తేల్చారు. అదే గ్రామంలో కొండారెడ్డి, సుగుణమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి పేర్లతో గతంలో పలు రోడ్డు మెటల్ లీజులున్నాయి. వాటి లీజు గడువు ఎప్పుడో ముగిసిపోయింది. అయితే వాటిలో పాగా వేసిన గురు రాఘవేంద్ర కంపెనీ అందులో కూడా యథేచ్ఛగా తవ్వకాలు జరిపింది. సుమారు 7 లక్షల క్యూబిక్ మీటర్ల రోడ్ మెటల్‌ను తవ్వినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. మొత్తం 12 లక్షల క్యూబిక్ మీటర్ల మేర అక్రమ తవ్వకాలు జరిపినట్లు తేలింది. అన్నవరంలో అక్రమంగా తవ్విన రోడ్డు మెటల్‌ను గట్టుపల్లిలో ఏర్పాటు చేసిన క్రషర్‌కి తరలించి విక్రయించారు. ఈ అక్రమ తవ్వకాల మొత్తం విలువ రూ.140 కోట్లుగా తనిఖీ బృందం నివేదిక సమర్పించింది. అయితే స్టోన్ క్రషింగ్ యూనిట్‌ను తాము పెద్దగా వినియోగించలేదని రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ యాజమాన్యం వాదించింది. దీంతో ట్రాన్స్‌కో నుంచి విద్యుత్తు వినియోగం లెక్కలు సేకరించగా 89 లక్షల యూనిట్లు వాడినట్లు తేలింది. ఒక టన్ను ఖనిజం ఉత్పత్తికి 2.5 యూనిట్లు వినియోగం అవుతుంది. ఈ లెక్కన రూ.200 కోట్ల మేర ఆ యూనిట్‌లో రోడ్డు మెటల్‌ను ప్రాసెస్ చేసినట్లు తేలింది. రాఘవేంద్ర, గురు రాఘవేంద్ర స్టోన్ క్రషర్స్ సంస్థలు అక్రమ తవ్వకాలు నిర్వహించినట్లు స్థానిక రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు స్టేట్‌మెంట్లు ఇచ్చారు.

రాజకీయ ప్రయోజనాల కోసమే పోలీసులపై ఆరోపణ

- 24 గంటల్లోనే నిందితుల అరెస్ట్
- వ్యక్తిగత వివాదం కారణంగానే హత్య
- అమర్‌నాథ్ మృతిపై వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్ల టౌన్: అమర్‌నాథ్ మృతి ఘటనలో కొందరు నేతలు రాజకీయ ప్రయోజనాల కోసమే పోలీసులపై ఆరోపణలు చేస్తున్నారని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. 'చెరుకుపల్లి మండలం, రాజవోలు గ్రామంలో విద్యార్థి అమర్‌నాథ్‌పై కొందరు వ్యక్తులు పెట్రోలుపోసి నిప్పంటించిన ఘటన ఉదయం 5.30 సమయంలో జరిగింది. ఘటన విషయం తెలుసుకున్న చెరుకుపల్లి ఎస్‌ఐ 5.45 గంటలకు చెరుకుపల్లిలోని గణేష్ హాస్పిటల్‌కు చేరుకున్నారు. మెరుగైన చికిత్స కోసం క్షతగాత్రుడిని గుంటూరు తరలించిన రేపల్లె రూరల్ సీఐ, చెరుకుపల్లి ఎస్‌ఐ మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా జీజీహెచ్‌లోనే ఉండి చూసుకున్నారు.అనంతరం ఉదయం 9.30గంటలకు చెరుకుపల్లి ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం సేకరించిన ఆధారాలు, క్షతగాత్రుడు చెప్పిన కొంతమంది పేర్లను పరిగణనలోకి తీసుకుని కేసు నమోదుచేసిన 24 గంటలు గడవక ముందే నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు' అని ఎస్పీ వివరించారు. నిందితులు గంజాయి మత్తులో ఉండి నేరం చేశారని కొంతమంది రాజకీయనేతలు చేస్తున్న ఆరోపణల్లో నిజంలేదని, రెండు కుటుంబాల మధ్య గతంలో ఉన్న వ్యక్తిగత వివాదం కారణంగానే జరిగిందని చెప్పారు. రాజకీయ నేతలు వారి వ్యక్తిగత ప్రయోజనాల కోసం పోలీస్‌శాఖపై బురదజల్లే ప్రయత్నం చేయవద్దని ఎస్పీ హితవు పలికారు.

విద్యార్థి అమర్‌నాథ్ హత్య అమానుషం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



చెరుకుపల్లి: విద్యార్థి అమర్‌నాథ్ హత్య అమానుషమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. బాపట్ల జిల్లా ఉప్పాలవారిపాలెంలో మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అమర్‌నాథ్ హత్యను రాష్ట్ర డీజీపీ ప్రత్యేక కేసుగా పరిగణించి ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించి నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోదరిని అల్లరి చేస్తున్నారని ప్రశ్నించినందుకు అమర్‌నాథ్‌పై పెట్రోలు పోసి పథకం ప్రకారం హత్య చేయడం అమానుషమన్నారు. తొలుత అమర్‌నాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి రూ.లక్ష అందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీఎల్ మోహన్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ మాణిక్యాల రావు, నాయకులు కృష్ణచైతన్య, గుమ్మడి శ్రీనివాసరావు, ఉంద్రకొడ శివరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, అమర్‌నాథ్ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోపిదేవి శ్రీనివాసరావులు పరామర్శించారు. అలాగే ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి, ఉపాధ్యక్షురాలు శ్రీనివాసకుమారి పరామర్శించారు. ఇదిలా ఉండగా, బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్ పేరుతో చీరాలలో నిర్వహించిన బహిరంగ సభలో సోము వీర్రాజు మాట్లాడుతూ చంద్రబాబు, ప్రస్తుత సీఎం జగన్, పవన్‌కళ్యాణ్, కమ్యూనిస్టులు అందరూ ఒక తానులోని ముక్కలేనని విమర్శించారు.

✻ యోగా డే

యోగా... కొత్త కొత్తగా

● ఇది ఇన్‌ఫ్లుయెన్సర్ల కథ

యోగా నిపుణులు, సాధకులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు సోషల్ మీడియాలో తమ ఉనికిని కొత్తగా చాటుతున్నారు. వారి నిజాయితీ, స్ఫూర్తిదాయకమైన వారి మాటలు, ఉత్సాహం ఆకర్షణీయంగా మార్చే సుగుణాన్ని కళ్లకు కడుతున్నాయి. యోగా ఆరోగ్యాన్ని, ఫిట్‌నెస్‌ను రెండింటినీ అద్భుతంగా మారుస్తుంది. రోజువారి జీవనంలో యోగా ఒక భాగం అవడానికి ఇన్‌ఫ్లుయెన్సర్లు మరిన్ని హంగులు అద్దుతున్నారు. శాస్త్రీయ యోగాభ్యాసం ద్వారా వేగవంతమైన ఆధునిక యుగానికి తమను తాము గొప్ప స్ఫూర్తిగా మార్చుకుంటున్నారు. సెలబ్రిటీల నుంచి ఎంతోమంది మహిళలు యోగా పాఠాలు చెబుతూ సోషల్ మీడియాలో కనిపిస్తారు. వారి నుంచి ఎంతో ప్రేరణను పొందవచ్చు. ఈ రోజు నుంచే యోగాను దైనందిన జీవనంలో భాగం చేసుకోవచ్చు.

ప్రపంచస్థాయి ప్రభావం శిల్పా శెట్టి



భారతదేశంలో అత్యంత ప్రభావ వంతమైన ఫిట్‌నెస్ ఐకాన్స్, యోగా ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఒకరుగా నిలిచింది శిల్ప. ఐదుపదులకు చేరువలో ఉన్న శిల్ప యోగా కోసం చాలా కాలం శిక్షణ పొందారు. తీరైన శరీరాకృతిని పొందడానికి, దైనందిన జీవనంలో వ్యాయామాన్ని చేర్చడానికి ఫిట్‌నెస్ ఫిల్మ్‌లు రూపొందించింది. యోగాకు సంబంధించిన డీవీడీలను కూడా రిలీజ్ చేసింది. కొన్ని జీవన శైలి మార్పులు మనలో ఎలాంటి పెద్ద మార్పులను తీసుకువస్తాయో చూపించడానికి సోషల్‌మీడియాను ఉపయోగిస్తుంది. ఆమె యూ ట్యూబ్ ఛానెల్‌కి 3 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ప్రపంచ స్థాయిలో భారతీయ యోగాను ప్రోత్సహించడంలో శిల్ప చేసిన కృషి అంతా ఇంతా కాదు. ఆమె వ్యాయామం చేసే విధానం, తీసుకునే ఆరోగ్యకరమైన ఆహారం గృహిణులకు స్ఫూర్తినిస్తుంది.

యోగా సౌందర్యం దీపికా మెహతా



రోజును యోగాసనాలతో కొత్తగా ప్రారంభించాలనే ఆలోచనను దీపికా మెహతా కళ్లకు కడుతుంది. ఆమె యూ ట్యూబ్ ఛానెల్ ద్వారా యోగా లో కళా దృష్టి ఉంటుందని చూపుతుంది. 'రెండు దశాబ్దాల క్రితం మరణం అనుభవాన్ని చవి చూశానని, యోగా పునర్జీవితాన్ని ఇచ్చింద'ని చెబుతుంది. రాక్ క్లైంబింగ్ ప్రమాదం తర్వాత ఆమె ఇకపై నడవలేదని వైద్యులు అంచనా వేశారు. యోగా ట్రైనర్, అష్టాంగ యోగా స్పెషలిస్ట్ అయిన దీపికా యూ ట్యూబ్ ఛానెల్ కి దాదాపు 4 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె చూపే యోగా ప్రతిభ ఎంతోమందిని ఆశ్చర్యపరుస్తాయి. ఎంతోమంది బాలీవుడ్ సెలబ్రిటీలకు యోగా గురూగా మారింది.

లోపాలను సరిదిద్దుతూ... సునయన రేఖీ



యోగా హెల్త్ అండ్ లైఫ్ స్టైల్ కోచ్‌గా సునైనా రేఖీ తనను తాను కొత్తగా ఎప్పుడూ పరిచయం చేసుకుంటూనే ఉంటుంది. భారతదేశంలోని అత్యంత పేరొందిన యోగా ట్రైనర్లలలో సునయన ఒకరు. రిషీకేశ్‌లో యోగా సాధన చేసిన సునయన ఇప్పుడు ముంబైలోని అనేక ప్రసిద్ధ యోగా స్టూడియోలలో నిపుణురాలిగా శిక్షణ ఇస్తోంది. సాధనకు బలమైన పునాదిని ఏర్పరచడానికి, గాయాలను మాన్పడానికి నిపుణులైన పర్యవేక్షణ అవసరమని సునయన వీడియోలు నిరూపిస్తాయి. యోగా సాధనలో చిన్న చిన్న లోపాలు ఎలాంటి వ్యతిరేక ఫలితాలు ఇస్తాయో కూడా వివరిస్తుంది. మనస్సు, శరీరం, ఆత్మపై యోగా వల్ల కలిగే మంచి ప్రయోజనాల గురించి వివరిస్తుంది.



నిరాశకు దూరం నటాషా



నృత్యకారిణి, ఫొటోగ్రాఫర్, యోగా సాధకురాలు నటాషా నోయల్. యూ ట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ నుంచే కాదు సోల్‌ఫుల్ హ్యాపీనెస్ బ్లాగ్ ద్వారా తన యోగానుభవాలను తెలియజేస్తుంది. మాట్లాడుతుంది. తత్వశాస్త్రాన్ని సాధన చేసే నటాషా 'మీ మానసిక దృఢత్వమే మీ లక్ష్యం. మిగతావన్నీ అప్రధానం' అని చెబుతుంది. తన బాల్యంలో జరిగిన విషాదకర సంఘటనల నుంచి తేరుకొని, కొత్త జీవితాన్ని మొదలుపెట్టింది. కండరాల బలాన్ని పునర్నిర్మించే ప్రయత్నంలో ఆమె యోగా సాధకురాలిగా మారింది. ఆమె యూ ట్యూబ్ ఛానెల్‌కు సుమారు ఏడు లక్షల ముప్పై వేల మంది సభ్యులు ఉన్నారు. నిరాశ, ఆందోళన, బాడీ షేమింగ్ గురించి చర్చించడానికి ఆమె తన సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగిస్తుంది. యోగా ద్వారా సెల్ఫ్ గ్రోత్, చికిత్స గురించి మరీ మరీ చెబుతుంది. ప్రతి రోజూ మరింత బలంగా మారడానికి ప్రయత్నిస్తూనే ఉండాలని సూచనలు ఇస్తుంది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా కష్టపడి పని చేయడం వల్ల ఎలాంటి ఫలితాలు వస్తాయో అందుకు తనే ఉదాహరణగా చూపుతుంది.

యోగాసిని రాధికా బోస్

అనేక పేరొందిన కంపెనీలతో కలిసి పనిచేసిన అనుభవం రాధికా బోస్‌కు ఉంది. అయితే, ఆమె తన ఆరోగ్యకరమైన జీవనాన్ని సూచించడానికి మాత్రం సోషల్‌మీడియానే ప్రధాన వేదికగా ఎంచుకుంటుంది. రాధిక సూచించే అంశాలు ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంటాయి. ప్రతిష్ఠాత్మకమైన మ్యాగజైన్‌లలో ఆమె యోగసాధన గురించి ప్రచురించాయి. 'మీడియా, ప్రకటనలలో గ్లాస్ సీలింగ్‌ను ఛేదించడానికి మహిళలు గొప్ప పురోగతిని సాధించారు. అయితే మనం ఇంకా పితృస్వామ్యంలో జీవిస్తున్నాం, అన్నింటినీ దాటుకొని చాలా దూరం ప్రయాణించాల్సింది మనమే' అని నమ్మకంగా చెబుతుంది. యోగా, వ్యాయామ జీవనశైలితో పాటు ఇతర ఆరోగ్య మార్గదర్శకాలను అందిస్తుంది. 9 సంవత్సరాలుగా యోగా సాధన చేస్తూ, నిపుణురాలిగా తన ప్రతిభను చాటుతోంది.

కొమ్మకొమ్మకో కోయిల

**ఎండలు మండితే పాటలు ఓదార్పు.
తొలకరి కురిస్తే పాటలు కాఫీకి తోడు.
చలి చక్కిలిగిలి పెడితే పాటే కదా వెచ్చటి రగ్గు.
సంగీతమూ సినిమా పాట లేకుండా జీవితం సాగేది ఎలా.
నేడు వరల్డ్ మ్యూజిక్ డే.
రావు బాల సరస్వతి, పి.లీల, జిక్కి,
భానుమతి రామకృష్ణ, పి.సుశీల, ఎస్.జానకి,
ఎల్.ఆర్.ఈశ్వరి, వాణి జయరాం, శైలజ, చిత్ర...
వీరంతా మన సినీ కోయిలలుగా
మన జీవన సందర్భాలను సంగీతమయం చేశారు.
నేడు వీరి పాటలను తలుచుకోవడం మన విధి.
వీరికి చేరేలా కృతజ్ఞత ప్రకటించడం మన సంతోషం.**

టాప్ 10 నేడు వరల్డ్ మ్యూజిక్ డే


రావు బాలసరస్వతి


ఎస్.జానకి


పి. లీల


ఎల్.ఆర్.ఈశ్వరి


జిక్కి


వాణీజయరామ్


భానుమతి


ఎస్.పి.శైలజ


సుశీల


చిత్ర

*తానే మారెనా గుణమ్మే మారెనా
దారీ తెన్నూ లేనే లేక ఈ తీరాయెనా...*

రావు బాలసరస్వతి గొంతు మంచురాలిన దారిలో హంస నడకలా ఉంటుంది. నటీనటులే పాటలు పాడుకోవాలి అనుకునే రోజుల్లో ఆమె దాదాపుగా మన తొలి ఫిమేల్ ప్లేబ్యాక్ సింగర్. సాలూరి రాజేశ్వరరావు సంగీతంలో ఆమె పాటలు రెక్కలు విప్పాయి. సువాసనలు చిమ్మాయి. ఆమె తన సినిమా కెరీర్‌ను కొనసాగించి ఉంటే లతా అంతటి గాయనిగా గుర్తింపు పొందేది. ఆమె మనకు పంచిన అమృతం తక్కువ. కాని దాని రుచి ఎంతో మక్కువ.

*తెల్లవార వచ్చె తెలియక నాసామీ
మళ్లీ పరుండేవు లేరా...*

అప్రయత్నంగా వీచే గాలిలా, అనాయాసంగా తాకే 'మలయ'మారుతంలా ఉంటుంది పి.లీల గొంతు. తెలుగు ఆమె మాతృభాష కాదు. కాని ప్రతి తెలుగు గృహిణి నాలుక మీద ఆమె పాట చర్విత చరణం అయ్యింది.'నడిచేయకోగాలి నడి చేయబోకే', 'ఓహో మేఘమాల.. నీలాల మేఘ మాల', 'కలనైనా నీ వలపే... కలవరమందైన నీ తలపే'... పి.లీల సంగీతలీల అద్భుతం.

*ఏరువాక సాగాలో రన్నో చిన్నన్న
నీ కష్టమంతా తీరెనులో రన్నో చిన్నన్న*

తెలుగు పాటల్లో తన ఏరువాకతో కొత్త నారును వేసి సమృద్ధికర పైరును శ్రోతలకు అందించిన గాయని జిక్కి. పిట్ట కొంచమే. కూత పది వర్ణాల పింఛమే. అల్లరి పాటైనా ఆర్ద్ర గీతమైనా జిక్కి చేత చిక్కిందంటే హిట్. 'ఛాంగురే బంగారు రాజా', 'పులకించని మది పులకించు'... ఆమెకు శ్రీలంకలో కూడా ఫ్యాన్స్ ఉండేవారు. అందమైన పాటలు పాడి 'జీవితమే సఫలము' చేసుకున్న ప్రియమైన గాయని జిక్కి.

*ఓహోహోహో పావురమా
ఓ... ఓహోహో పావురమా
వెర్రిపేలే పావురమా
ఓహోహో ఓహో పావురమా*

ఈ పావురం డేగల్ని కూడా వేటాడగలదు. భానుమతి రామకృష్ణ సకల కళావల్లభురాలు. నాటి తెలుగు మహిళలకు పెద్ద ధైర్యం. ఇండస్ట్రీలో గొప్ప తెగువ. అలాంటి గొంతు, ఆ పాట తీరు రిపీట్ కాలేవు. కాబోవు. 'ఎందుకే నీకింత తొందర', 'నేనే రాధనోయి', 'సావిరహే తవదీన'... ఎన్ని పాటలని. ఇక 'మల్లీశ్వరి' ఆమె ప్రతి పాట గండుమల్లె, రెక్కమల్లె. 'మనసున మల్లెల మాలలూగెనే'..

*ముత్యమంతా పసుపు ముఖమెంతో ఛాయ
ముత్తయిదు కుంకుమ బతుకంతో ఛాయ*

తెలుగు పాటకు వంద సంవత్సరాల ఛాయను తెచ్చింది సుశీల. ఆమె రాకతో నటిని, గాయనిని దృష్టిలో పెట్టుకోకుండా పాటకు అవసరమైన రేంజ్‌తో బాణీ కట్టడం మొదలెట్టారు సంగీత దర్శకులు. సుశీల పాటలో నిష్ఠ ఉంటుంది. క్రమశిక్షణ ఉంటుంది. శ్రేష్ఠమైన ఉచ్చారణ. నూరుశాతం కచ్చితత్వం. 'ఆకులో ఆకునై పూవులో పూవునై', 'జోరుమీదున్నావు తుమ్మెదా', 'ఇది మల్లెల వేళయనీ'... ఈ కెరటాలకు అంతులేదు. ఈ గాన సముద్రానికి ఉప్పదనం లేదు. అమృత సాగరం.

*నీలిమేఘాలలో గాలి కెరటాలలో
నీవు పాడే పాట వినిపించునేవేళా*

నూనె రాసి గట్టిగా బిగించి కట్టిన జడది అందమే. అది సుశీలమ్మ పాటది. తల స్నానం చేసి వదులుగా వదిలిన ముంగురులదీ అందమే. అది జానకమ్మ పాటది. తెలుగు పాట ఊపిరి పీల్చుకోవడానికి తెరిచిన పెద్ద గవాక్షం జానకి. తల్లిదండ్రులను చనువుగా ఒకమాటనగల చిన్న కూతురిలా ఉంటుందామె పాట. సరదా. హుషారు. అద్దంలో ఇమడగల కొండంత ప్రతిభ. 'పగలే వెన్నెల', 'మనసా తుళ్లి పడకే', 'అందమైన లోకమని రంగురంగులున్నాయనీ'... ఇక నాద స్వరం ఎదుట పడగ ఎత్తి నిలిచిన పాట 'నీలీల పాడెద దేవా'...

*మాయదారి సిన్నోడు మనసే లాగేసిండు
మాగమాసం ఎల్లేదాకా మంచి రోజు లేదన్నాడు
ఆగేదెట్టాగ అందాక ఏగేదెట్టాగ*

గజ్జె కట్టి, బిగుతు దుస్తులు ధరించి, స్టేజ్ ఎక్కి జానపద శృంగారం ఒలికించిన పాట ఎల్.ఆర్. ఈశ్వరిది. ఊరంటే గుళ్లు, ఇళ్లు మాత్రమే కాదు.. పొలాలుంటాయి.. మంచెలూ ఉంటాయి. 'మసక మసక చీకటిలో', 'నందామయా గురుడ నందామయా', 'తీస్కో కోకకోలా'... ప్రతి పాటా సంపెంగ పొదలో పూసిన పువ్వు.

అది మగాళ్లని 'బలేబలే మగాడివోయ్' చేసింది.

*విధి చేయు వింతలన్నీ మతిలేని చేతలేనని
విరహాన వేగిపోయి విలపించే కథలు ఎన్నో*

వాణి జయరామ్‌ది పక్కింట్లో నుంచి వినిపించే పరిచిత గీతంలా ఉంటుంది. అదే సమయంలో దానికో వ్యక్తిత్వం ఉంటుంది. వాణి జయరామ్ పాటల మీద జోకులేయలేం. గౌరవించడం ప్రేమించడం తప్ప. 'పూజలు సేయ పూలు తెచ్చాను', 'నేనా పాడనా పాట... మీరా అన్నదా మాట', 'ఎన్నెన్నో జన్మల బంధం నీది నాదీ'... అద్భుతం.

*లాలు దర్వాజ్ లష్కర్ బోనాల్‌కొస్తనని రాకపోతివి
లక్డీకాపూలు పోరికి రబ్బరు గాజులు
తెస్తనని తేకపోతివి*

ఎస్.పి.శైలజ పాటను ఒక పల్లవి ఒక చరణం వరకే అనుమతించింది తెలుగు పరిశ్రమ. ప్రతిసారి మైక్ అందలేదు. అందినప్పుడు ఆమె గొంతులో అందం దాగలేదు. 'మాటే మంత్రము', 'నాంపల్లి టేషన్‌కాడి', 'కొబ్బరినీళ్ల జలకాలాడి'... ఆమె పాట, మాట రెండూ మృదురమే.

*రానేల వసంతాలె శృతి కానెల సరాగాలే
నీవే జీవన రాగం... స్వరాల బంధం*

చిత్ర రాకతో మళ్లీ తెలుగు పాటకు టీనేజ్ వచ్చింది. కొత్త తరానికి పాటను అందించింది చిత్ర. కాలేజీకెళ్లే అమ్మాయిలు 'తెలుసా మనసా' అని... 'కన్నానులే కలలు' అని... 'ఎన్నెన్నో అందాలు' అని పాడుకున్నారు. 'మనసున ఉన్నది చెప్పాలనున్నది' అని కూనిరాగం తీసుకున్నారు.

మన గాయనులు మనకు బుట్టల కొద్ది పాటలు పంచినందుకు కృతజ్ఞతలు. ●

'సిలికాన్ వ్యాలీ ట్రెండ్'గా పేరున్న 'డోపమైన్ ఫాస్టింగ్' సాంకేతిక నిపుణులకే పరిమితం కాలేదు. యువతరానికి దగ్గర అవుతోంది. డిజిటల్ ప్రపంచంలో హద్దులు దాటుతున్న 'ప్లెజర్ కెమికల్'కు నియంత్రణ విధించడానికి 'డోపమైన్ ఫాస్టింగ్' అనేది ఒక మార్గం అయింది...



మలైకా అరోరా

మోస్ట్ పవర్‌ఫుల్ బ్రేక్!

చెన్నైకి చెందిన ఇరవై రెండు సంవత్సరాల రుచిత తన ఫ్రెండ్ ద్వారా 'డోపమైన్ ఫాస్టింగ్' అనే మాట విన్నది. 'ఒకసారి ట్రై చేసి చూద్దాం' అనుకుంటూ రంగంలోకి దిగింది. తల్లిదండ్రులకు చెప్పి మారుమూల ప్రాంతంలోని చుట్టాల ఇంటికి వెళ్లింది. ఆ పల్లెలో ఉరుకులు పరుగులు కనిపించవు. రణగొణ ధ్వనులు వినిపించవు. పిట్టపాటను దగ్గరగా వినే అదృష్టం దక్కుతుంది.

సెల్‌ఫోన్‌కు సెలవు ఇచ్చి ఆ వారం రోజులు ఒక చెట్టు కింద కూర్చొని నచ్చిన పుస్తకాలు చదువుకుంది.

పట్నాకు చెందిన తేజశ్రీకి నాన్‌స్టాప్‌గా మాట్లాడే అలవాటు ఉంది. రానూ రానూ ఆమె అంటే స్నేహితుల్లో తెలియని భయం లాంటిది ఏర్పడింది. పక్కకు తప్పుకోవడం మొదలైంది. ఇది గమనించిన తేజశ్రీ ఆలోచనల్లో పడినప్పుడు ఆమెకు కనిపించిన దారి... డోపమైన్ ఫాస్టింగ్.

ఫాస్టింగ్‌లో భాగంగా ఒక వారం రోజులపాటు అవసరమైతే తప్ప ఒక్కమాట కూడా ఎక్కువ మాట్లాడలేదు తేజశ్రీ!

ఫాస్టింగ్ తరువాత ఆ ఇద్దరి నోటినుంచి వచ్చిన మాట...

'ఇంత అద్భుతమైన ఫలితాన్ని ఊహించలేదు'

ఈ ఇద్దరు మాత్రమే కాదు దేశవ్యాప్తంగా యువతరంలో ఎంతోమంది జపిస్తున్న మంత్రం... డోపమైన్ ఫాస్టింగ్. 'డోపమైన్ ఫాస్టింగ్' సిలికాన్ వ్యాలీలో మారుమోగిన ట్రెండ్. సాంకేతిక నిపుణులను బాగా ఆకట్టుకుంది.

'దీనికి ఎలాంటి శాస్త్రీయ ప్రాతి పదికా లేదు' అనే మాట 'డోపమైన్ ఫాస్టింగ్' పాపులారిటీని యూత్‌లో తగ్గించలేకపోతోంది.

టీవీ షోలు, యూట్యూబ్ వీడియోలు, పాడ్‌కాస్ట్, మ్యూజిక్ షోలు... డిజిటల్ ప్రపంచంలో వివిధ మార్గాల ద్వారా మెదడులో డోపమైన్ విడుదల అవుతుంది. డిజిటల్ కంటెంట్ నుంచి డివైజ్‌లకు అతిగా అలవాటు పడడం వరకు ప్లెజర్ కెమికల్ అనబడే 'డోపమైన్' హద్దులు దాటితే అది దురలవాటుగా మారి సమస్యల్లోకి తీసుకువెళుతుంది.

అధిక నిద్ర, అధిక తిండి నుంచి అదే పనిగా సోషల్ మీడియాలో తలదూర్చేవరకు... ఎన్నెన్నో అలవాట్లు డోపమైన్ ప్రతిఫలనాలే.

అమెరికన్ సైకియాట్రిస్ట్ అన్నా లెంబ్కే 'డోపమైన్ నేషన్' పేరుతో పుస్తకం రాసింది. ఆ పుస్తకంలో ఆమె రాసిన ఒక మాట...'మన చుట్టూ ఉన్న ప్రపంచంలో అవసరమైన దానికంటే ఎక్కువ సౌకర్యాలు ఉన్నాయి. దీంతో ఒత్తిడి పెరుగుతోంది. సౌకర్యాలు, వస్తువులు పెరిగేకొద్దీ సంతోషం కూడా తగ్గుతుంది'

'డోపమైన్ ఫాస్టింగ్ అంటే తిండికి దూరం కావడం కాదు. ఎవరితో మాట్లాడకపోవడం కాదు. మెదడులో డోపమైన్ విడుదలయ్యేందుకు కారణమయ్యే వాటికి విరామం ఇవ్వడం' అంటున్నారు నిపుణులు.

'డోపమైన్ ఫాస్టింగ్' లక్ష్యం డోపమైన్‌కు దూరం చేయడం కాదు. డోపమైన్ లోపం వల్ల ఏ సంతోషం లేకుండా జీవితం నిస్సారంగా అనిపించడం, డిప్రెషన్‌లో కూరుకుపోవడం, చెడు అలవాట్లకు బానిస కావడం లాంటివి కూడా జరిగే ప్రమాదం ఉంది. అందుకే డిజిటల్ ఫాస్టింగ్ అనేది 'డోపమైన్' మరీ ఎక్కువ కాకుండా, మరీ తక్కువ కాకుండా సమన్వయ ధోరణిలో వెళుతుంది. అందుకే 'డోపమైన్ ఫాస్టింగ్' మోస్ట్ పవర్‌ఫుల్ బ్రేక్‌గా పేరు తెచ్చుకుంది.

'సంతోషకరమైన విషయం ఏమిటంటే యువతరం డోపమైన్ డిటాక్స్‌పై దృష్టి పెడుతోంది. డోపమైన్ ఫాస్టింగ్ వల్ల వచ్చిన విరామం ద్వారా తమ మానసిక ఆరోగ్యంపై టెక్నాలజీ చూపే ప్రతికూల ప్రభావాన్ని గురించి తెలుసుకోగలుగుతున్నారు' అంటుంది అన్నా లెంబ్కే. ●


అలియా భట్

ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్

బాలీవుడ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయిన ట్రెండ్.. ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్. 'ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్'లోగా భాగంగా 16 గంటల ఫాస్టింగ్ రూల్‌ని అనుసరిస్తూ ఆలియాభట్ బరువు తగ్గింది. వెజిటేరియన్‌గా మారింది. వ్యాయామాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చే జాక్వెలైన్ ఫెర్నాండేజ్ ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్‌కు కూడా అంతే ప్రాధాన్యత ఇస్తుంది. కమెడియన్ భారతి సింగ్ లాక్‌డౌన్ సమయంలో ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్‌ను అనుసరించి పదిహేను కిలోల బరువు తగ్గింది. హీరో వరుణ్ ధావన్ రోజుకు 14-16 గంటల ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్‌ను అనుసరిస్తాడు.



పోరాడి ఓడిన విష్ణువర్ధన్ ద్వయం

తైపీ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో గరగ కృష్ణప్రసాద్-పంజాల విష్ణువర్ధన్ గౌడ్ (భారత్) జోడీకి నిరాశ ఎదురైంది. తొలి రౌండ్ మ్యాచ్‌లో కృష్ణప్రసాద్-విష్ణువర్ధన్ గౌడ్ జోడీ 18-21, 22-20, 16-21తో విన్సన్ చియు-యువాన్ (అమెరికా) జంట చేతిలో ఓడింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్ లో రుతపర్ణ-శ్వేతపర్ణ (భారత్) జోడీ 7-21, 30-28, 12-21తో చెంగ్ యు పె-సున్ వెన్ పె (చైనీస్ తైపీ) జంట చేతిలో పరాజయం పాలైంది.

క్యాన్సర్ నుంచి బయటపడిన నవ్రతిలోవా

టెన్నిస్ దిగ్గజం మార్టినా నవ్రతిలోవా భయంకరమైన క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకుంది. 66 ఏళ్ల ఈ టెన్నిస్ సూపర్‌స్టార్ జనవరిలో రొమ్ము, గొంతు క్యాన్సర్ బారిన పడింది. వెంటనే జాగ్రత్త పడి ప్రారంభ దశలోనే చికిత్స ప్రారంభించడంతో కోలుకుంది. గతంలో 2010లో కూడా ఇదే రొమ్ము క్యాన్సర్ నుంచి ఆమె సురక్షితంగా బయటపడింది. నవ్రతిలోవా కెరీర్‌లో 18 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గింది.



ఆసీస్ అదరహో

- గెలిపించిన టెయిలెండర్లు
- తొమ్మిదో వికెట్‌కు 55 పరుగుల భాగస్వామ్యం
- కమిన్స్ కెప్టెన్ ఇన్నింగ్స్
- 'యాషెస్' తొలి టెస్టులో 2 వికెట్లతో ఓడిన ఇంగ్లండ్

బర్మింగ్‌హామ్: ఉదయం సెషన్‌లో చినుకులు... మధ్యాహ్నం సెషన్‌లో వికెట్లు... సాయంత్రం సెషన్‌లో టెయిలెండర్ల పరుగులు... ఆఖరి రోజును ఆద్యంతం రక్తికట్టించాయి. ఆస్ట్రేలియా బ్యాటర్స్ నిరాశ పరిచిన చోట... ఇంగ్లండ్ బౌలింగ్ పదునెక్కుతున్న వేళ... 'డ్రా'కు అవకాశమివ్వకుండా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (73 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), నాథన్ లయన్ (28 బంతుల్లో 16 నాటౌట్; 2 ఫోర్లు) చక్కని పోరాటం చేశారు. దీంతో ఇంగ్లండ్ గెలిచేందుకు బాట వేసుకున్న ఆఖరి సెషన్‌లో వీళ్లిద్దరు పిచ్‌పై పరుగులతో పాగా వేశారు. అబేధ్యమైన తొమ్మిదో వికెట్‌కు 55 పరుగులు జోడించి ఆస్ట్రేలియాను ఓటమి కోరల్లోంచి గెలుపు మజిలీకి చేర్చారు. దీంతో ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. తొలి టెస్టులో 2 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. 281 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు మంగళవారం ఓవర్‌నైట్ స్కోరు 107/3తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆస్ట్రేలియా 92.3 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసి గెలిచింది. ఆఖరి రోజు ఆసీస్ విజయానికి 174 పరుగులు అవసరం కాగా... ఆశలు పెట్టుకున్న ప్రధాన బ్యాటర్స్ ట్రవిస్ హెడ్ (16; 3 ఫోర్లు), గ్రీన్ (28; 2 ఫోర్లు), ఉస్మాన్ ఖ్వాజా (65; 7 ఫోర్లు) కీలకమైన తరుణంలో ఇంగ్లండ్ బౌలింగ్‌కు తలవంచారు. ఫామ్‌లో ఉన్న క్యారీ (20; 2 ఫోర్లు) అవుటైనప్పుడు ఆసీస్ స్కోరు 227/8. లక్ష్యానికి 54 పరుగుల దూరం. మిగిలిందల్లా టెయిలెండర్లే కావడంతో ఆసీస్‌పై ఆసీస్‌కే గెలుస్తామన్న ఆశల్లేవు. ఈ దశలో కమిన్స్, లయన్ ఇంగ్లండ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌ను ఎదుర్కొని, వికెట్ల ముందు గోడకట్టి మరీ గెలిచేందుకు పరుగు... పరుగు జత చేశారు. ఆసీస్‌కు 'డ్రా' చేసుకోవడమే గగనం అనుకుంటే ఇద్దరి వీరోచిత ప్రదర్శన ఏకంగా విజయాన్నే కట్టబెట్టింది. అటకు ముందు ఆఖరి రోజు రసపట్టులో ఉన్న టెస్టుతో వర్షం కూడా చాలా సేపు దోబూచులాడింది. దీంతో తొలి సెషన్ పూర్తిగా రద్దయ్యింది. దీంతో అందుబాటులో ఉన్న 67 ఓవర్లలోనే ఆస్ట్రేలియా లక్ష్యాన్ని ఛేదించాల్సిన పరిస్థితి వచ్చింది. ఐదు టెస్టుల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0తో ఆధిక్యంలో నిలువగా, ఇరు జట్ల మధ్య 28 నుంచి లార్డ్స్‌లో రెండో టెస్టు జరుగుతుంది.


ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 393/8 డిక్లేర్డ్; ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: 386 ఆలౌట్; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 273 ఆలౌట్; ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 282/8 (92.3 ఓవర్లలో) (ఖ్వాజా 65, వార్నర్ 36, కమిన్స్ 44 నాటౌట్, బ్రాడ్ 3/64).


లయన్, కమిన్స్ విజయ సంబరం

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ

ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: గత ఆదివారం ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో సాధించిన డబుల్స్ టైటిల్ భారత జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టికి కెరీర్ బెస్ట్ అందుకునేలా చేసింది. మంగళవారం విడుదల చేసిన ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో సాత్విక్ సాయిరాజ్ (ఆంధ్రప్రదేశ్), చిరాగ్ శెట్టి (మహారాష్ట్ర) ద్వయం మూడు స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌కు చేరుకుంది. ఈ ఏడాది సాత్విక్-చిరాగ్ జంట స్విస్ ఓపెన్, ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ టైటిల్స్ సాధించడంతోపాటు ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించింది.

పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్ తొమ్మిదో ర్యాంక్‌లో కొనసాగుతుండగా... లక్ష్య సేన్ 18వ ర్యాంక్‌లో, కిడాంబి శ్రీకాంత్ 19వ ర్యాంక్‌లో, ప్రియాన్షు రజావత్ 30వ ర్యాంక్‌లో ఉన్నారు. టాప్-100లో భారత్ నుంచి 12 మంది క్రీడాకారులు ఉండటం విశేషం.

మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు రెండు స్థానాలు పురోగతి సాధించి 12వ ర్యాంక్‌కు చేరుకోగా... సైనా నెహ్వాల్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 31వ ర్యాంక్‌లో నిలిచింది. ఆకర్షి కశ్యప్, అష్మిత చాలిహా, మాళవిక బన్సోద్ వరుసగా 41వ, 43వ, 46వ ర్యాంక్‌ల్లో ఉన్నారు. మహిళల సింగిల్స్‌లోనూ భారత్ నుంచి 12 మంది క్రీడాకారిణులు టాప్-100లో ఉండటం విశేషం. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ ద్వయం 16వ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ జంట 33వ ర్యాంక్‌లో నిలిచి భారత నంబర్‌వన్ జోడీగా ఉంది.



భారత్ X పాకిస్తాన్

నేటి నుంచి 'శాఫ్' ఫుట్‌బాల్ టోర్నీ

బెంగళూరు: ఇంటర్ కాంటినెంటల్ కప్ గెలుచుకున్న ఉత్సాహంతో ఉన్న భారత జట్టు దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) టోర్నీలో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. పాకిస్తాన్‌తో నేడు జరిగే మ్యాచ్‌తో ఎనిమిదిసార్లు చాంపియన్ భారత జట్టు టోర్నీని మొదలు పెట్టనుంది. రాత్రి గం. 7:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను 'ఫ్యాన్ కోడ్' యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

ఫైనల్లో భారత్, బంగ్లాదేశ్

మోంగ్‌కాక్ (హాంకాంగ్): ఎమర్జింగ్ కప్ ఆసియా అండర్-23 మహిళల టి20 క్రికెట్ టోర్నీలో భారత్, బంగ్లాదేశ్ జట్లు ఫైనల్లోకి ప్రవేశించాయి. రెండు జట్ల మధ్య టైటిల్ పోరు నేడు జరగనుంది. భారత్, శ్రీలంక మధ్య మంగళవారం జరగాల్సిన తొలి సెమీఫైనల్ వర్షం కారణంగా రద్దయింది. దాంతో గ్రూప్ దశలో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన భారత్ ఫైనల్ చేరింది. అనంతరం జరిగిన రెండో సెమీఫైనల్లో బంగ్లాదేశ్ ఆరు పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది.



జింబాబ్వేను గెలిపించిన సికందర్ రజా

54 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్స్‌లతో 102 నాటౌట్

హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ క్రికెట్ టోర్నీలో ఆతిథ్య జింబాబ్వే జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. నెదర్లాండ్స్ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో జింబాబ్వే ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. సికందర్ రజా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జింబాబ్వే జట్టును గెలిపించాడు. ముందుగా నెదర్లాండ్స్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 315 పరుగులు చేసింది. విక్రమ్‌జిత్ సింగ్ (88; 9 ఫోర్లు), మాక్స్ ఒడౌడ్ (59; 10 ఫోర్లు), స్కాట్ ఎడ్వర్డ్స్ (83; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. స్పిన్నర్ సికందర్ రజా 55 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. 316 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 40.5 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 319 పరుగులు చేసి గెలిచింది. క్రెయిగ్ ఇర్విన్ (50; 9 ఫోర్లు), సీన్ విలియమ్స్ (91; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకోగా... సికందర్ రజా (54 బంతుల్లో 102 నాటౌట్; 6 ఫోర్లు, 8 సిక్స్‌లు) అజేయ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో వన్డేల్లో జింబాబ్వే తరఫున వేగవంతమైన సెంచరీ సాధించిన ప్లేయర్‌గా సికందర్ రజా గుర్తింపు పొందాడు.

నేపాల్‌కు తొలి విజయం

గ్రూప్ 'ఎ'లోనే జరిగిన మరో మ్యాచ్‌లో నేపాల్ ఆరు వికెట్ల తేడాతో అమెరికా జట్టును ఓడించి ఈ టోర్నీలో తొలి విజయం సాధించింది. తొలుత అమెరికా జట్టు 49 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. షాయన్ జహంగీర్ (100 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ సెంచరీ చేశాడు. నేపాల్ బౌలర్ కరణ్ 33 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం నేపాల్ 43 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 211 పరుగులు చేసి విజయం అందుకుంది. భీమ్ షార్కి (77 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), దీపేంద్ర సింగ్ (39 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో ఐర్లాండ్‌తో స్కాట్లాండ్; ఒమన్‌తో యూఏఈ తలపడతాయి.



అర్జెంటీనా వస్తానంటే... భారత్ వద్దన్నది!

రూ. 40 కోట్ల అప్పియరెన్స్ ఫీజుకు భారత్ 'నో'

పనాజీ: అర్జెంటీనా ప్రపంచ ఫుట్‌బాల్ చాంపియన్. పైగా సూపర్ స్టార్ మెస్సీ టీమ్. ఇలాంటి మేటి చాంపియన్ టీమ్ వచ్చి ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడతామంటే ఫుట్‌బాల్ అభివృద్ధి కోరే ఏ దేశమైనా ఎగిరి గంతేస్తుంది. ఎ్రరతివాచీ పరిచి మరీ ఆహ్వానిస్తుంది. కానీ జనాభాలో చైనాను మించిన భారత్ మాత్రం తమ ఫుట్‌బాల్ అభిమానులకు నిరాశ కలిగించే నిర్ణయంతో అర్జెంటీనా వస్తానంటే వద్దన్నది. అర్జెంటీనా జట్టు కానీ, ఆటగాళ్లు కానీ మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్లు. అలాంటి జట్టు అప్పియరెన్స్ ఫీజుగా 50 లక్షల డాలర్లు (రూ. 40 కోట్లు) ఇస్తే చాలు అందుబాటులో ఉన్న జూన్ 12 నుంచి 20 తేదీల్లో భారత్ వేదికపై ఓ మ్యాచ్ ఆడి వెళతామంది. కానీ అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య అంత మొత్తం ఇవ్వలేం అనేసరికి మెస్సీ టీమ్ జూన్ 15న బీజింగ్‌లో ఆస్ట్రేలియాతో ఆడింది. మనకంటే చిన్నదేశం ఇండోనేసియా వాళ్లు అడిగినంత ఫీజులో ఏ లోటు లేకుండా చెల్లించి జకార్తాలో 19న అర్జెంటీనాతో ఆడి ముచ్చట తీర్చుకుంది.



చైనాతో భారత్ తొలి పోరు

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీ

చెన్నై: భారత్‌లో తొలిసారి జరగనున్న ఆసియా చాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నీ షెడ్యూల్‌ను ఆసియా హాకీ సమాఖ్య మంగళవారం విడుదల చేసింది. ఆగస్టు 3 నుంచి 12 వరకు జరిగే ఈ టోర్నీకి చెన్నైలోని మేయర్ రాధాకృష్ణన్ స్టేడియం వేదికగా నిలువనుంది. ఆతిథ్య భారత జట్టు తొలి మ్యాచ్‌ను ఆగస్టు 3న చైనాతో ఆడుతుంది. అనంతరం ఆగస్టు 4న జపాన్‌తో, 6న మలేసియాతో, 7న కొరియాతో, పాకిస్తాన్‌తో 9న భారత్ తలపడుతుంది. ఆరు జట్ల మధ్య లీగ్ మ్యాచ్‌లు ముగిశాక టాప్-4లో నిలిచిన జట్ల మధ్య సెమీఫైనల్స్ 11న, ఫైనల్ 12న జరుగుతాయి.

తెలుగు టాలన్స్ మ్యాచ్ 'డ్రా'

జైపూర్: ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్‌లో ఇప్పటికే సెమీఫైనల్ చేరుకున్న తెలుగు టాలన్స్, మహారాష్ట్ర ఐరన్‌మెన్ జట్లు తొలి 'డ్రా' నమోదు చేశాయి. ఈ రెండు జట్ల మధ్య మంగళవారం జరిగిన మ్యాచ్ 30-30తో 'డ్రా' అయింది. తెలుగు టాలన్స్ తరఫున దవిందర్ ఏడు గోల్స్ చేశాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో గోల్డెన్ ఈగల్స్ ఉత్తరప్రదేశ్‌తో ఢిల్లీ పంజెర్స్; గర్విత్ గుజరాత్‌తో తెలుగు టాలన్స్ తలపడతాయి.

ఆసియా క్రీడలకు సాకేత్ మైనేని, సహజ




న్యూఢిల్లీ: ఆసియా క్రీడల్లో పాల్గొనే 12 మంది సభ్యులతో కూడిన భారత టెన్నిస్ జట్లను ప్రకటించారు. పురుషుల జట్టులో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేనికి... మహిళల జట్టులో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లికి చోటు దక్కింది. 35 ఏళ్ల సాకేత్ ఆసియా క్రీడలకు ఎంపిక కావడం ఇది రెండోసారి. 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో సాకేత్ పురుషుల డబుల్స్‌లో సనమ్ సింగ్‌తో కలిసి రజతం... సానియా మీర్జాతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం సాధించాడు. 22 ఏళ్ల సహజ తొలిసారి ఆసియా క్రీడల్లో బరిలోకి దిగనుంది. ఆసియా క్రీడలు సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు చైనాలోని హాంగ్జౌ పట్టణంలో జరుగుతాయి.

భారత పురుషుల జట్టు: రోహన్ బోపన్న, సుమిత్ నగాల్, శశికుమార్, రామ్‌కుమార్ రామనాథన్, యూకీ బాంబ్రీ, సాకేత్ మైనేని. **భారత మహిళల జట్టు:** అంకితా రైనా, కర్మన్‌కౌర్, రుతుజా భోస్లే, సహజ యామలపల్లి, వైదేహి చౌదరి, ప్రార్థన.

సినిమా


నాని

సీక్వెల్.. మార్పుల్...

కథ పెద్దదైతే సినిమా రెండు భాగాలవుతుంది.. ఒక్కోసారి మూడు కూడా అవుతుంది. ఇప్పుడలాంటి కథలతో రూపొందుతున్న సీక్వెల్స్ కొన్ని ఉన్నాయి. అయితే ఒకటో భాగంలో నటించిన నటీనటులు, తెరకెక్కించిన దర్శకుడు రెండో భాగంలో కంటిన్యూ కావడంలేదు. ఒకటీ హీరో మారుతున్నారు.. లేదా డైరెక్టర్ మారుతున్నారు... లేదా హీరోయిన్ మారుతున్నారు... ఇక మార్పుల్‌తో రూపొందుతున్న సీక్వెల్స్ గురించి తెలుసుకుందాం.


హిట్: ది థర్డ్ కేస్

తెలుగు చిత్ర పరిశ్రమలో 'హిట్' ఫ్రాంచైజీకి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన 'హిట్: ది ఫస్ట్ కేస్', 'హిట్: ది సెకండ్ కేస్' చిత్రాలు సూపర్ హిట్స్‌గా నిలిచాయి. ఈ రెండు చిత్రాలను నిర్మించింది హీరో నాని కావడం విశేషం. కాగా తొలి రెండు భాగాలు నిర్మించిన నాని థర్డ్ పార్ట్ 'హిట్: ది థర్డ్ కేస్'లో హీరోగా నటించనుండటం విశేషం. 'హిట్: ది ఫస్ట్ కేస్' (2020) చిత్రంలో విశ్వక్ సేన్ హీరోగా నటించారు. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో హోమిసైడ్ ఇంటర్వెన్షన్ టీమ్‌ను (హిట్) లీడ్ చేసే పోలీస్ ఆఫీసర్ రుద్రరాజు పాత్రలో నటుడిగా విశ్వక్ సేన్‌కి మంచి మార్కులే పడ్డాయి. ఈ మూవీ మంచి హిట్‌గా నిలిచింది. కాగా హిట్ ఫ్రాంచైజీలో రెండో భాగం 'హిట్: ది సెకండ్ కేస్'లో హీరోగా అడివి శేష్‌ని తీసుకున్నారు శైలేష్. ఎస్పీ కృష్ణదేవ్ పాత్రలో అడివి శేష్ తనదైన శైలిలో నటించి, మెప్పించారు. ఈ సినిమా కూడా హిట్. ఇక మూడో భాగం 'హిట్: ది థర్డ్ కేస్'లో హీరో నాని నటించనున్నట్లు 'హిట్: ది సెకండ్ కేస్' చివర్లో రివీల్ చేశారు. పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్ పాత్రలో నాని నటిస్తారు. కాగా హిట్ ఫ్రాంచైజీలో మొత్తం 7 భాగాలుంటాయని శైలేష్ కొలను గతంలో స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

చంద్రముఖి-2


కంగనా, లారెన్స్

'చంద్రముఖి' (2005)లో 'లక లక లక..' అంటూ హీరో రజనీకాంత్ రాజు గెటప్‌లో విలనిజమ్ పండించి, డాక్టర్ ఈశ్వర్‌గా మంచితనం కనబరిస్తే ప్రేక్షకులు కాసుల వర్షం కురిపించారు. పి. వాసు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రజనీకాంత్, నయనతార జంటగా జ్యోతిక, ప్రభు కీలక పాత్రలు చేశారు. 'చంద్రముఖి' విడుదలైన 18 ఏళ్లకు సీక్వెల్‌కి శ్రీకారం చుట్టారు పి. వాసు. 'చంద్రముఖి 2' పేరుతో తెరకెక్కిన ఈ చిత్రంలో రజనీ ప్లేస్‌లోకి లారెన్స్ వచ్చారు. అలాగే కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించారు. ఇంకా వడివేలు, లక్ష్మీ మీనన్, రాధిక తదితరులు నటించారు. ఇటీవల మైసూర్‌లో జరిగిన షెడ్యూల్‌తో ఈ మూవీ పూర్తయింది. తమిళ, తెలుగు భాషల్లో సెప్టెంబర్ 15న రిలీజ్ కానున్న ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి స్వరకర్త.


ధనుష్

యుగానికి ఒక్కడు-2

వైవిధ్యమైన చిత్రాలతో తెలుగు, తమిళ ప్రేక్షకులను అలరించారు దర్శకుడు సెల్వ రాఘవన్. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'ఆయిరత్తిల్ ఒరువన్' (తెలుగులో యుగానికి ఒక్కడు -2010) ఎంత హిట్ అయిందో చెప్పక్కర్లేదు. కార్తీ హీరోగా, ఆండ్రియా, రీమా సేన్ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఆయిరత్తిల్ ఒరువన్ 2' (యుగానికి ఒక్కడు 2) తెరకెక్కించనున్నారు సెల్వ రాఘవన్. అయితే ఈ సినిమాలో తన సోదరుడు, హీరో ధనుష్‌ని లీడ్ రోల్‌కి తీసుకున్నారాయన. కార్తీ స్థానంలో ధనుష్ కనిపిస్తారని కొందరు అంటుంటే.. అలాంటిదేం లేదు.. కార్తీ కూడా ఉంటారు.. సీక్వెల్‌లో ధనుష్ పాత్ర యాడ్ అయిందని మరికొందరు అంటున్నారు. మరి 'యుగానికి ఒక్కడు 2'లో కార్తీ పాత్ర ఉంటుందా? లేదా? అనేది చూడాలి.


అనుపమ

టిల్లు స్క్వేర్


మల్లిక్ రామ్

'డీజే టిల్లు పేరు వీని స్టయిలే వేరు..' అంటూ హీరో సిద్ధు జొన్నలగడ్డ స్టెప్పు లేస్తే ప్రేక్షకులు కూడా ఫుల్‌గా ఎంజాయ్ చేశారు. విమల్ కృష్ణ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం 'డీజే టిల్లు'. రొమాంటిక్ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా గత ఏడాది విడుదలై సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' మూవీ తెరకెక్కుతోంది. అయితే సీక్వెల్‌కి అటు డైరెక్టర్, ఇటు హీరోయిన్ ఇద్దరూ మారడం విశేషం. 'టిల్లు స్క్వేర్'కి మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే తొలి భాగంలో నేహా శెట్టి హీరోయిన్‌గా నటించి గ్లామర్‌తో మెప్పించారు. అయితే సీక్వెల్‌లో మాత్రం అనుపమా పరమేశ్వరన్‌ని హీరోయిన్‌గా తీసుకున్నారు. ఈ సినిమాని సెప్టెంబర్ 15న విడుదల చేయాలనుకుంటున్నారు.

జిగర్తండా-2

సిద్ధార్థ్, బాబీ సింహా, లక్ష్మీ మీనన్ కీలక పాత్రల్లో కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జిగర్తండా' (2014) తమిళంలో ఘనవిజయం సాధించింది. ఈ చిత్రం తెలుగులో వరుణ్ తేజ్ హీరోగా 'గద్దలకొండ గణేష్'గా రీమేక్ అయి, ఇక్కడా ఘనవిజయం సాధించింది. కాగా 'జిగర్తండా' విడుదలైన దాదాపు తొమ్మిదేళ్లకు 'జిగర్తండా డబుల్ ఎక్స్' పేరుతో కార్తీక్ సుబ్బరాజ్ సీక్వెల్ తీశారు. ఇందులో రాఘవ లారెన్స్, ఎస్‌జే సూర్య లీడ్ రోల్స్‌లో నటించారు. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ దీపావళికి విడుదల కానుంది.


ఎస్.జె. సూర్య


చేతన్ చీను


కీరవాణి


గోకుల్ కృష్ణ

జెంటిల్‌మన్-2

అర్జున్, మధుబాల జంటగా శంకర్ దర్శకత్వంలో కేటీ కుంజుమోన్ నిర్మించిన 'జెంటిల్‌మేన్' (1993) చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. దాదాపు ముప్పైఏళ్ల తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్ 'జెంటిల్‌మన్ 2'ని నిర్మిస్తున్నారు కుంజుమోన్. అయితే రెండో భాగంలో దర్శకుడు, హీరో, సంగీత దర్శకుడు ముగ్గురూ మారడం విశేషం. గోకుల్ కృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ సీక్వెల్‌లో 'మంత్ర-2, రాజుగారి గది, పెళ్లికి ముందు ప్రేమకథ' వంటి చిత్రాల్లో నటించిన చేతన్ చీను హీరోగా నటించనున్నారు. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రూపొందనున్న ఈ చిత్రం కన్నడ, మలయాళ భాషల్లో డబ్బింగ్ కానుంది.

ఇవే కాదు.. మరికొన్ని సినిమాల సీక్వెల్స్‌లో కూడా నటీనటులు, దర్శకులు, సంగీత దర్శకులు మారుతున్నారు.

మెగా ఆనందం


రామ్‌చరణ్, ఉపాసన

చిరంజీవి కుటుంబానికి మంగళవారం (జూన్ 20) మెగా ఆనందాన్నిచ్చింది. రామ్‌చరణ్ భార్య ఉపాసన ఒక పాపకు జన్మనిచ్చారు. చరణ్-ఉపాసనలకు 2012 జూన్ 14న పెళ్లయింది. కాగా అల్లు అరవింద్ దంపతులు, అల్లు అర్జున్, స్నేహ, వరుణ్ తేజ్ తదితరులు ఆస్పత్రికి వెళ్లి చరణ్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్నేళ్లకు నెరవేరింది - చిరంజీవి

అపోలో ఆస్పత్రిలో మనవరాలిని చూశాక చిరంజీవి మాట్లాడుతూ– ''మంగళవారం ఉదయం 1 గంట 49 నిమిషాలకు పాప పుట్టింది. చరణ్, ఉపాసన తల్లిదండ్రులై, బిడ్డను మా చేతిలో పెట్టాలని ఎన్నో సంవత్సరాల నుంచి అనుకుంటున్నాం. ఇన్నేళ్లకు ఆ భగవంతుడి దయ, అందరి ఆశీస్సులు వల్ల ఆ కోరిక నెరవేరింది. పాప పుట్టిన ఘడియలు చాలా మంచివని పెద్దలు అంటున్నారు. ఈ మధ్య కాలంలో చరణ్ ఎదుగుదల, తను సాధించిన విజయాలు, వరుణ్ తేజ్ ఎంగేజ్‌మెంట్.. ఇలా మా ఇంట్లో అన్నీ శుభకార్యాలే జరగటం చూస్తుంటే ఈ బిడ్డ ప్రభావం కూడా ఉందని అనుకుంటున్నాను. నా కుటుంబం ఆంజనేయ స్వామినే నమ్ముకున్నాం. మంగళవారం రోజున ఆడబిడ్డను ప్రసాదించటంతో అపురూపంగా భావిస్తున్నాం'' అన్నారు.

ట్రైలర్ చూస్తుంటే టెన్షన్ మొదలైంది - హీరో కార్తికేయ


గరిమా కౌశల్, శివ, ప్రగతి, కార్తికేయ


''శివ కందుకూరి మొదట్లో సాఫ్ట్ సినిమా చేశాడు. 'మను చరిత్ర' ట్రైలర్ చూస్తుంటే టెన్షన్ మొదలైంది.. ఎందుకంటే శివ నాకు పోటీ వచ్చినట్లు అనిపించింది (నవ్వుతూ). నా 'ఆర్ఎక్స్ 100' విడుదలకు ముందు ఎలాంటి వైబ్స్ ఉన్నాయో ఇప్పుడూ అలానే అనిపిస్తోంది. 'మను చరిత్ర' పెద్ద విజయం సాధిస్తుంది'' అని హీరో కార్తికేయ అన్నారు. శివ కందుకూరి హీరోగా భరత్ పెదగాని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మను చరిత్ర'. మేఘా ఆకాష్, ప్రియా వడ్లమాని, ప్రగతి శ్రీవాత్సవ్ కథానాయికలు. ఎన్. శ్రీనివాస రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి కార్తికేయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శివ కందుకూరి మాట్లాడుతూ– ''మను చరిత్ర' నాకు స్పెషల్ మూవీ'' అన్నారు. ''మను చరిత్ర' స్వచ్ఛమైన కథ'' అన్నారు భరత్ పెదగాని.

మంచి ఎంటర్‌టైనర్ - దశరథ్


దశరథ్, డీవై చౌదరి, రోహిత్, అపర్ణ

రోహిత్ బెహల్, అపర్ణా జనార్దనన్ జంటగా నటించిన చిత్రం 'లవ్ యూ రామ్'. దర్శకుడు కె. దశరథ్ కథ అందించిన ఈ చిత్రానికి డీవై చౌదరి దర్శకత్వం వహించారు. దర్శకుడు కె. దశరథ్, డీవై చౌదరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. ఈ వేడుకలో రోహిత్ మాట్లాడుతూ– ''ఈ సినిమా ప్రయాణంలో చాలా విషయాలు నేర్చుకున్నాను'' అన్నారు. దశరథ్ మాట్లాడుతూ– ''లవ్ యూ రామ్' మంచి ఎంటర్‌టైనర్. కథ, మ్యూజిక్ అన్నీ బాగున్నాయి. మైత్రీ మూవీస్ వారి ద్వారా ఈ సినిమాను విడుదల చేస్తున్నాం'' అన్నారు. ''అందరికీ నచ్చేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు డీవై చౌదరి.

ఎడిటర్ పి. వెంకటేశ్వరరావు మృతి



సీనియర్ ఎడిటర్ పి. వెంకటేశ్వరరావు (72) చెన్నైలో తుదిశ్వాస విడిచారు. ఆరు నెలలుగా అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో దాదాపు రెండొందల చిత్రాలకు పైగా వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా వర్క్ చేశారు. 'యుగంధర్', 'మొండి మొగుడు పెంకి పెళ్లాం', 'కెప్టెన్ కృష్ణ', 'ఇద్దరూ అసాధ్యులే' వంటి పలు హిట్ చిత్రాలకు ఎడిటర్‌గా చేశారు వెంకటేశ్వరరావు. ఆయన భార్య కొన్నేళ్ల క్రితం మరణించారు. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా వెంకటేశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు, తెలుగు ఫిల్మ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోటగిరి వెంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి మార్తాండ్ కె. వెంకటేష్ సంతాపం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరరావు అంత్యక్రియలు ఈ నెల 22న చెన్నైలో జరుగుతాయి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	159	63,328
నిఫ్టీ ▲	61	18,817

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.00 గంటలకు)			
నాస్‌డాక్	13,683	▼	6
డోజోన్స్	34,127	▼	172
ఎఫ్‌టీఎస్ఈ 100	7,569	▼	19
డాక్స్	16,111	▼	90
షాంఘై	3,240	▼	15
నికాయ్	33,389	▲	18

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	59,345	▲	118
బంగారం (99.5 స్వచ్ఛత)	59,107	▲	117
వెండి (కేజీ)	72,091	▼	268

మలబార్‌తో అనుబంధం హర్షణీయం

- జూనియర్ ఎన్‌టీఆర్
- బ్రాండ్ అంబాసిడర్‌గా మరోసారి సంతకాలు

హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా 11 దేశాల్లో 320 షోరూమ్‌లతో 6వ అతిపెద్ద జ్యువెలరీ రిటైలర్‌గా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా జూనియర్ ఎన్‌టీఆర్ కొనసాగనున్నారు. సంబంధిత పత్రాలపై ఆయన సంతకాలు చేశారు. సంస్థ ప్రచార చిత్రాలతో ఆయన వినియోగదారులను ఆకట్టుకోనున్నారు. బ్రాండ్ అంబాసిడర్‌గా జూనియన్ ఎన్‌టీఆర్ రెండో ఇన్నింగ్స్‌తో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 30వ వార్షికోత్సవాలకు మరింత శోభ చేకూరనుందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.



ప్రముఖ జ్యువెలరీ రిటైలర్‌తో భాగస్వామ్యం కొనసాగడం సంతోషంగా ఉందని జూనియర్ ఎన్‌టీఆర్ పేర్కొన్నారు. కాగా, దేశవ్యాప్తంగా ఆరాధించే సినీ తారల్లో ఒకరైన జూనియర్ ఎన్‌టీఆర్‌తో తమ సంస్థ అనుబంధం కొనసాగడం వల్ల.. ప్రపంచవ్యాప్తంగా నంబర్ 1 రిటైలర్ జ్యువెలరీ బ్రాండ్‌గా నిలవాలనే తమ ఆశయం త్వరలోనే నెరవేరుతుందన్న విశ్వాసం మరింత బలపడుతోందని మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. కస్టమర్లకు ప్రపంచ స్థాయి ఆభరణాల షాపింగ్ అనుభూతితో పాటు పారదర్శకత, ఆభరణాల డిజైన్‌లో వైవిధ్యం, నైపుణ్యం తదితర అంశాలకు సంబంధించి తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నట్లు వెల్లడించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-6-2023	
విశాఖ	550-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
20-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

దేశంలో విలువైన కంపెనీ రిలయన్స్

- 16.4 లక్షల కోట్ల మార్కెట్ విలువ
- అత్యంత లాభదాయక, పన్ను చెల్లించే సంస్థ
- తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అత్యంత విలువైన కంపెనీగా మరోసారి గుర్తింపు సొంతం చేసుకుంది. '2022 బుర్గుండీ ప్రైవేటు హురూన్ ఇండియా 500' జాబితా మంగళవారం విడుదలైంది. 16.4 లక్షల కోట్ల మార్కెట్ విలువతో రిలయన్స్ మొదటి స్థానంలో ఉంటే, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రూ.11.8 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో రెండో అత్యంత విలువైన కంపెనీగా నిలిచింది. రూ.9.4 లక్షల కోట్ల మార్కెట్ విలువతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మూడో స్థానంలో ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీ విలీనం అనంతరం రిలయన్స్ తర్వాత రెండో అత్యంత విలువైన కంపెనీ స్థానానికి చేరుకునే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మరికొన్ని ప్రత్యేకతలు కూడా సొంతం చేసుకుంది. 2022-23 సంవత్సరానికి రూ.67,845 కోట్ల లాభంతో అత్యంత లాభదాయక సంస్థగానూ ఉంది. అలాగే, అత్యధికంగా రూ.16,297 కోట్ల పన్నును చెల్లించింది.



టాప్-10 మార్కెట్ విలువ(రూ.కోట్లలో)	
కంపెనీ	2023 ఏప్రిల్ 30 నాటికి
రిలయన్స్ ఇండస్ట్రీస్	16,37,327
టీసీఎస్	11,76,385
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	9,41,386
ఐసీఐసీఐ బ్యాంక్	6,41,930
ఐటీసీ	5,29,682
ఇన్ఫోసిస్	5,19,794
హెచ్‌డీఎఫ్‌సీ	5,08,172
భారతీ ఎయిర్‌టెల్	4,76,737
కోటక్ మహీంద్రా బ్యాంక్	3,84,001
ఎల్అండ్‌టీ	3,31,694

సీరమ్ ఇనిస్టిట్యూట్

అన్‌లిస్టెట్ కంపెనీల్లో అత్యంత విలువైన సంస్థగా సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిలిచింది. ఈ సంస్థ మార్కెట్ విలువ రూ.1.97 లక్షల కోట్లుగా ఉంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ రూ.1.65 లక్షల కోట్ల మార్కెట్ విలువతో రెండో స్థానాన్ని సొంతం చేసుకుంది. రూ.69,100 కోట్లతో బైజూస్ మూడో అత్యంత విలువైన అన్‌లిస్టెడ్ సంస్థగా ఉంది. 2022 అక్టోబర్ 30 నుంచి 2023 ఏప్రిల్ 30 మధ్య ఆరు నెలల కాలంలో దేశంలోని టాప్-500 ప్రైవేటు కంపెనీల మార్కెట్ విలువల వ్యత్యాసాన్ని బర్గుండీ ప్రైవేటు, హురూన్ ఇండియా ట్రాక్ చేసి ఈ నివేదికను రూపొందించాయి. మార్కెట్ విలువ ఆధారంగానే వాటికి ర్యాంకులను కేటాయిస్తుంటాయి. దేశంలోని టాప్-500 ప్రైవేటు కంపెనీల మార్కెట్ విలువ 2022 అక్టోబర్ 30 నాటికి రూ.227 లక్షల కోట్లుగా ఉండగా, 2023 ఏప్రిల్ 30 నాటికి 6.4 శాతం క్షీణించి రూ.212 లక్షల కోట్లకు పరిమితమైంది. టాప్-10 కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.71.5 లక్షల కోట్లుగా ఉంది. దేశ జీడీపీలో ఇది 37 శాతానికి సమానం. అత్యధికంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ మార్కెట్ విలువను పెంచుకున్నాయి. అదానీ గ్రూపులో ఎనిమిది కంపెనీల మార్కెట్ విలువ 52 శాతం క్షీణించింది.

హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలా విక్రయం

డీల్ విలువ రూ. 9,060 కోట్లు

న్యూఢిల్లీ: విద్యా రుణాల విభాగం హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలాను క్రిస్‌క్యాపిటల్ తదితర పీఈ దిగ్గజాల కన్సార్షియంకు విక్రయించినట్లు మార్టిగేజ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ తాజాగా పేర్కొంది. కంపెనీలో 90 శాతం వాటాను రూ. 9,060 కోట్లకు విక్రయించినట్లు వెల్లడించింది. ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో విలీనం నేపథ్యంలో విద్యా రుణాల సంస్థను హెచ్‌డీఎఫ్‌సీ విక్రయించింది. బీపీఈఏ ఈక్విటీ, క్రిస్‌క్యాపిటల్ ఇన్వెస్టర్ల కన్సార్షియంకు హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలా ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను విక్రయించేందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం తాజాగా తెలియజేశాయి. దేశ, విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించేందుకు విద్యార్థులకు రుణాలందించే హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలాలో 9.99% వాటాను కొనసాగించనున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ వెల్లడించింది.

ఫార్మా ఎగుమతులు రూ.2,29,600 కోట్లు!

- 2023-24లో ఫార్మెక్సిల్ అంచనా
- జూలై 5 నుంచి హైటెక్స్‌లో ఐఫెక్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశం నుంచి ఔషధ ఎగుమతులు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి వివిధ దేశాలకు సరఫరా అయ్యే ఫార్మా ఉత్పత్తుల విలువ రూ.2,29,600 కోట్లకు చేరుకుంటుందని ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. 2022-23లో ఇది 3.25% ఎగసి రూ.2,08,198 కోట్లు నమోదైందని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రవి ఉదయ భాస్కర్ మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. 'ఎగుమతుల విషయంలో ఇతర విభాగాలు అంతగా ప్రతిభ కనబర్చలేదు. అనేక ఎదురుగాలులు, ప్రపంచ సవాళ్లు ఉన్నప్పటికీ భారత ఫార్మా ఈ స్థాయి వృద్ధిని సాధించింది. ఎగుమతుల్లో 31% పైగా వాటా ఉన్న యూఎస్ విపణి స్థిరంగా ఉంది. ఇది నిరంతర వృద్ధిని సూచిస్తున్న సానుకూల సంకేతం. మొత్తం ఎగుమతులు 2023 ఏప్రిల్‌లో 10% పైగా, మే నెలలో 0.7% అధికం అయ్యాయి' అని వివరించారు.



మీడియాతో మాట్లాడుతున్న రవి ఉదయ భాస్కర్. చిత్రంలో లక్ష్మీ ప్రసన్న

ఐఫెక్స్ జూలై 5 నుంచి..

ఇంటర్నేషనల్ ఫార్మా ఎగ్జిబిషన్ (ఐఫెక్స్) జూలై 5 నుంచి ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో మూడు రోజులపాటు ఈ కార్యక్రమం జరుగనుందని ఫార్మెక్సిల్ రెగ్యులేటరీ అఫైర్స్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. 375కు పైగా ఎగుమతిదార్లు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించనున్నారు.

470 విమానాలకు ఎయిరిండియా ఆర్డర్

- ఎయిర్‌బస్, బోయింగ్‌తో ఒప్పందం
- డీల్ విలువ రూ.5,74,700 కోట్లు

న్యూఢిల్లీ: విమానయాన రంగ సంస్థ ఎయిరిండియా 470 విమానాలకు ఆర్డర్ ఇచ్చింది. ప్యారిస్ ఎయిర్ షో సందర్భంగా ఎయిర్‌బస్, బోయింగ్‌తో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు మంగళవారం ప్రకటించింది. డీల్ విలువ రూ.5,74,700 కోట్లు. టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా వైడ్ బాడీ ఎయిర్‌క్రాఫ్ట్‌లతో సహా 470 విమానాలను కొనుగోలు చేయనున్నట్లు 2023 ఫిబ్రవరిలో ప్రకటించిన సంగతి తెలిసిందే.



ఈ ఏడాది చివర్లో కొత్త ఎయిర్‌క్రాఫ్ట్ డెలివరీలకు ఎయిర్‌బస్ ఏ350 నాయకత్వం వహిస్తుందని, 2025 మధ్య కాలం నుండి ఆర్డర్‌లో ఎక్కువ భాగం విమానాలు ల్యాండ్ అవుతాయని కంపెనీ పేర్కొంది. దీర్ఘకాలిక వృద్ధి, విజయానికి పెద్ద అడుగు పడిందని టాటా సన్స్, ఎయిరిండియా చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

ప్రైవేట్ కార్లకు కనీసం రూ. 2,094

- టూ-వీలర్లకు రూ. 538
- థర్డ్ పార్టీ బేస్ ప్రీమియం రేట్ల ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను (2023-24) వివిధ రకాల వాహనాల థర్డ్-పార్టీ మోటార్ ఇన్సూరెన్స్‌కి సంబంధించి కేంద్రం కొత్త బేస్ ప్రీమియం రేట్లను ప్రతిపాదించింది. బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐతో సంప్రదించిన మీదట 1,000 సీసీ సామర్థ్యం లోపు గల ప్రైవేట్ కార్లకు రూ. 2,094, 1000-1,500 సీసీ కార్లకు రూ. 3,416, అంతకు మించిన వాటికి రూ. 7,897 బేస్ ప్రీమియంను సూచించింది. కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ ఈ మేరకు ఒక ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. పరిశ్రమ వర్గాలు 30 రోజుల్లోగా దీనిపై అభిప్రాయాలు చెప్పాలి. నోటిఫికేషన్ ప్రకారం..

- 75 సీసీ లోపు సామర్థ్యమున్న టూ-వీలర్లకు రేటు రూ. 538గాను, అంతకు మించి 350 సీసీ వరకు రూ. 714-2,804 శ్రేణిలోనూ బేస్ ప్రీమియం ఉండనుంది.



- గూడ్స్ రవాణా చేసే వాణిజ్య వాహనాలకు సంబంధించి (త్రిచక్ర వాహనాలు కాకుండా) 7,500 కేజీలలోపు వైతే రూ. 16,049, అది దాటి 40,000 కేజీలు.. అంతకు పైన వాటికి రూ. 27,186-44,242 శ్రేణిలో బేస్ ప్రీమియం రేటు ఉంటుంది.
- ఈ-కార్టులు మినహా మోటార్ త్రీ-వీలర్లకు బేస్ ప్రీమియంను రూ. 4,492గా ప్రతిపాదించారు.
- అటు ప్రైవేట్ ఈ-కార్ల విషయానికొస్తే.. 30 కిలోవాట్ సామర్థ్యం ఉన్న వాటికి రూ. 1,780, అంతకు మించి 65 కేడబ్ల్యూ వరకు రూ. 2,904, దాన్ని దాటితే రూ. 6,712 గాను బేస్ ప్రీమియం ఉండనుంది.

నష్టాల్లోంచి లాభాల్లోకి...

- ఆదుకున్న ఆఖరి గంట కొనుగోళ్లు
- మళ్లీ 18,880 పైకి నిఫ్టీ



ముంబై: ట్రేడింగ్ చివర్లో ఐటీ, ఇంధన, విద్యుత్, వినిమయ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు మంగళవారం కనిష్ట స్థాయిల నుంచి రికవరీ అయ్యాయి. ఉదయం సెషన్‌లో 366 పాయింట్లను కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 159 పాయింట్ల లాభంతో 63,328 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 94 పాయింట్ల పతనం నుంచి తేరుకొని 61 పాయింట్లు బలపడి 18,817 వద్ద ముగిసింది.

రూపీకి రెండు వారాల్లో అతిపెద్ద నష్టం

ఫారెక్స్ మార్కెట్లో రూపాయి రెండువారాల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూసింది. డాలర్ మారకంలో 18 పైసలు పతనమై 82.12 స్థాయి వద్ద స్థిరపడింది.

జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద

బెంచ్‌మార్క్ సూచీల అనూహ్య రికవరీతో ఇన్వెస్టర్ల సంపద సైతం జీవితకాల గరిష్టానికి చేరుకుంది. సెన్సెక్స్ జోరుతో మంగళవారం ఒక్క రోజే రూ.1.08 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఫలితంగా ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ జీవితకాల గరిష్ట స్థాయి రూ.293.51 లక్షల కోట్లకు చేరింది.

భవిత

జాబ్ పాయింట్

తెలంగాణ కేజీబీవీల్లో 1241 అధ్యాపక పోస్టులు

తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ.. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయా (కేజీబీవీ)ల్లో.. మహిళా కాంట్రాక్ట్ అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1241

» **పోస్టుల వివరాలు (కేజీబీవీలు):** స్పెషల్ ఆఫీసర్-38, పీజీసీఆర్‌టీ(ఇంగ్లిష్)-110, పీజీసీఆర్‌టీ (గణితం)-60, పీజీసీఆర్‌టీ(నర్సింగ్)-160, పీజీసీఆర్‌టీ(తెలుగు)-104, పీజీసీఆర్‌టీ(ఉర్దూ)-02, పీజీసీఆర్‌టీ(వృక్షశాస్త్రం)-55, పీజీసీఆర్‌టీ(కెమిస్ట్రీ)-69, పీజీసీఆర్‌టీ(సివిక్స్)-55, పీజీసీఆర్‌టీ(కామర్స్)-70,పీజీసీఆర్‌టీ(ఎకనామిక్స్)-54, పీజీసీఆర్‌టీ(ఫిజిక్స్)-56, పీజీసీఆర్‌టీ(జంతుశాస్త్రం)-54, పీజీసీఆర్‌టీ(బయో సైన్స్)-25, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-52, సీఆర్‌టీ(హిందీ)-37, సీఆర్‌టీ(గణితం)-45, సీఆర్‌టీ(ఫిజికల్ సైన్స్)-42, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-26, సీఆర్‌టీ(తెలుగు)-27, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్-77. ఈ పోస్టులకు మహిళలు మాత్రమే అర్హులు.

» **అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యూఆర్ఎస్):** పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. స్పెషల్ ఆఫీసర్-04, సీఆర్‌టీ(తెలుగు)-05, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-05, సీఆర్‌టీ(సైన్స్) -06, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-03.

» **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, పీజీ, బీఈడీ/బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్) /యూజీపీఈడీ/బీపీఎడ్ ఉత్తీర్ణతతోపాటు టెట్/సీటెట్‌లో అర్హత సాధించి ఉండాలి. » **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

» **సీఆర్‌టీ పోస్టులు:** రాతపరీక్ష(80 శాతం వెయిటేజీ), టెట్(20 శాతం వెయిటేజీ)లో పొందిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.

» **స్పెషల్ ఆఫీసర్:** రాతపరీక్ష(75 శాతం వెయిటేజీ), టెట్(20 శాతం వెయిటేజీ), పని అనుభవం(5 శాతం వెయిటేజీ)లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.

» **పీజీసీఆర్‌టీ పోస్టులు:** రాతపరీక్ష(95 శాతం వెయిటేజీ), పని అనుభవం(5 శాతం వెయిటేజీ)లో పొందిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.

» **పీఈటీ పోస్టులు:** రాతపరీక్ష(100 శాతం వెయిటేజీ)లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.

» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 26.06.2023

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.07.2023.

» **స్పెషల్ ఆఫీసర్ పోస్టుల రాతపరీక్ష(ఆన్‌లైన్):** జూలై 2023.

» **పీజీసీఆర్‌టీ పోస్టుల రాతపరీక్ష(ఆన్‌లైన్):** జూలై 2023.

» **వెబ్‌సైట్:** www.schooledu.telangana.gov.in

ఐఐఎస్ఈఆర్, తిరుపతిలో టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్).. తిరుపతి వివిధ విభాగాల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 32

» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-07, అసిస్టెంట్ ప్రొఫెసర్-25.

» **విభాగాలు:** బయాలజీ, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ క్లైమేట్ సైన్స్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్.

» **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ,పీహెచ్‌డీతోపాటు పని అనుభవం ఉండాలి.

» **ప్రారంభ వేతనం:** ప్రొఫెసర్‌కు రూ.1,59,100, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,01,500 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ/ప్రజెంటేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.07.2023.

» **వెబ్‌సైట్:** www.iisertirupati.ac.in

జోసా.. కౌన్సెలింగ్ ఇలా!

» ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, జీఎఫ్‌టీఐల్లో ప్రవేశాలకు జోసా
» అడ్వాన్స్‌డ్, మెయిన్స్ ఉత్తీర్ణులకు జోసా కౌన్సెలింగ్‌తోనే అడ్మిషన్
» ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహణ
» ఈ నెల 19 నుంచి ప్రారంభమైన రిజిస్ట్రేషన్

జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ.. సంక్షిప్తంగా జోసా! జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్ ర్యాంకుల ఆధారంగా.. ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర సాంకేతిక విద్యా సంస్థల్లో.. ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించే ప్రత్యేక వ్యవస్థ! ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి కౌన్సెలింగ్ జరిపే జోసా-2023కు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. జోసా కౌన్సెలింగ్ పూర్తి వివరాలు..

50 వేలకు పైగా సీట్లు

- 23 ఐఐటీలు, 31 ఎన్ఐటీలు, 26 ట్రిపుల్ ఐటీలు,కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మరో 38 టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో మొత్తం 54,477 సీట్లు అందుబాటులో ఉంటాయి. **ఇన్‌స్టిట్యూట్స్ వారీగా సీట్ల వివరాలు:** ఐఐటీలు-16,598, ఎన్ఐటీలు-23,994, ట్రిపుల్ ఐటీలు-7,126, జీఎఫ్‌టీఐలు -6,759.
- ఈ ఏడాది కూడా మహిళా విద్యార్థులకు 20 శాతం తక్కువ కాకుండా.. సూపర్ న్యూమరరీ కోటా పేరుతో ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని నిర్ణయించారు.

ఛాయిస్ ఫిల్లింగ్

- జేఈఈ-అడ్వాన్స్‌డ్, మెయిన్‌లో అర్హత సాధించిన విద్యార్థులు జోసా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని.. తమ వివరాలు పొందుపరచాలి. తమ ఆసక్తి మేరకు కోర్సు, ఇన్‌స్టిట్యూట్ ప్రాథమ్యాలను ఆన్‌లైన్‌లోనే పేర్కొనాల్సి ఉంటుంది. ఇలా ప్రాథమ్యాలను పేర్కొనడాన్నే.. ఛాయిస్ ఫిల్లింగ్ అంటారు.
- ఆన్‌లైన్‌లో ప్రాథమ్యాలను పొందుపరిచిన తర్వాత విద్యార్థులు ఎంచుకున్న కోర్సు, ఇన్‌స్టిట్యూట్, అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది. ఉదాహరణకు.. ఒక విద్యార్థి మొదటి ప్రాథమ్యంగా ఐఐటీ-ఢిల్లీలోని సీఎస్ఈ బ్రాంచ్‌ను, రెండో ప్రాథమ్యంగా ఐఐటీ-ముంబైలోని సీఎస్ఈ బ్రాంచ్‌ను ఎంచుకుంటే..ఆ విద్యార్థి పొందిన ర్యాంకు ఆధారంగా ఐఐటీ-ఢిల్లీలో సీటు లభించకపోతే.. ఐఐటీ-ముంబైలోని సీటుకు పరిగణనలోకి తీసుకుంటారు.

అడ్వాన్స్‌డ్‌తో అన్నింటికీ అర్హత

జేఈఈ-అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్‌టీఐలు.. ఇలా అన్ని ఇన్‌స్టిట్యూట్‌లను తమ ప్రాధాన్యత క్రమంలో పేర్కొనొచ్చు. మెయిన్‌లో అర్హత సాధించిన వారు నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్‌టీఐల్లో సీటు కోసం ఆన్‌లైన్ దరఖాస్తు, ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తి చేయాలి. వీరికి ఐఐటీలకు అర్హత ఉండదు.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఇలా

- ఆన్‌లైన్ విధానంలో జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ మొత్తం ఆరు రౌండ్లలో జరుగుతుంది. మొదటి రౌండ్ నుంచి ఆరో రౌండ్ వరకు.. కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు ఫ్రీజ్, స్లైడ్, ఫ్లోట్ ఆప్షన్లు అందుబాటులో ఉంటాయి.
- **ఫ్రీజ్:** మొదటి రౌండ్‌లోనే తమకు సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్, ప్రోగ్రామ్‌తో సంతృప్తి చెందితే ఫ్రీజ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. దీంతో తదుపరి రౌండ్లకు ఛాయిస్‌లను పరిగణనలోకి తీసుకోరు. తొలిదశలో సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్‌లోనే జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.
- **స్లైడ్:** మొదటి రౌండ్‌లో నిర్దిష్టంగా ఒక ఇన్‌స్టిట్యూట్‌లో ఒక బ్రాంచ్‌లో సీటు వచ్చిన విద్యార్థి.. అదే ఇన్‌స్టిట్యూట్‌లో మరో బ్రాంచ్‌లో సీటు కోరుకుంటే స్లైడింగ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.
- **ఫ్లోట్:** మొదటి రౌండ్(దశ)లో వచ్చిన సీటు నచ్చకపోతే.. మరింత మంచి ఇన్‌స్టిట్యూట్ లేదా బ్రాంచ్ కోసం ఫ్లోటింగ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఫలితంగా ఆ విద్యార్థి ప్రాథమ్యాలను తదుపరి రౌండ్లకు పరిగణనలోకి తీసుకుంటారు.
- ఇలా ఫ్లోటింగ్, స్లైడింగ్ ఆప్షన్లు పేర్కొనడం వల్ల అభ్యర్థులకు చివరగా కేటాయించిన సీట్లే ఖరారవుతాయి. తొలిదశలో లేదా అంతకుముందు దశల్లో వచ్చిన సీట్లు రద్దవుతాయి.

మాక్ సీట్ అలొకేషన్

- జోసా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు..అదే రోజు నుంచి 'ఛాయిస్ ఫిల్లింగ్' ఆప్షన్‌ను వినియోగించుకుని.. తమ ప్రాథమ్యాలను(ఆసక్తి ఉన్న ఇన్‌స్టిట్యూట్, బ్రాంచ్ వివరాలు) ఆన్‌లైన్‌లో పేర్కొనాలి. ఇలా ఆన్‌లైన్‌లో నిర్దేశిత గడువు తేదీలోగా ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు ముందుగా.. మాక్ సీట్ అలొకేషన్(నమూనా సీటు కేటాయింపు) వివరాలను అందుబాటులో ఉంచుతారు. అంటే.. అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్ల ఆధారంగా సీటు వచ్చే అవకాశం ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లు, బ్రాంచ్‌ల వివరాలు తెలుస్తాయి. మాక్ సీట్ అలొకేషన్ జాబితాను బేరీజు వేసుకున్న విద్యార్థులు.. తమ ర్యాంకుకు ఇంకా మంచి ఇన్‌స్టిట్యూట్‌లో సీటు వస్తుందనుకుంటే..ఆప్షన్లను మార్చుకునే వెసులుబాటు కూడా కల్పిస్తారు.



ఆమోదం లేదా ఉపసంహరణ

సీట్లు పొందిన విద్యార్థులు.. ప్రతి రౌండ్ తర్వాత సీటు యాక్సెప్టెన్స్ లేదా ఉపసంహరణ విషయాన్ని స్పష్టం చేయాలి. మొత్తం ఆరు రౌండ్ల కౌన్సెలింగ్‌లో అయిదో రౌండ్ వరకే ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. చివరి రౌండ్(ఆరో రౌండ్)లో ఉపసంహరణకు వీలుండదు.

రిపోర్టింగ్ తప్పనిసరి

ప్రతి రౌండ్ సీట్ అలొకేషన్ తర్వాత విద్యార్థులు నిర్దిష్ట గడువులోపు తమకు సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి పేర్కొన్న రిపోర్టింగ్ సెంటర్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఇలా రిపోర్ట్ చేయకపోతే.. సీటు రద్దవుతుంది. విద్యార్థులు తమకు ఆసక్తి లేని ఇన్‌స్టిట్యూట్‌లో చేరాల్సి వస్తుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కారణం.. ఒక రౌండ్‌లో నచ్చిన ఇన్‌స్టిట్యూట్ లేదా బ్రాంచ్ పట్ల ఆసక్తి లేకుంటే.. మిగతా రౌండ్లకు తమ ఆప్షన్లను పరిగణనలోకి తీసుకునేలా సరళీకృత విధానం అమల్లో ఉంది.

సీట్ యాక్సెప్టెన్స్ ఫీజు తప్పనిసరి

- జోసా కౌన్సెలింగ్ విధానంలో సీటు పొందిన అభ్యర్థులు తప్పనిసరిగా సీట్ యాక్సెప్టెన్స్ ఫీజును చెల్లించాలి. దీన్ని కూడా ఆన్‌లైన్ విధానంలో నెట్ బ్యాంకింగ్ లేదా డెబిట్ కార్డ్ లేదా ఎస్‌బీఐ ఈ-చలాన్ రూపంలో మాత్రమే చెల్లించాలి.
- ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో సీటు పొందిన జనరల్ కేటగిరీ విద్యార్థులు రూ.35 వేలు;ఎస్సీ,ఎస్టీ, పీడబ్ల్యుడీ విద్యార్థులు రూ.15 వేలు చొప్పున యాక్సెప్టెన్స్ ఫీజు చెల్లించాలి.తర్వాత దశలో చివరగా తాము ప్రవేశించిన ఇన్‌స్టిట్యూట్‌కు అనుగుణంగా అకడమిక్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

కోర్ మొదలు ఏఐ వరకు

ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్‌టీఐల్లో సివిల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్,మెకానికల్,ఎలక్ట్రికల్ వంటి కోర్ బ్రాంచ్‌లు మొదలు.. తాజాగా డిమాండ్ నెలకొన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డేటా సైన్స్ వరకూ.. వినూత్న కోర్సులు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. బయోమెడికల్ ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, బయో ఇంజనీరింగ్, బయోటెక్ ఇంజనీరింగ్ తదితర వైద్య అనుబంధ కోర్సులను సైతం ఐఐటీలు, ఎన్ఐటీలు అందిస్తున్నాయి.

ఆ బ్రాంచ్‌లకే ఓటు

- ఐఐటీల్లో చేరే టాప్ ర్యాంకర్లు ముఖ్యంగా అయిదు బ్రాంచ్‌లకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మొదటగా సీఎస్ఈ డిమాండింగ్ బ్రాంచ్‌గా అగ్రస్థానంలో ఉంటోంది. ఆ తర్వాత ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్,సివిల్, మెకానికల్‌లను విద్యార్థులు ఎంచుకుంటున్నారు. గత రెండేళ్లుగా అడ్వాన్స్‌డ్‌లో నాలుగు వేలలోపు ర్యాంకు పొందిన విద్యార్థులందరూ దాదాపు ఈ బ్రాంచ్‌లలోనే చేరారు.
- నాలుగేళ్ల ప్రోగ్రామ్‌ల్లో అడ్మిషన్ లభించని విద్యార్థులు..అయిదేళ్ల కోర్సుల్లో సీటు దక్కినా చేరేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా సీఎస్ఈ విషయంలో నాలుగేళ్ల బీటెక్‌లో సీటు లభించకపోతే.. అయిదేళ్ల డ్యూయల్ డిగ్రీలో చేరేందుకు సైతం వెనుకాడట్లేదు.

జోసా-2023 ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ముఖ్య తేదీలు

- **జూన్19:** జోసా వెబ్‌సైట్‌లో అభ్యర్థుల రిజిస్ట్రేషన్, ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ ప్రారంభం.
- **జూన్ 25:** మాక్ సీట్ అలొకేషన్ (సీట్ల కేటాయింపు నమూనా జాబితా)-1 విడుదల. (జూన్ 24 రాత్రి 8 గంటల వరకు అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాల ఆధారంగా దీన్ని విడుదల చేస్తారు.
- **జూన్ 27:** మాక్ సీట్ అలొకేషన్ (సీట్ల కేటాయింపు నమూనా జాబితా)-2 విడుదల. (జూన్ 26 సాయంత్రం అయిదు గంటల వరకు పేర్కొన్న ప్రాథ్యమాల ఆధారంగా వెల్లడించనున్నారు).
- **జూన్ 28:** ఛాయిస్ ఫిల్లింగ్, క్యాండిడేట్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ.
- **జూన్ 29:**వివరాల పునస్సమీక్ష, పరిశీలన.
- **జూన్ 30:** మొదటి రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూన్ 30-జూలై 4:** మొదటి రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిపోర్టింగ్ చేయాలి. అదే విధంగా యాక్సెప్టెన్స్ ఫీజును చెల్లించాలి. నిర్దేశిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి.
- **జూలై 6:** రెండో దశ సీట్ల కేటాయింపు.
- **జూలై 6-10:** రెండో రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ల అప్‌లోడ్.
- **జూలై 7-11:** రెండో రౌండ్‌లో పొందిన సీటు విషయంలో ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ ప్రక్రియ నుంచి విరమించుకునే అవకాశం.
- **జూలై 12:** మూడో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 12-14:** మూడో రౌండ్ సీట్ల కేటాయింపునకు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్,డాక్యుమెంట్ అప్‌లోడ్.
- **జూలై 13-15:** మూడో రౌండ్ తర్వాత సీటు ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ ప్రక్రియ నుంచి ఉపసంహరణ.
- **జూలై 16:** నాలుగో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 16-19:** నాలుగో రౌండ్‌కు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ అప్‌లోడ్.
- **జూలై 18-20:** నాలుగో రౌండ్ తర్వాత సీటు ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ నుంచి ఉపసంహరణ అవకాశం.
- **జూలై 21:** అయిదో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 21-24:** అయిదో రౌండ్‌కు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, డాక్యుమెంట్ అప్‌లోడ్, ఫీజు పేమెంట్.
- **జూలై 21-25:** అయిదో రౌండ్ తర్వాత సీటు విత్‌డ్రా లేదా కౌన్సెలింగ్ నుంచి ఉపసంహరణ అవకాశం.
- **జూలై 26:** ఆరో రౌండ్(చివరి రౌండ్) సీట్ల కేటాయింపు.
- **జూలై 26-28:** ఆరో రౌండ్‌లో పొందిన సీటుకు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు చెల్లింపు.
- **వెబ్‌సైట్:** https://josaa.nic.in





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.